ఆగస్టు
2016

124

సంపుటి : 11 సంచిక : 4 వెల రు. 10/-

## ఈ సంచికలో........

హిందూత్వ జాతీయవాదం - మీడియా
శాఖల పని విధానం
ఉగ్రవాద కేంద్రాలుగా అమెరికా, నాటో దేశాలు
నేను ఎందుకు నాస్తికుడనయ్యాను?
అమెరికా అణు విద్యుత్ : దేశానికి భారం
ధ్యాన మార్గం సర్వరోగ నివారిణి అవుతుందా?
హింసాకాండకు ప్రతిఘటన
గేట్స్ ఫౌండేషన్ దాతృత్వ పెట్టుబడి వ్యూహం
ఒక వ్యవస్థలో అంతర్భాగంగా కులాన్ని పరిశీలించాలి
నైజాంను మించిన నెహ్రూ సైన్యం నిర్బంధకాండ


# నైజాంను మించిన నెహ్రూ సైన్యం నిర్బంధకాండ

## తెలంగాణ సాయుధ పోరాట జ్ఞాపకాలు

గుండ్ల దైవాదీనం

ఆ రోజుల్లో నేను వల్లాపురం గ్రామంలోని సంఘ నాయకుల అనుమతితో మొదటి సారి కొరియర్‌గా నియమింపబడ్డాను. రహస్యంగా పత్రికలు తెచ్చే పనిని సంఘం అప్పజెప్పింది. వల్లాపురం ఆనాడు వరంగల్ జిల్లా, ఖమ్మం తాలూకాలో ఉన్నది. (ఈనాడు ఆ గ్రామం వైరా మండలం, ఖమ్మం జిల్లాలో ఉంది) పై నాయకులు అప్పగించిన పని, కృష్ణాజిల్లా వత్సవాయి గ్రామం (ఆంధ్రాలో ఉండేది) ఆ గ్రామం నుండి 5 ప్రజాశక్తి పత్రికలు తీసుకొని 1. గార్లపాడు 2. గోవిందాపురం 3. ప్రొద్దుటూరు 4. తూటికట్ల 5. వల్లాపురంలో ఇచ్చేవాడిని. ఆ ఊరికి వత్సవాయి అందాజ 20 కి.మీ.లు ఉంటుంది.

ఆ పేపర్లు పంచుకుంటూ సాయంత్రం 4 గంటలకు ఇల్లు చేరేవాణ్ణి. ఆకలైతే ఎక్కడైనా అన్నం తినేవాణ్ణి. ప్రతి ఇంట్లో ఆదరణ ఉండేది. 1948 వరకు, అంటే యూనియన్ సైన్యాలు అనగా (నెహ్రూ సైన్యాలు) నైజాంను ఆక్రమించుకొనే వరకు పై బాధ్యతల్లోనే ఉండేవాడిని. ఆ రోజుల్లో దళాలను ప్రజా సైన్యాలుగా పిలుస్తూ ఉండేవాళ్ళం. ఆ రోజుల్లో పటేల్, పట్వారి, కర్ణాల దస్తావేజులను స్వాధీనం చేసుకోవడమో లేక తగులబెట్టడమో చేసేవారు. రోడ్లను ధ్వంసం చేయడం ఉండేది. పోలీసులు తొందరగా గ్రామాల్లోకి చేరుకోకుండా దళాలు ఎత్తుగడలు వేస్తుండేవి. ఆ రోజులలో కల్లు నిషేధించాలని సంఘం పిలుపునిస్తే, తాటి చెట్లను, ఈతచెట్లను కూడా నరకడమో, పనికి రాకుండా చేయడమో జరిగేది. దానిపై జీవించే గౌడ కుటుంబాలు కూడా దీనికి సహకరించేవి. కల్లుగీతకు ఉపయోగించే సామాన్లను కూడా దళాలకు స్వచ్ఛందంగా అప్పగించేవారు. గ్రామాలలో భూస్వాములు, పటేళ్ళు, పట్వారీలు, కర్ణాల మీద దళాల హెచ్చరికలు చేస్తుండేవి. కొంతమంది భూస్వాములు, కర్ణాలు, పటేళ్ళు, పట్వారీలు గ్రామాలు వదిలి పట్టణాలకు వలస



వెళ్ళారు. అదే సమయంలో ఆ గ్రామాల పరిధిలోని అతిపెద్ద భూస్వామి నాగులపంచ జమీందారు. అతను అప్పటికే నాగులపంచ గ్రామం వదిలి పట్టణానికి వెళ్ళడం జరిగింది. ఆ జమీందారు ఆ గ్రామాల్లో అనేక వస్తు సామాగ్రిని సేకరించి ప్రజలను భయభ్రాంతులకు గురిచేసి, పశువులను కూడా సేకరించి కూడబెట్టుకున్న రోజులవి.

అదే గ్రామాన్ని దళాలు కాపలా కాస్తుండగా నాగులపంచ జమీందారి గడిని 300 మంది ప్రజలతో ఆక్రమించి, ప్రజల నుండి పోగు చేసినటువంటి వస్తువులను ప్రజలు వశపర్చుకున్నారు. ఆ రోజులలో గ్రామాల్లో దళాలకు, సంఘాలకు ఎదురులేదు. పిల్లలు, పెద్దలు, ముసలి, ముతక, ఆడ, మగ తేడా లేకుండా ఎంత కఠినమైన పని వచ్చినా, ఎంతటి త్యాగాలకైనా వెరవకుండా గ్రామం అంతా ఒకటిగా సంఘటితంగా ఉండేవాళ్ళు. ఆ రోజులలో భూస్వాముల భూములను దళాలు వచ్చి పంచేవి. వారు ఎవరికి ఎంత గెట్టు పెడితే అంతే దున్నుకుంటూ ఉండేవారు. గ్రామంలో నాయకుడి మాటకు అందరూ ఆనందంగా కట్టుబడి ఉండేవారు. 1948 ఆగస్టులోనో, నవంబర్‌లోనో లేక డిసెంబర్‌లోనో కరెక్టుగా అయితే గుర్తులేదు కానీ యూనియన్ మిలిటరీ 300 మంది పోలీసులతో తెల్లవారు ఝామున వల్లాపురం ఊరంతటినీ పూర్తిగా చుట్టుముట్టారు. ప్రతిరోజూ గ్రామంలోని మిలిటెంట్ నాయకులు రాత్రిపూట అడవిలో పడుకొని తెల్లవారు ఝామున 4 గంటలకు గ్రామంలోకి వచ్చేవారు. ఆ రోజు కూడా అలాగే వచ్చారు. వారు వచ్చిన 30 నిమిషాలలోనే నెహ్రూ సైన్యాలు సంఘ నాయకుల ఇండ్లమీద పడి ఒకే సమయంలో ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు. అందులో మా మేనమామ అయిన చిన్నబ్బి ఒక నాయకుడు. మా ఇంటి మీదికి దాడికి వచ్చే సందర్భంలో మా అమ్మ నన్ను నిద్రలేపింది. నేను వారిని ఒకేసారి చూసి నివ్వెరపోయి గోడ దూకి దగ్గరలో ఉన్న చొప్పదండిలో దూరాను. నన్ను మా మామ చిన్నబ్బి అని వెంటపడి పట్టుకొని బయటకు లాగి విపరీతంగా కొట్టే సమయంలో నా తల్లి నెహ్రూ సైన్యం కాళ్ళపై పడి నా కొడుకును కొట్టకండయ్యా అని వేడుకునే సమయంలో సైన్యంలో ఉన్న ఒక ఇన్‌ఫార్మర్ (మా కుటుంబ సభ్యుల వివరాలు తెలిసిన ఇన్‌ఫార్మర్) ఆయన నారాయణపురం వ్యక్తి. నేను చిన్నబ్బిని కాను అని నిర్ధారించి మా ఇంట్లో ఉన్న మా మామను అదుపులోకి తీసుకున్నారు. అలా ఐదుగురిలో 1. మా మామ చిన్నబ్బి 2 చేదే నారాయణ 3 గుత్తా కొండయ్య 4. నల్లమోతు కోటయ్య 5. బండి నాగయ్య (బండి నాగయ్య బ్రతికే ఉన్నారు. 90 సంవత్సరాల వయస్సు) తర్వాత తెలిసిన సమాచారం ఏకకాలంలో 13 గ్రామాల మీద దాడిచేసి 36 మంది నాయకులను అదుపులోకి తీసుకొని చిత్రహింసలు పెట్టుకుంటూ బోనకల్ పోలీస్‌స్టేషన్‌కి తీసుకెళ్ళారు. ఆ రోజున నెహ్రూ సైన్యం ప్రదర్శించిన బీభత్సకాండ నైజాం రజాకార్లు కూడా అంతటి నీచత్వం ప్రదర్శించలేదు. పిల్లలు, ఆడ, మగ, వృద్ధులు అనే తారతమ్యం లేకుండా అడ్డు వచ్చిన ప్రతి వారిని చావమోదారు. అదే రోజులలో కొంత కాలానికి నా ఆరోగ్యం కుదుటపడిన తర్వాత మా గ్రామంలోని మొత్తం నాయకత్వం జైలుకెళ్ళిన కారణంగా అప్పుడే నాకు పార్టీ సభ్యత్వం ఇచ్చి మా గ్రామ శాఖ కార్యదర్శిగా 9 మందిని కమిటీ సభ్యులుగా తీసుకోవడం జరిగింది. ఈ కమిటీని పునర్నిర్మాణం చేసేరోజు రాత్రి 9 గంటల 30 నిముషాలకు దళ నాయకులు చుండూరు నర్సింహారావు, కొడిదిని సీతారామయ్య, అమరయ్యగార్లు వచ్చి శాఖను నిర్మించడం

(మిగతా 35వ పేజీలో)

## ఈ సంచికలో...


1. నైజాంను మించిన నెహ్రూ సైన్యం నిర్బంధకాండ
గుండ్ల దైవాదీనం .......... 2

2. హిందూత్వ జాతీయవాదం - మీడియా
సీతారాం ఏచూరి .......... 4

3. శాఖల పని విధానం
ఎస్ వీరయ్య ............... 8

4. ఉగ్రవాద కేంద్రాలుగా అమెరికా, నాటో దేశాలు
ఎ కోటిరెడ్డి............... 11

5. నేను ఎందుకు నాస్తికుడనయ్యాను?
భగత్‌సింగ్ ............... 16

6. అమెరికా అణు విద్యుత్ : దేశానికి భారం
ప్రబీర్ పుర్కాయస్థ ....... 23

7. ధ్యాన మార్గం సర్వరోగ నివారిణి అవుతుందా?
ఎ రవి .................. 25

8. హింసాకాండకు ప్రతిఘటన
ఇషితా ముఖోపాధ్యాయ్ . 28

9. గేట్స్ ఫౌండేషన్ దాతృత్వ పెట్టుబడి వ్యూహం
డా॥ ఊర్వశి అనేజా .... 30

10. ఒక వ్యవస్థలో అంతర్భాగంగా కులాన్ని పరిశీలించాలి
బి.వి. రాఘవులు ........ 33



సంపాదకుడు:
ఎస్. వెంకట్రావు

సంపాదక వర్గం:
పాటూరు రామయ్య
బి.వి. రాఘవులు
తమ్మినేని వీరభద్రం
ఎస్. వీరయ్య
తెలకపల్లి రవి

భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు)
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ తరపున
ప్రచురణ కర్త, ముద్రాపకుడు: బి.వి.రాఘవులు
సంపాదకుడు : ఎస్. వెంకట్రావు
ముద్రణ : ప్రజాశక్తి డైలీ ప్రింటింగ్ ప్రెస్, ప్లాట్ నెం 21/1, అజామాబాద్, హైదరాబాద్-20
ఫోన్: ఎడిటోరియల్ 0866-2577248
మేనేజర్: 040-27673787
email:venkataraosankarapu@gmail.com
visit cpi(m) site at : cpim.org


# పాతికేళ్ల తరువాత...

ప్రపంచ సోషలిస్టు వ్యవస్థ పతనమై పాతికేళ్లవుతోంది. 1989 -1991 మధ్య జరిగిన ఘటనలతో తూర్పుయూరప్, సోవియట్ యూనియన్లలో సోషలిజం విఛ్చిన్నమైంది. భూగోళం మీద సామ్రాజ్యవాదానికి తిరుగులేని ఆధిపత్యం లభించింది. ప్రఛ్చన్న యుద్ధం ముగిసింది, అమెరికా నాయకత్వంలోని ఏకధృవ ప్రపంచంలో....యుద్ధాలు ఉండవనీ, శాంతి నెలకొంటుందనీ, స్వేచ్ఛావాణిజ్యంలో ప్రజారాశులు అన్ని విధాలా అభివృద్ధి చెందుతూ సుఖ సంతోషాలతో ఉంటారనీ సామ్రాజ్యవాద ప్రచార సాధనాలు ఊదరగొట్టాయి. అన్నీ లభిస్తున్న ప్రపచంలో మార్పును ఎవరు కోరుకుంటారు?... కనుక చరిత్ర ఇక అంతమైపోయినట్లేనని (ఎండ్ ఆఫ్ హిస్టరీ) జోస్యం చెప్పారు.

కానీ ఈ పాతికేళ్లలో ఏం జరిగింది? సామ్రాజ్యవాదం ప్రజలకిచ్చిన వాగ్దానం నెరవేరిందా? ఆకలి, దారిద్ర్యం, అశాంతి పోయిందా? మార్పు అక్కరలేదు, ఈ ప్రపంచంతో మేం సర్దుబాటు చేసుకుంటాం అని కార్మికులు, రైతులు, సామాన్య ప్రజానీకం అనుకుంటున్నారా? లేదు. ప్రజలు అలా అనుకోవడం లేదు. మార్పు వద్దు అని ప్రజలు అనుకుని ఉంటే గ్రీసులో కార్మిక తిరుగుబాటు వచ్చేది కాదు. ఫ్రాన్స్‌లో కార్మిక వెల్లువను ఆపేందుకు ఎమర్జెన్సీ విధించేవారు కాదు. అమెరికాలో కార్మికులు, ప్రజలు వాల్ స్ట్రీట్‌ను ముట్టడించేవారు కారు. బ్రిటన్ ప్రజలు ఐరోపా యూనియన్ నుండి బయటకు రావాలని (బ్రెగ్జిట్) తీర్పు ఇచ్చేవారు కాదు. భారత దేశంలో కార్మిక వర్గం పాతికేళ్లలో డజనుకు పైగా సార్వత్రిక సమ్మెలు నిర్వహించేది కాదు. మరోమారు సెప్టెంబర్ 2న సార్వత్రిక సమ్మెకు పూనుకునేది కాదు.

వాస్తవానికి పాతికేళ్లలో ప్రపంచం అభివృద్ధి చెందలేదని కాదు. కానీ ఈ అభివృద్ధి కొద్దిమంది వద్ద కేంద్రీకరించబడింది. విస్తారమైన ప్రజల వద్ద దారిద్ర్యం, ఆకలి, అనారోగ్యం, అభద్రత, నిరుద్యోగం కేంద్రీకరించబడ్డాయి. మొత్తం ప్రపంచంలో అసమానతలు విపరీతంగా పెరిగాయి. అందువల్లనే సామ్రాజ్యవాద ప్రపంచీకరణను ఆహ్వానించేవారి సంఖ్య రోజురోజుకూ తగ్గిపోతూ వస్తోంది. వ్యతిరేకత పెరుగుతూ వస్తోంది.

అభివృద్ధి విషయంలోనే కాదు ఇతర వాగ్దానాలను కూడా సామ్రాజ్యవాదం నెరవేర్చలేకపోయింది. ఈ పాతికేళ్ల కాలంలో సామ్రాజ్యవాదం తన ఆధిపత్య యుద్ధాలతో ప్రపంచాన్ని అతలాకుతలం చేసింది. సోవియట్ పతనంతోనే బాల్టిక్‌తో మొదలుపెట్టి ఇరాక్, ఆఫ్ఘనిస్థాన్, లిబియా, సిరియాలను యుద్ధాలతో ధ్వంసం చేసింది. ఆఫ్రికాలో అంతర్యుద్ధాలను ఎగదోసింది. తన ప్రపంచాధిపత్య వ్యూహాలతో మళ్లీ యూరప్, ఆసియాలను యుద్ధక్షేత్రాలుగా మార్చే తంత్రాలను రచిస్తోంది. ఒకనాడు 'కమ్యూనిస్టు ప్రమాదం' పేరుతో ప్రపంచంలోని అనేక ప్రాంతాలను అణ్వాయుధ స్థావరాలుగా మార్చేసిన అమెరికా నేడు 'ఉగ్రవాదంపై యుద్ధం' పేరుతో నాటో యుద్ధ కూటమిని విస్తరిస్తోంది. ప్రపంచ దేశాలపై యదేచ్ఛగా దాడులకు పాల్పడుతోంది. పేరు ఏం చెప్పినా వాస్తవానికి సామ్రాజ్యవాద యుద్ధాలన్నీ ప్రపంచ వనరులపైనా, మార్కెట్లపైనా ఆధిపత్యం కోసమేనన్నది చరిత్ర చెప్పిన సత్యం.

పాతికేళ్లుగా సామ్రాజ్యవాదం సృష్టించిన ప్రపంచీకరణ కలలు కరిగిపోతున్నాయి. లాటిన్ అమెరికాలో ప్రజలు ప్రత్యామ్నాయ మార్గాలు వెతుక్కుంటున్నారు. యూరప్‌లో కార్మికులు పోరాటబాట పడుతున్నారు. ఆసియా, ఆఫ్రికా దేశాల్లో ప్రజా ఉద్యమాలు ఉధృతమవుతున్నాయి. అదే సమయంలో అభివృద్ధినిరోధక శక్తులు కూడా విజృంభిస్తున్నాయి. అమెరికాలో మళ్లీ వర్ణవివక్ష జడలు విప్పుతోంది, యూరప్‌లో నయా-ఫాసిజం తలెత్తుతోంది, వర్ధమాన దేశాల్లో మతతత్వం, జాతులు ఘర్షణలు పెరిగిపోతున్నాయి.

రెండున్నర దశాబ్దాల సామ్రాజ్యవాద ప్రపంచీకరణతరువాత మళ్లీ ప్రజలు మార్పును కోరుకుంటున్నారని నేటి ప్రపంచ పోకడ తెలుపుతోంది. అయితే ఈ మార్పు అభివృద్ధివైపా, లేక అభివృద్ధి నిరోధంవైపా అనేది పోరాడే శక్తుల బలాబలాలపై ఆధారపడి ఉంటుంది.


చందా వివరాలు
విడిపత్రిక: రూ. 10, సంవత్సర చందా: రూ. 100, పోస్టు ద్వారా రూ. 120
పోస్టు ద్వారా లేదా ఏజెంటు ద్వారా తెప్పించుకోవచ్చు.
లేదా మీ స్థానిక పార్టీ కార్యాలయంలో సంప్రదించండి.
ప్రజాశక్తి బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలలోనూ లభిస్తాయి.

చిరునామా
మేనేజర్,
మార్క్సిస్టు (సైద్ధాంతిక మాసపత్రిక),
ఎం.బి. విజ్ఞానకేంద్రం,
డోర్ నెం. 27-30-3, ఆకులవారి వీధి,
గవర్నర్‌పేట, విజయవాడ-520 002

ఈ మాసం ముఖ్యాంశం

# హిందూత్వ జాతీయవాదం మీడియా

సీతారాం ఏచూరి



రచయిత సిపిఐ (ఎం) ప్రధాన కార్యదర్శి

జాతీయవాదం జాతీయోద్యమానికి పునాదివేసి, భారత పౌరులందరినీ ఒక చోటికి చేర్చిన ఒక విశేష భావన. దీని లక్ష్యం ఒక్కటే. భారతదేశమనే ఈ అందమయిన పూదోట నుండి విదేశీ సామ్రాజ్యవాద పాలకులను తరిమికొట్టడం. భారత జాతీయవాదం తానొక పాకిస్థాన్ హిందుత్వ కాకూడదని ఒక స్వప్నాన్ని కని, దానిని సాకారం చేసుకున్నది. ఇది 1950ల నాటిమాట. ఈ నాటి ఆధునిక యూరప్ విభిన్న జాతుల, భాషల, మతాల, వర్గాల, ప్రాంతాల ప్రజలను ఒకటిగా చేసేందుకు అతలాకుతల మవుతున్నది.

కాని ఈనాడు జాతీయ వాదాన్ని అందరినీ కలుపుకు పోయేందుకు కాక విడగొట్టేందుకు ముందుకు తీసుకు వస్తున్నారు. అనేక దేశాలలో పాలకులు తమ పాలనను స్థిరపరచుకునేందుకు ఈ పద్ధతిని అవలంభిస్తారు, విద్వేషాలు రెచ్చగొట్టయినా ప్రజాబలాన్ని తమ వైపు కూడగట్టుకునేందుకు ఉపయోగించుకుంటారు. మానవ నాగరికత చరిత్ర ఇటువంటి ఉదాహరణలతో నిండిపోయివుంది. ప్రస్తుతం భారతదేశంలోని మతోన్మాద శక్తుల నుండి, వారి జాతీయత భావన నుండి మనం ఆ విధమైన దాడిని ఎదుర్కొంటున్నాం. 1947లో భారతదేశం చీలిపోకముందు ఆ విధమైన ప్రయత్నమే చేశారు. ఆనాడు జాతీయోద్యమం దానిని నిర్ద్వందంగా తిరస్కరించింది.

ప్రస్తుత పరిస్థితులలో తరచుగా రాజకీయ పోరాటాలు వివిధ రకాలైన జాతీయవాద దృక్పథాలను ముందుకు తీసుకురావటంలో ప్రతిబింబిస్తుంటాయి. అణగారిన ప్రజల పోరాటాలను అణచివేయటానికి, తమ వర్గపాలనను సుస్థిరం చేసుకోవటానికి వివిధ దేశాలలోని పాలక వర్గాలు ఆ దేశానికి ప్రత్యేకమైన పౌరాణిక కథలను ప్రత్యేకమైన జాతీయవాద భావనల ద్వారా ముందుకు తీసుకురావటానికి ప్రయత్నిస్తుంటారు. (సామ్రాజ్యవాద ప్రపంచీకరణలో భారత దేశంలో నయా ఉదారవాద ఆర్థిక సంస్కరణలు, ఆర్‌యస్‌యస్, బిజెపిల జాతీయవాదం మధ్య నున్న సంబంధాన్ని 2016 జనవరి- మార్చి మార్క్సిస్ట్‌లో 'నేషనలిజం, హిందుత్వ అండ్ ది అసాల్ట్ ఆన్ థాట్' వ్యాసంలో ప్రభాత్ పట్నాయక్ అద్భుతంగా వివరించాడు) స్థానికంగా ప్రాచుర్యంలో ఉన్న పురాణ గాధలను ప్రజలలో వ్యాపింపజేసి అక్కడి అణగారిన ప్రజలు చేసే పోరాటాలను అణచివేసేందుకు వాటిని ఉపయోగించుకుంటారు.

మానవ నాగరికత పరిణామ క్రమంలో పురాణాలకు చరిత్రకు మధ్య బేధం, వేదాంతానికి తర్కానికి మధ్య తేడా పలచబడి పోతుంటుంది. అందువలననే పౌరాణిక గాధలు చారిత్రక వాస్తవాలుగా ఎంతో సులువుగా ప్రజలలోకి తీసుకుని వెళ్ళి, భిన్నమైన జాతీయ వాదానికి పునాదులుగా చూపగలుగుతున్నారు. ఇటువంటి అనేక అంశాలలో ఒకటైన, ఆధునిక జెరుసలెం రాజ్యస్థాపనకు పునాదులలో ఒకటిగా ఉన్న జెరూసలెం లోని డేవిడ్ పట్టణం, గుడి మంచి ఉదాహరణ. "ఈనాడు ఇజ్రాయిల్ తననుతాను సమర్ధించుకునేందుకు ఉపయోగపడేది కనీసం రెండు వేల ఏళ్ళ క్రిందటిచరిత్రే. ఆ తరువాతి కాలంలో జరిగిన చరిత్ర, ఆ దేశం చేసిన యుద్ధాలను, ఇజ్రాయిల్ ఆవిర్భావాన్ని సమర్ధించటానికి ఉపయోగపడవు. కాబట్టి తుడిచి వేయబడ్డాయి. జెరుసలెం యూదుల మతకేంద్రంగా ఉండేదనే వాదనకు, యూదులకు రాజధానిగా ఉండేదనే వాదనను సమర్ధించుకునేందుకు జెరుసలెంలో యూదుల గుడి ఉందన్న వాస్తవం ఒక ఆధునిక రాజకీయ వాస్తవంగా మలచబడింది. (రోమను సామ్రాజ్యానికి పూర్వం రాజధానుల గురించి మాట్లాడటం అర్ధరహితమన్నది వేరే విషయం) ఏమయినప్పటికీ ఇది అనేకమంది యూదులు తమ రాజ్యాన్ని ఏర్పాటు చేసుకోవటాన్ని సమర్ధించుకోవటానికి ఉపయోగించుకోవటంతో పాటు జెరూసలేంను రాజధానిగా చేసుకోవటాన్ని సమర్ధించుకొనేందుకు కూడా ఉపయోగపడింది. (నవశతాబ్దం, ఎరిక్‌హాబ్స్‌బామ్, లిటిల్, బౌన్ అండ్ కంపెనీ, 1999).

హాబ్స్‌బామ్ ఇంకా ఇలా "అంటున్నారు" జాతీయవాద కల్పితగాధలు ప్రజల వాస్తవ అనుభవాల నుండి యధాలాపంగా ఉత్పన్నం కావు. ఇవి ప్రజలు ఇతరుల నుండి, పుస్తకాల నుండి, చరిత్ర నుండి, సినిమాల నుండి, ప్రస్తుతం టెలివిజన్‌ల నుండి కూడా గ్రహిస్తారు. ఇవి సాధారణంగా చారిత్రిక జ్ఞాపకాలలోనూ, జీవన సాంప్రదాయాలలోనూ భాగంగా ఉండవు. కొన్ని ప్రత్యేక అంశాలలో మినహాయింపుగా మాత్రమే జాతీయవాద కల్పిత గాధలు మతం యొక్క ఉత్పాదనగా మారతాయి. ఇజ్రాయిల్ నుండి యూదులను బహిష్కరించటం, వారు తిరిగి తమ దేశానికి రావడం వారి మత కార్యకలాపాలలో,సాహిత్యంలో భాగమయింది. కొన్ని పరిమితులలో సెర్బ్‌ల విషయంలో కూడా ఇది కొంతమేరకు నిజమయింది. మధ్యయుగాలలో సెర్బులు రాజ్యాన్ని కోల్పోవటం సనాతన మతసేవలలో భాగమయింది. దాదాపు సెర్బియన్ రాజులందరూ ఆర్థడక్స్ విశ్వాసానికి నమూనాలుగా ఉన్నారు. ఇదొక ప్రత్యేకమైన అంశం. అయితే ఇక్కడ కూడా ప్రజలు దీనిని నిరంతరంగా గుర్తుంచుకోరు. కొందరు వారికి నిత్యం గుర్తు చేస్తుంటారు కాబట్టి గుర్తుంచుకుంటారు.

జర్మనీలో ఫాసిజం ఎదుగుతున్న కాలంలో హిట్లర్ ప్రత్యేకంగా నాజీ జాతీయవాదాన్ని రూపొందించి, ప్రజామోదం లభించేలా ప్రచారం చేశాడు. జర్మనీ ఒక పెద్ద "జాతీయజీవరాసి" అని, అందులో ప్రజలందరూ కణాలని హిట్లర్ భావించాడు. అందువలన జర్మన్ ప్రజలందరినీ ఐక్యం చేయాలన్న హిట్లర్ ప్రయత్నం జర్మన్ దేశ కణాలన్నింటినీ కలిపి ఒక దృఢమైన ఆకృతిని (రాజకీయ) రూపొందించటానికి చేసిన

ప్రయత్నానికి ప్రతిబింబం. జర్మనీ విచ్ఛిన్నం అవుతుందన్న హిట్లర్ ప్రకటన నుండి జాతీయ సోషలిజం పుట్టింది. అతని పోరాటం (మీన్ కాంఫ్) జర్మన్ రాజకీయ నిర్మాణం దృఢంగా–శక్తివంతంగా– జర్మనీని విచ్ఛిన్నం చేయాలన్న ఆంతరంగిక శక్తికి లొంగకుండా ఉండాలన్నది అతని ఆశ.

దీనిని ఏ విధంగా చేయాలి? హిట్లర్ ఆతని మీన్‌కాంఫ్‌లో తన ఫాసిస్టు తరహా జాతీయ వాదాన్ని ఈ విధంగా చెప్పుకున్నాడు. "ఈ ప్రపంచం మొత్తంలో సహజంగానే ఏ జాతికాజాతి ఏమాత్రం కల్తీ లేకుండా కొనసాగాలన్న కోరిక వలన ఒక జాతి వేరొక జాతి నుండి స్పష్టంగా విడివడి ఉంటుంది. వాటి మధ్య తేడాలు బాహాటంగా తెలుస్తాయి. రోజువారి జీవన పోరాటం రోగిష్టిగానూ, నిస్సత్తువగానూ, ఊగిసలాటతోనూ ఉన్న ప్రతిదానిని వెనక్కునెట్టి వేస్తుంది. ఈ పోరాటం జాతుల ఆరోగ్యాన్ని, పోరాట పటిమను పెంచుతుంది. జాతి శ్రేష్టమయినదిగా అభివృద్ధి చెందటానికి అవసరమైన కారణాలలో ఇదొకటి.

"ఇందుకు భిన్నంగా ఉంటే అభివృద్ధి ఆగిపోతుంది. అంతేకాదు తిరోగమనం ప్రారంభమవుతుంది. ఎప్పుడూ హీనులే ఉత్తముల కంటే అధిక సంఖ్యలో ఉంటారు. కాబట్టి హీనులకు, ఉత్తములకు ఒకే రకమయిన సంతాన సామర్ధ్యం ఉండి, ఇద్దరి సంఖ్యా ఒకటిగా ఉంటే పర్యవసానం ఉత్తముల నాణ్యత బలవంతంగా తగ్గించబడుతుంది. అందువలన నాణ్యతను సరైన పాళ్ళలో కాపాడేందుకైనా ఉత్తముల తరపున జోక్యం చేసుకోక తప్పదు."

దీని పర్యవసానంగానే లక్షలాది యూదులను తగలబెట్టడం, మానవత్వాన్ని మంట గలిపే దారుణ మారణహోమం, ఘోరనేరాలు జరిగాయి. ఈ అమానవీయ జాతీయవాద నిర్మాణాన్ని ఓడించడానికి, రూపుమాపడానికి భయంకరమైన ప్రపంచ యుద్ధం చేయాల్సివచ్చింది.

భారతదేశానికి సంబంధించినంత వరకు ఆర్ఎస్ఎస్/బిజెపి హీనులకు వ్యతిరేకంగా ఉత్తముల పాలనను స్థాపించాలన్న వాదనను గమనించండి (హీనులంటే ముస్లింలు, క్రిస్టియన్‌లు, మిగిలిన మైనారిటీ మతాలవారు, దళితులు, మహిళలు, వీరికి తోడు కమ్యునిస్టులు కూడా) రాజకీయశక్తి, సామాజిక నియంత్రణ అధీనంలో ఉన్న అధిపత్య గ్రూపు ఆలోచనలను వ్యతిరేకించేవారిని వారు భరించలేరు.

ఆర్ఎస్ఎస్ హిందుత్వ జాతీయవాదమే హిందూరాష్ట్ర స్థాపనకు వారి సైద్ధాంతిక సమర్థన ( అది హిందుయిజానికి చాలా దూరంగా ఉంటుంది. వాస్తవంగా దీనిని హిందూత్వ రాష్ట్ర అనవచ్చు). దీనికి ఆధారంగా" విదేశీ జాతులు దండెత్తి రాక ముందు ఎనిమిది వేల సంవత్సరాల నుండి, ఇంకా చెప్పాలంటే పదివేల సంవత్సరాల నుండీ కూడా అప్రతిహతంగా, అప్రతిఘటితంగా ఈ భూమి హిందువుల వశంలోనే ఉండింది. అందువలననే ఈ భూమి హిందూస్థాన్‌గా, హిందువుల భూమిగా పిలవబడుతున్నది" (ఉయ్ ఆర్ అవర్ నేషన్‌హుడ్ డిఫైన్డ్ యం యస్ గోల్వాల్కర్).

❝ భారతదేశానికి సంబంధించినంత వరకు ఆర్ఎస్ఎస్/బిజెపి హీనులకు వ్యతిరేకంగా ఉత్తముల పాలనను స్థాపించాలన్న వాదనను గమనించండి (హీనులంటే ముస్లింలు, క్రిస్టియన్‌లు, మిగిలిన మైనారిటీ మతాలవారు, దళితులు, మహిళలు, వీరికి తోడు కమ్యునిస్టులు కూడా) రాజకీయశక్తి, సామాజిక నియంత్రణ అధీనంలో ఉన్న అధిపత్య గ్రూపు ఆలోచనలను వ్యతిరేకించేవారిని వారు భరించలేరు.❞



హిట్లర్

హిందువుల ఔనత్యాన్ని ఈ విధంగా స్థిరీకరించి, హిందువులు ఎప్పుడూ ఒక జాతిగా ఉండేవారనీ, ఉంటారన్న ఒక అశాస్త్రీయమైన, చారిత్రిక విశ్లేషణకు నిలబడని వాదనను చేస్తున్నది ఆర్ఎస్ఎస్. హిందుత్వదేశం అసహనంగానూ, మత ప్రాతిపదికను ఆర్ఎస్ఎస్ ఘంటాపదంగా చెప్తున్నది. "ఏమాత్రం సందేహానికి తావులేని ముగింపు మన ముందున్నది... హిందూస్థాన్ హిందూదేశంగానే, పురాతన హిందూ దేశంగానే ఉంటుంది. ఈ దేశానికి సంబంధించని వారందరూ అంటే హిందూ జాతి, మతం, సంస్కృతి, భాషకు సంబంధించని వారు సహజంగానే"జాతి" జీవనానికి వెలుపలగా ఉండిపోతారు.

"ఫలితంగా జాతిని పునర్‌నిర్మించి, పునరుజ్జీవింపజేసి, అధఃపాతాళానికి పడిన జాతి శృంఖలాలను తెంచే ఉద్యమాలే నిజమయిన జాతీయోద్యమాలు. హిందూజాతిని శ్లాఘించేవారు, జాతిని తమ ప్రాణప్రదంగా చూసుకునేవారు మాత్రమే దేశభక్తులు, వారే ఉద్యమించి, శ్రమించి వారి లక్ష్యాన్ని సాధించగలుగుతారు. మిగిలిన వారంతా దేశద్రోహులు. జాతియొక్క లక్ష్యానికి శత్రువులు ఇంకా దయతో చెప్పాలంటే తెలివి తక్కువవారు. (గోల్వాల్కర్ 1939 పిపి 43–44)

'జాతీయవాదం' అంటే ఏకశిలా సదృశ్యం అనీ అదేసర్వం అన్నట్టు చెప్పే ప్రయత్నం చేస్తున్నారు. అందుకే వారి నినాదాలు ఒకేవిధంగా, భారతదేశం నిరంతరం తిరస్కరిస్తున్న 'హిందీ, హిందూ, హిందుస్థాన్"గా ఉంటున్నాయి.

"హిందువులు కాని వారికి సంబంధించినంత వరకు వారి తేడాలు అన్నీ వదిలి పెట్టి, ఈ జాతి,మతాన్ని, సంస్కృతిని, బాషని స్వీకరించి, ఈ జాతిలో పూర్తిగా మమేకం కాకపోతే వారికి జాతీయ జీవనంలో ఎటువంటి స్థానం ఉండదు. వారి జాతి, మతం, సంస్కృతుల బేధాలను కాపాడుకున్నంత కాలం వారు విదేశీయులుగా మాత్రమే ఉంటారు. (గోల్వాల్కర్, 1939 పి/45)

"వారికి (ఈ సంస్కృతీ, సాంప్రదాయాలు, మతం) వీటిని స్వీకరించడం తప్ప వేరే మార్గాంతరం లేదు. ఉండకూడదు. మనది అత్యంత పురాతన దేశం. మనదేశంలో ఉండేందుకు వచ్చిన విదేశీయుల పట్ల ఎలా వ్యవహరించాలో అలాగే వ్యవహరిద్దాం. వ్యవహరించాలి. (గోల్వాల్కర్, 1939 పిపి47–48)

పురాతన దేశం ఎలా వ్యవహరించాలి? ఫాసిస్టు జర్మనీని ఇంతకన్నా పొగడడం అసాధ్యం." యూరప్ అంతా కమ్ముకున్న జర్మన్ మూలవాసుల అనాది జాతిస్పృహ తిరిగి ఆధునిక జర్మనీలో తలెత్తింది. ఫలితంగా పూర్వీకులకు అలవాటైన దోపిడీని అనుసరించాల్సిందిగా తమతోటి వారిపై వత్తిడి చేయడం జరిగింది." ఇక్కడా అదే జరిగింది. అతిరధ మహారధులింత

**“అయితే స్థూలంగా ఆర్ఎస్ఎస్ బిజెపిలను వ్యతిరేకించే అన్ని రాజకీయ పార్టీలను ‘జాతివ్యతిరేకులు’గా చిత్రించాలనే పెద్ద పన్నాగంలో ఇదోభాగం. ఆర్ఎస్ఎస్ అసలు ప్రయత్నం మన రాజ్యాంగంలో చెప్పుకున్న విధంగా లౌకిక, ప్రజాస్వామ్య, గణతంత్ర భారతదేశాన్ని పచ్చి అసహన, ఫాసిస్టు దేశమైన ‘హిందూత్వ రాష్ట్రంగా’మార్చడమనే పెద్ద రాజకీయ ప్రాజెక్టులో ఇవన్నీ భాగం.”**

మంది వరుసగా ఇక్కడ ఉద్భవించి, ప్రపంచానికి ఆధ్యాత్మికతను అందించారు. మనజాతి ఆధ్యాత్మికత ఈనాడూ వారిని ఉత్తేజపరుస్తున్నది. (గోల్వాల్కర్ 1939, పి32)

ఇంకా “జర్మనులు వారి జాతి పవిత్రతను, సంస్కృతిని కాపాడేందుకు జాతుల (యూదులు) నుండి వారి దేశాన్ని శుద్ధి చేయటం ప్రపంచాన్ని ఆశ్చర్యంలో ముంచెత్తింది. జాతీయ ఔన్నత్యం ఇక్కడ స్పష్టంగా కనపడింది. భిన్నమైన ఇతర జాతులను, సంస్కృతులను తమలో ఇముడ్చుకోవడం అన్నది ఎంతకష్ట సాధ్యమో, వారితో పరిపూర్ణంగా కలిసి ఉండడం ఎంత ఇబ్బందికరమో జర్మనీ మనకు చూపించింది. మన హిందుస్థాన్ ఈ అనుభవం నుంచి నేర్చుకుని లాభపడాల్సి ఉంది” (గోల్వాల్కర్ 1939, పి35)

ఈ భావాలకనుగుణంగానే ఆర్.ఎస్.ఎస్ హిందుత్వ జాతీయవాదం అంటే హిందూజాతిని కీర్తిస్తున్న వారు మినహా మిగిలిన వారందరూ “జాతి ప్రయోజనాలకు శత్రువులు ద్రోహులు” అని చెబుతున్నది. ఈ రోజు “భారత్ మాతాకి జై” అనమని బలవంతం చేయడం వెనుకున్న అర్థం ఇదే. (మనం గుర్తుచేసుకుంటే, జైహింద్ అని మన సైనికులు, ఇతర కాపలాదారులు సర్వసాధారణంగా పలకరించుకుంటుంటారు. – ఈ పలకరింపు నేతాజీ సుభాష్‌చంద్రబోస్ స్థాపించిన ఐ.ఎస్.ఏతో మొదలయింది. ప్రతి క్రికెట్ మ్యాచ్‌లోనూ భారతదేశ టీమ్‌ను, ముఖ్యంగా పాకిస్థాన్‌లో ఆడేటప్పుడు, హిందూస్థాన్ జిందాబాద్’ అంటూ ప్రేక్షకులు ప్రోత్సహిస్తుంటారు. ఆర్ఎస్ఎస్ దృష్టిలో ఇవేవీ జాతీయవాదం, దేశభక్తీ కావు).

వారి ‘జాతీయత’ జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయం, అందులోని విద్యార్థి నాయకుల పైన దాడి చేయడంలో బయటపడింది. వీడియోలను సృష్టించి, సాక్ష్యాలను కల్పించి వాటి ఆధారంగా విద్యార్థి నాయకులను అరెస్ట్ చేసి వారిపై దేశద్రోహం, జాతివ్యతిరేక కార్యకలాపాలలో పాల్గొంటున్నట్లు నేరారోపణలు చేశారు. ఇప్పుడివన్నీ కోర్టుల పరిశీలనలో ఉన్నాయి. అయితే స్థూలంగా ఆర్ఎస్ఎస్ బిజెపిలను వ్యతిరేకించే అన్ని రాజకీయ పార్టీలను ‘జాతివ్యతిరేకులు’ గా చిత్రించాలనే పెద్ద పన్నాగంలో ఇదోభాగం. ఆర్ఎస్ఎస్ అసలు ప్రయత్నం మన రాజ్యాంగంలో చెప్పుకున్న విధంగా లౌకిక, ప్రజాస్వామ్య, గణతంత్ర భారతదేశాన్ని పచ్చి అసహన, ఫాసిస్టు దేశమైన “హిందూత్వ రాష్ట్రంగా” మార్చడమనే పెద్ద రాజకీయ ప్రాజెక్టులో ఇవన్నీ భాగం.

మనకు తెలిసిన స్థిరమయిన, గణతంత్ర భారతదేశ భవిష్యత్తు ఉనికికే తీవ్ర ప్రమాదం ముంచుకొచ్చింది. దీనికి తోడు ఆర్ఎస్ఎస్, బిజెపిల జాతీయవాదనను హిందూ జాతీయవాదంగా మార్చే ప్రయత్నంతో ఈ ప్రమాదం మరింత తీవ్రమయింది. భారత ప్రజలు తమ వైవిధ్యాలను – కులం, మతం, జాతి, భాష, సంస్కృతి వగైరా అన్నింటిని అధిగమించి భారతజాతిగా కలిసి ఉండేలా ఉన్నత చైతన్యాన్ని పెంపొందించుకున్నారు. ఇప్పుడది ప్రమాదంలో పడింది.

ఈ సవాలుకు ప్రసార సాధనాలు (మీడియా) ఎలా స్పందిస్తున్నాయి? మొట్ట మొదటిగా ఇవి దీనినొక సవాలుగా భావిస్తున్నాయా? ప్రజాస్వామ్య దేశాలలో నాలుగవ మూలస్థంభంగా భావిస్తున్న ప్రచార సాధనాలు ప్రజలకు,కార్యనిర్వాహక అధికారానికి, అంటే ప్రభుత్వానికి మధ్య వారధిగా ఉండాలి. ఆక్రమంలో ప్రజలకు కేవలం సమాచారాన్ని అందిచడమే కాదు. మనం అంగీకరించిన రాజ్యాంగ విలువలను కాపాడుతూ ప్రజలందరినీ కలిపి ఉంచేలా చూస్తూ, భారత జాతీయవాద చైతన్యాన్ని బలపరచాలి.

కాని ఈనాటి ప్రసార సాధనాలుగా కొన్ని రాజుకన్నా రాజభక్తి ప్రదర్శిస్తున్నాయి. ప్రసార సాధనాలలో కొంతభాగం జెఎన్‌యు/హెచ్‌సియు విద్యార్థులపై దేశభక్తి పేర దాడులు చేశాయి. సైద్ధాంతిక సారాంశం రీత్యా బిజెపి కేంద్ర ప్రభుత్వం ప్రచారం చేస్తున్న విభిన్నమైన ప్రస్తుత జాతీయవాదానికి కొమ్ముకాస్తున్నాయి.

ప్రఖ్యాత పాత్రికేయుడు శశికుమార్ మాటల్లో “ఒక బలమైన రాజ్యం అంటే మన ఉద్దేశం బలహీనులైన పౌరులు కాదు. బలమైన పత్రికారచనంటే పౌరులకు రాజ్యం శక్తిని ఎదిరించే బలాన్నివ్వడమే కాని రాజ్యం తైనాతీలుగా మారి పౌరుల స్వేచ్ఛను హరించేలా తోడ్పాటునందించటం కాదు.”

అయితే మీడియా ఒక వ్యాపారంగా మారి గరిష్ట లాభార్జనే ధ్యేయంగా ఉన్న ఈనాటి ప్రపంచంలో ఇది సాధ్యమా? ఈ రోజు మనం “పత్రికా రంగాన్ని అమ్ముకుంటున్న ఒక కొత్త యుగంలో” ఉన్నాం. ప్రచార సాధనాల రంగంలో ఉన్న ఒక ప్రముఖ వ్యక్తి చెప్పినట్లు రచనా వ్యాసంగాన్ని వాణిజ్యమయం చేస్తున్న పరిస్థితుల మధ్యలో మనమున్నాం. తన మనుగడకు ప్రధానంగా ప్రకటనలపైనే ఆధారపడిన మీడియా నేడు ప్రపంచ ఆర్థికమాంద్యం కాలంలో ఒక నూతన పద్ధతిని ఎంచుకొని ముందుకు పోవాలని ప్రయత్నం చేస్తున్నది. ఈ మధ్యకాలంలో వెల్లడై తిరస్కారానికి, ఆగ్రహానికి గురైన ‘వార్తలు అమ్ముకొనే’( పెయిడ్ న్యూస్) విధానం దీని ఉప ఉత్పత్తిగా ఈ కాలంలో ముందుకొస్తున్నది. ఈ అంశంపై పార్లమెంటులో జరిగిన చర్చలలో మీడియా ‘స్వీయనియంత్రణ’ చేసుకోవాలని ఉదారంగా సూచించటంతో ముగిసింది. 2008లో ప్రపంచ ఆర్థిక వ్యవస్థ సంక్షోభంలో కూరుకుపోతున్నపుడు స్వీయ నియంత్రణ ఏ మేరకు పని చేసిందో మనం చూశాం.

అంతర్జాతీయంగా ఎంతో పేరున్న పాత్రికేయుడు, ఎన్నో దేశాలలో, యుఎన్‌లోనూ అత్యుత్తమ జర్నలిస్టు అవార్డులు గెలుచుకున్న జాన్‌పిల్‌గర్ ఏమన్నాడో ఈ సందర్భంలో గుర్తుచేసుకుందాం. ఆయన “హిడెన్ ఎజెండాస్” అనే ఆలోచనలు రేకెత్తించే ఒక పుస్తకాన్ని వ్రాశారు. దానికి ప్రపంచవ్యాప్తంగా మంచి గుర్తింపు రావడమే కాదు అది బాగా అమ్ముడుపోయిన పుస్తకం కూడా డిసెంబర్ 5, 2014లో “మీడియా యుద్ధం, ప్రచారం గెలుపు” అనే అంశం పై మాట్లాడుతూ అన్న మాటలు ఈ రోజు భారతదేశంలో ఉన్న పరిస్థితికి సరిపోతాయి. నకిలీ లక్ష్యాలకు సంబంధించిన పెద్దపెద్ద వాదనలను సవాలు చేయాలని, ప్రచార సాధనాల ఎజెండాను అర్థంచేసు కోవాలని యువ పాత్రికేయులకు ఎందుకు నేర్పించడం లేదు? నిష్పాక్షిక దృష్టితో అసలు ఉద్దేశ్యాలను తెలుసుకోవాలని ఎందుకనుకోవడం లేదు?

ప్రధాన స్రవంతి వార్తలంటే సారాంశంలో సమాచారం కాదు అధికారం అని వారికి ఎందుకు తెలియజెప్పడం లేదు?

ప్రజలందరి దృష్టిలో మీడియా అంటే ఎడ్వార్డ్ బెర్నెస్ అన్నట్టు కనిపించని ప్రభుత్వం కాదు మీడియా అంటే వికారమయినది. భయంకరమైనది. అదే ప్రభుత్వం. ఏ వైరుధ్యాల భయం లేకుండా ప్రత్యక్షంగా పాలిస్తుంది. దాని లక్ష్యం మనలను గెలవడమే, ప్రపంచం పట్ల మనకున్న జ్ఞానాన్ని గెలవడం, సత్యాసత్యాలకు మధ్య నున్న తేడాను గమనించడంలో మనకున్న విచక్షణను గెలవడం.

“మీడియా యుగం అంటే నిజానికి సమాచార యుగం. మనపై మీడియా యుద్ధం చేస్తున్నది, నియంత్రిస్తున్నది, రాక్షసత్వాన్ని ప్రయోగిస్తున్నది. చేయని నేరాలకూ ప్రతీకారం తీర్చుకుంటున్నది, మార్గాలను మళ్ళిస్తున్నది- కొన్ని అవాస్తవాలను, కల్పనల సమాహారాన్ని మనముందుంచుతున్నది.”


జర్నలిస్టుల, ప్రచారమాధ్యమాల పాత్ర ఎలా ఉండాలో ఉపదేశాల ద్వారా కాక, ఒక సన్నివేశం ద్వారా ఆయన మనకు తెలియ చెప్పారు.

“2003 లో ఛార్లెస్ లూయిస్ అనే ప్రఖ్యాత అమెరికన్ పరిశోధక పాత్రికేయుడ్ని కలిసి, అంతకు కొన్ని నెలల క్రితం ఇరాక్‌పై జరిగిన దాడిని గురించి మేం చర్చించాం.“ ప్రపంచంలోనే అత్యంత స్వేచ్ఛయుతమైన మీడియా మొరటు ప్రచారానికి బదులుగా జార్జిబుష్‌ను, డొనాల్డ్ రమ్స్‌ఫెల్డ్‌ను సవాల్‌చేసి, వారి వాదనలలోని వాస్తవాల పరిశీలనకు పూనుకొని ఉంటే ఏమై ఉండేది?” అని అడిగాను. జర్నలిస్టులు గనక తమ పనిని సక్రమంగా చేసి ఉన్నట్టయితే ఇరాక్ పై యుద్ధానికి వెళ్ళకుండా ఉండేందుకు ఎంతో, ఎంతోమంచి అవకాశాలు ఉండేవి” అతను సమాధానం చెప్పాడు.

“ఇదెంతో ఆశ్చర్యకరమయిన విషయం. నేను అనేకమంది పాత్రికేయులను అడిగినా అదే సమాధానం వచ్చింది. ఇదే ప్రశ్నను డాన్ రాధోడ్‌ను అడిగినా అదే సమాదానం వచ్చింది. సీనియర్ పాత్రికేయుడు, అబ్జర్వర్ పత్రికకు సంబంధించిన డేవిడ్ రోస్ సమాధానం కూడా అదే. కొందరు పేర్లు బయట పెట్టేందుకు ఇష్ట పడని బిబిసి నిర్మాతలు ఇదే సమాధానం చెప్పారు.”

అంటే పాత్రికేయులు తమ పనిని సక్రమంగా చేసి ఉంటే, ప్రచారానికి బదులు ప్రశ్నించి ఉంటే, పరిశోధించి ఉంటే ప్రపంచవ్యాప్తంగా వేలాది మంది పురుషులు, మహిళలు, పిల్లలు ఈ రోజు ప్రాణాలతో ఉండేవారు. లక్షలాది మంది తమ ఇళ్ళను వదిలి పారిపోయి ఉండేవారు కాదు. సున్నీ,షియాల మధ్య చిచ్చురగిలేది కాదు, అప్రతిష్టాత్మకమయిన ఇస్లామిక్ స్టేట్ అవిర్భవించి ఉండేది కాదు.

“1990లలో ఇరాక్‌పై ఆంక్షలు విధించేం దుకు బాధ్యుడయిన ఒక బ్రిటిష్ అధికారి గురించి జాన్ ఫిలగర్ మాట్లాడుతూ ఈ మధ్యయుగాల తరహా దిగ్బంధం వలన ఇరాక్‌లో 5 లక్షల మంది 5సం॥ వయసులోపు పిల్లలు మృత్యువాత పడటాన్ని గురించి యూనిసెఫ్ చెప్పిన అంశాన్ని ఉదహరించాడు.”



జాన్ పిల్గర్

ప్రకటనల ద్వారా ఆదాయాన్ని సమకూర్చటంతో పాటు పత్రికా విలేకరులను మేనేజ్ చేయటం ద్వారా ప్రభుత్వాలు సమ్మతిని ఎలా తయారుచేస్తాయి? ప్రధాని మోదీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం చేస్తున్న వాటిని గురించి దిగువ అంశాలు మనకు కొంత అవగాహన ఇస్తాయి.

1990లలో ఇరాక్‌పై ఆంక్షలు విధించేందుకు బాధ్యుడయిన ఒక బ్రిటిష్ అధికారి గురించి జాన్ ఫిలగర్ మాట్లాడుతూ ఈ మధ్యయుగాల తరహా దిగ్బంధం వలన ఇరాక్‌లో 5 లక్షల మంది 5సం॥ వయసులోపు పిల్లలు మృత్యువాత పడటాన్ని గురించి యూనిసెఫ్ చెప్పిన అంశాన్ని ఉదహరించాడు. “ఆ అధికారి పేరు క్రేన్‌రోస్. లండన్‌లోని విదేశాంగ కార్యాలయంలో ఆయనను అందరూ మిస్టర్. ఇరాక్ అనేవారు. ప్రభుత్వాలు ఎలా మోసాలు చేస్తాయో, ప్రసార మాధ్యమాలు వాటినే ఎలా ప్రచారంలో పెడతాయో వివరించాడు. “మేం పత్రికలవారికి పడపోసిన రహస్యాలను వాస్తవాలుగా అందిస్తాం లేదా వాటిని బయటకు పొక్కకుండా చూస్తాం.”

ప్రభుత్వ రహస్యాలను బట్టబయలు చేసిన( విజిల్‌బ్లోయర్) డెనిస్ హాలిడేకు సంబంధించిన మరో సంఘటన గురించి ఫిల్గర్ చెప్పాడు. డెన్నిస్ హాలిడే ఐక్యరాజ్యసమితిలో అసిస్టెంట్ జనరల్ సెక్రటరీగానూ, ఇరాక్‌లో ఐక్యరాజ్య సమితి సీనియర్ అధికారి గానూ ఉన్నారు. ఇరాక్‌పై ఆంక్షలను మారణహోమం సృష్టించే ఆంక్షలను వ్యతిరేకించి ఆయన రాజీనామా చేసారు. ఆయన లెక్క ప్రకారం ఆంక్షల మూలంగా చనిపోయిన వారిసంఖ్య పదిలక్షలు దాటుతుంది. అలా నిరాకరించినందుకు హాలిడేకి ఏమయిందో తెలుసుకోవాలి. బిబిసి రాత్రి వార్తల ప్రోగ్రామ్‌లో జెరిమె ఫాక్స్‌మన్ ఆయనపై ఇలా అరిచాడు” మీరు సద్దామ్‌హుస్సేన్‌ను సమర్ధించే వారిలా ఉన్నారు? దీనినే ఈ మధ్యన గార్డియన్ పత్రిక, ఫాక్స్‌మన్ జ్ఞాపకాలుగా ప్రచురించింది. క్రితం వారం ఫాక్స్‌మన్ తన పుస్తకానికి సంబంధించి మిలియన్ డాలర్ల ఒప్పందం కుదుర్చుకున్నారు.”

ప్రధాన సమయాలలో టివిలో జరిగే చర్చా కార్యక్రమాలలో పాల్గొనే మీకు ఈ ఏంకర్ల అరుపులు సర్వసాధారణాలు. సిఐఏ కోసం 400 మంది జర్నలిస్టులు, న్యూస్ ఎక్జిక్యూటివ్స్ పనిచేసినటు 1977లో ‘వాటర్‌గేట్’ కుంభకోణంలో భాగస్వామిగా ఉన్న కార్ల్ బెర్న్‌స్టీన్ తెలిపారు. అందులో న్యూయార్క్ టైమ్స్,ది టైమ్, టివి నెట్‌వర్క్‌లలో పనిచేసే వారూ ఉన్నారు. 1991 లో రిఛార్డ్ నోర్టన్‌టేలర్ కూడా బ్రిటన్‌లో గార్డియన్‌కు సంబంధించి ఇటువంటి కథనాన్నే వెల్లడించారు.

“ఈ రోజు ఇవేం అవసరం లేదు. స్నోడెన్ ఉగ్రవాదానికి సహాయ పడుతున్నట్టు ఆరోపించేందుకు వాషింగ్‌టన్ పోస్టుతో సహా ఏ మీడియాకు ఎవరూ నిధులిచ్చారని నేననుకోను జులియస్ అసాంజేకి మసిపూసేందుకు ఎవరైనా సొమ్ములిచ్చారని నేననుకోను. వేరే రకంగా వారికి ప్రయోజనాలు కల్పిస్తున్నప్పటికీ జూలియన్

(మిగతా ..వ పేజీలో)

ఈ మాసం ప్రత్యేకం

# శాఖల పని విధానం



రచయిత సిపిఐ (ఎం) కేంద్రకమిటీ సభ్యులు

**ఎస్ వీరయ్య**

పార్టీ సభ్యత్వం చేర్చుకునే విధానంలో కమ్యూనిస్టు పార్టీకి, ఇతర బూర్జువా పార్టీలకు స్పష్టమైన తేడా ఉన్నది. బూర్జువా పార్టీలు సభ్యత్వ క్యాంపెయిన్ నిర్వహిస్తాయి. కొన్ని పార్టీలు సభ్యులు చెల్లించే రుసుమును బట్టి సాధారణ సభ్యులుగానూ, చురుకైన సభ్యులు గానూ చేర్చుకుంటారు. కమ్యూనిస్టు పార్టీలో సభ్యత్వం కోసం క్యాంపెయిన్ చేసే పద్ధతి ఉండదు. కమ్యూనిస్టు పార్టీలో చేరడానికి ఆసక్తి ఉండి, రుసుము చెల్లిస్తేనే సరిపోదు. బూర్జువా పార్టీల్లో చేరే సభ్యులకు సమాజాన్ని మార్చే బాధ్యత లేదు. ఉన్న వ్యవస్థలో ఆయా పార్టీలలో పనిచేయడం ద్వారా ఏదో ఒక లబ్ధిపొందే లక్ష్యంతో ఉంటారు. బూర్జువా పార్టీలు అనేక అవలక్షణాలతో కూడిన ప్రస్తుత వ్యవస్థనూ, శ్రమ దోపిడీని కాపాడేందుకు కృషి చేస్తాయి. ప్రజలకు ఆశచూపి చురుకైన వారికి భ్రమలు కల్పించి తమవైపు మరల్చుకుంటారు. ఇబ్బందుల్లో ఉన్న సాధారణ ప్రజలు ఆసరా దొరుకుతుందను కున్నప్పుడు వీరిని నమ్ముతారు. ఇలాంటి చురుకైన వారిని తమ పార్టీలో చేర్చుకోవడం ద్వారా ప్రజల మీద పట్టు సాధించేందుకు, తమ స్వార్థ ప్రయోజనాలను నెరవేర్చుకునేందుకు బూర్జువా పార్టీలు ప్రయత్నిస్తాయి. కమ్యూనిస్టు పార్టీ సభ్యత్వం అలాంటిది కాదు. కమ్యూనిస్టు పార్టీ సమాజాన్ని మార్చడం కోసం పనిచేస్తున్నది. ఒక మనిషిని మరొక మనిషి, ఒక వర్గాన్ని మరొక వర్గం దోపిడీ చేస్తున్న వ్యవస్థను అంతం చేయడం కోసం పోరాడుతున్న పార్టీ. అందువల్ల పార్టీ సహకారంతో లబ్ధిపొందే లక్ష్యంతో ఉన్న వారు కమ్యూనిస్టు పార్టీలో సభ్యులుగా చేరాలను కోరు. అలాంటివారిని కమ్యూనిస్టు పార్టీ చేర్చుకోదు. ప్రజలకోసం, సమాజమార్పు కోసం, పార్టీకోసం తనకు చేతనైనంత కృషి చేయాలన్న పట్టుదలతో ఉన్నవారు మాత్రమే కమ్యూనిస్టు పార్టీ సభ్యత్వానికి అర్హులు.

**పార్టీ సభ్యత్వం:** కమ్యూనిస్టు పార్టీలో సభ్యులుగా చేరదల్చినవారు సంబంధిత శాఖా కార్యదర్శికి లేఖ రాయాలి. ఆ శాఖ సిఫారుసుతో పై కమిటీ ఆమోదిస్తుంది. ఇతర పార్టీల నుండి రాజీనామా చేసి వచ్చేవారికి స్థానిక శాఖలు గాని, ఇతర కమిటీలు గాని నేరుగా సభ్యత్వం ఇచ్చే అవకాశం లేదు. రాష్ట్ర కమిటీ సిఫార్సుతో కేంద్ర కమిటీ మాత్రమే నిర్ణయం తీసుకుంటుంది. ఇతర పార్టీల నుండి వచ్చిన వారిని నేరుగా పార్టీ సభ్యులుగా తీసుకోవాలని కేంద్ర కమిటీ నిర్ణయిస్తే తప్ప సాధారణంగా మొదట క్యాండిడేట్ సభ్యత్వం ఇస్తారు. సంవత్సర కాలం పాటు క్యాండిడేట్ సభ్యుల పనిని పరిశీలించిన తర్వాత అర్హులని భావిస్తే సంబంధిత శాఖ వారిని పూర్తి సభ్యులుగా ప్రమోట్ చేస్తుంది. పార్టీలో ఎన్నుకునేందుకు లేదా తాను ఎన్నుకోబడేందుకు మినహా పార్టీ సభ్యులకున్న హక్కులన్నీ క్యాండిడేట్ సభ్యులకు కూడా ఉంటాయి.

విప్లవ పార్టీని నిర్మించాలని కోల్‌కత్తా ప్లీనం నొక్కి చెప్పింది. విప్లవ చైతన్యం గల పార్టీ సభ్యత్వం లేకుండా విప్లవ పార్టీగా మన జాలదు. విప్లవ పార్టీని నిర్మించాలంటే, పార్టీ సభ్యులను చేర్చుకునే దశ నుండే ప్రత్యేక శ్రద్ధ వహించాలని నిర్ణయించింది. పార్టీ, ప్రజాసంఘాల కార్యకలాపాల్లో చురుకుగా, సమరశీలంగా పాల్గొంటున్న వారిని ఎంపిక చేసి ఆగ్జిలరీ (సహాయక) శాఖలు ఏర్పాటు చేయాలి. సహాయక శాఖల సభ్యులు సభ్యత్వ రుసుముగా రు. 5/-లు చెల్లించాలి. ఈ శాఖకు పార్టీ సభ్యులు సమన్వయకర్తగా ఉండి నడపాలి. ఈ శాఖ ద్వారా మార్క్సిస్టు అవగాహన కల్పించాలి. పార్టీ పిలుపులు, రాజకీయ పరిణామాలు, శాఖ పరిధిలోని ప్రజాసమస్యలు ఎజెండాగా పెట్టవచ్చు. పై కమిటీ నిర్ణయాలు రిపోర్టు చేయవచ్చు. వీటి ద్వారా ఆగ్జిలరీ సభ్యులను పార్టీ కార్యకలాపాల్లో క్రియాశీలంగా భాగస్వాములను చేయవచ్చు. పార్టీ విధానం పట్ల, సమకాలీన రాజకీయ, సైద్ధాంతిక విషయాల్లో సందేహాలు తీర్చవచ్చు. పార్టీపైన వారికున్న అభిప్రాయాలు, విమర్శలు, సూచనలు స్వీకరించవచ్చు. వారి సైద్ధాంతిక అధ్యయనాన్ని, పార్టీ కార్యకలాపాలలో భాగస్వామ్యాన్ని ఎప్పటికప్పుడు సమీక్షించవచ్చు. వారి చైతన్యాన్ని, వారికున్న అవకాశాలను బట్టి ప్రతినెలా కొంత డబ్బు పార్టీకి విరాళంగా ఇవ్వడానికి ప్రోత్సహించవచ్చు.

పార్టీ సభ్యత్వానికి కనీస అర్హతలు ఉండి, కనీసం ఆరు మాసాల పాటు రెగ్యులర్‌గా ఆగ్జిలరీ శాఖలో పాల్గొన్నవారికి సభ్యత్వం ఇవ్వవచ్చు. అప్పటికీ అర్హత పొందనివారు ఆగ్జిలరీ శాఖలో కొనసాగుతారు. పార్టీ కార్యక్రమం- నిబంధనావళి అంగీకరించడంతో పాటు, పార్టీ సభ్యులు కనీసం ఐదు బాధ్యతలు నిర్వహించవలసి ఉంటుంది. ఆ మేరకు ప్రమాణపత్రం మీద సంతకం చేయించాలి. ఏడాదికొకసారి పార్టీ సభ్యత్వాన్ని పునరుద్ధరించుకోవాలి. ఆ సందర్భంగా కనీస బాధ్యతలను ఏ మేరకు నిర్వహించారో సంబంధిత శాఖలో సమీక్షించాలి. కేంద్ర కమిటీ నిర్ణయించిన సభ్యత్వ రుసుం రు. 5/-లు చెల్లించాలి.

కమ్యూనిస్టు పార్టీలో ప్రమాణపత్రానికి ప్రాధాన్యత ఉన్నది. నిరంతరం స్వప్రయోజనం కన్నా, పార్టీ ప్రయోజనం, ప్రజల ప్రయోజనం కోసమే అంకితమై పనిచేసే విధంగా, క్రమశిక్షణకు కట్టుబడే విధంగా త్యాగనిరతిని, నిబద్ధతను ఇది ప్రోత్సహిస్తోంది.

**పార్టీ సభ్యుల కనీస బాధ్యతలు:**

(1) కేంద్ర కమిటీ నిర్ణయించిన ప్రకారం సభ్యుల ఆదాయాన్ని బట్టి లెవీ చెల్లించవలసి ఉంటుంది. ఇది విప్లవ చైతన్యానికి గీటురాయని 1967లో పార్టీ కేంద్ర కమిటీ తీర్మానం చేసింది. బూర్జువా పార్టీల్లో సభ్యులు పార్టీ తమకేమిచ్చిందని చూస్తారు. కమ్యూనిస్టు పార్టీ సభ్యులు పార్టీ కోసం పనిచేస్తూ ఆర్థికంగా కూడా పార్టీకి సహకరిస్తారు. తమ ఆదాయం నుండి పార్టీ నిర్దేశించిన ప్రకారం లెవీ రూపంలో చెల్లించడంతో పాటు, పార్టీకోసం ప్రజల నుండి విరాళాలు సేకరిస్తారు. " తాను పార్టీకి చెల్లించాల్సిన సభ్యత్వం రుసుము సకాలంలో తానంతట తానే శాఖా కార్యదర్శికి సాధ్యమైనంత త్వరలో చెల్లించాలి. కమ్యూనిస్టు పార్టీలో సభ్యత్వం

నిలుపుకునేందుకు ఆతృత, సంసిద్ధత కలిగి ఉండాలి. ప్రతి ఒక్కరూ పార్టీ లేదా ప్రజాసంఘాల నిధికి చందాలు ఇవ్వాలి. వసూలు చేయాలి. చందాలకై వీలైనన్ని కుటుంబాలను, వ్యక్తులను అభ్యర్థించాలి" – పార్టీ కేంద్ర కమిటీ 1967 తీర్మానం.

శాఖ సక్రమంగా పనిచేయనప్పుడు లేదా శాఖా కార్యదర్శి అశ్రద్ధ చేసినప్పుడు, లెవీ చెల్లింపులు బకాయిలు పడుతుంటాయి. ఈ పరిస్థితి రాకుండా పార్టీ సభ్యులే చైతన్యం ప్రదర్శించాలి. సకాలంలో చెల్లించాలి. పార్టీకి చెల్లించే ప్రతిపైసా పార్టీ అభివృద్ధికి, ప్రజా కార్యాచరణకు తోడ్పడుతుంది.

**"చైతన్యవంతులైన పార్టీ సభ్యులు ఎన్ని అవాంతరాలు ఎదురైనప్పటికీ, ఆర్థిక సమస్యలు పెరిగినప్పటికీ సకాలంలో లెవీ చెల్లించడంలో పట్టుదలను ప్రదర్శిస్తారు. తమ ఆదాయంలో మొదట లెవీ చెల్లించి మిగిలిన డబ్బుతో ఇతర ఖర్చులకు ప్రణాళిక రూపొందించుకుంటారు."**

చైతన్యవంతులైన పార్టీ సభ్యులు ఎన్ని అవాంతరాలు ఎదురైనప్పటికీ, ఆర్థిక సమస్యలు పెరిగినప్పటికీ సకాలంలో లెవీ చెల్లించడంలో పట్టుదలను ప్రదర్శిస్తారు. తమ ఆదాయంలో మొదట లెవీ చెల్లించి మిగిలిన డబ్బుతో ఇతర ఖర్చులకు ప్రణాళిక రూపొందించుకుంటారు. చైతన్యం బలహీనపడినప్పుడు లేదా సమాజంలోని ఇతర ప్రభావాలకు లోనైనప్పుడు లెవీ ప్రాధాన్యతను గుర్తించడంలో వెనకబడతారు. లెవీ చెల్లింపు చిట్టచివరి ప్రాధాన్యతగా లెక్కిస్తారు. అందుకే ఇది విప్లవ చైతన్యానికి గీటురాయిగా పార్టీ భావిస్తుంది.

(2) పార్టీ సభ్యులందరూ పార్టీ నిర్ణయించిన ఏదో ఒక ప్రజాసంఘంలో పనిచేయాలి. ప్రజలే చరిత్ర నిర్మాతలు. అందువల్ల ప్రజాసంఘాల ద్వారా నిరంతరం ప్రజల్లో పనిచేయాలి. ప్రజా పోరాటాల్లో చురుకుగా పాల్గొనాలి. ప్రజలను సమీకరించాలి. ప్రజా సంఘాల్లో పనిచేసే పార్టీ సభ్యులు ప్రజా సమస్యల మీద చురుకుగా పనిచేయడం ద్వారా ముఖ్య కార్యకర్తలుగా ఎదగాలి. ప్రజల విశ్వాసం పొందాలి. శక్తి సామర్థ్యాలను బట్టి ఆయా ప్రజాసంఘాల్లో బాధ్యతను తీసుకోవాలి. తన బాధ్యత నిర్వహణ గురించి శాఖలో తరచూ రిపోర్టు చేయాలి.

(3) కమ్యూనిస్టు పార్టీ సభ్యులంతా నిర్ణయాల్లో భాగస్వాములు కావాలి. కేవలం పార్టీ ఆదేశాలను అమలు జరిపేవారుగానే మిగలకూడదు. అందుకే పార్టీ నిర్దేశించిన శాఖలో సభ్యులుగా ఉండి (పార్టీ ఎవరికైనా ప్రత్యేక అనుమతి ఇస్తే తప్ప), శాఖా సమావేశాలకు హాజరుకావాలి. శాఖ నిర్ణయాల్లో భాగం పంచుకోవాలి. సభ్యుల సమగ్రాభివృద్ధికి శాఖా సమావేశాలు తోడ్పడతాయి. తమ అభిప్రాయాలు చెప్పేందుకు, విమర్శించేందుకు అవకాశం ఉంటుంది. శాఖ సక్రమంగా పనిచేయకపోతే లేదా శాఖకు సక్రమంగా హాజరు కానివారు బహిరంగ విమర్శలు చేసే అవకాశం ఉంటుంది. ఇది పార్టీకి నష్టం. రాజకీయ అవగాహన పెంచుకోవడానికి, బాధ్యతలు పంచుకోవడానికి, మంచిచెడ్డలు సమీక్షించుకోవడానికి శాఖా సమావేశాలు తోడ్పడతాయి. అందువల్ల శాఖకు హాజరు కావడం తప్పనిసరి.

(4) విప్లవ సిద్ధాంతాన్ని ఆచరిస్తుంది కాబట్టే కమ్యూనిస్టు పార్టీ కార్మికవర్గానికి అగ్రగామి దళంగా పనిచేయగలుగుతుంది. అందువల్ల పార్టీ సభ్యులు మార్క్సిస్టు–లెనినిస్టు సిద్ధాంతాన్ని నిరంతరం అధ్యయనం చేయాలి. ఇందుకోసం పార్టీ పత్రికను, సాహిత్యాన్ని అధ్యయనం చేయాలి. సిద్ధాంత అధ్యయనం విప్లవ కార్యాచరణకు మార్గదర్శి అని 1967లో ఆమోదించిన పార్టీ కేంద్ర కమిటీ తీర్మానం గుర్తు చేసింది. "సిద్ధాంతంలేని ఆచరణ గుడ్డిది – ఆచరణ లేని సిద్ధాంతం పనికిరానిది" – మార్క్స్. "తాను ఏ రంగంలో పనిచేస్తున్నప్పటికీ పార్టీ పత్రికలు, సాహిత్యం అమ్మకంలో పాల్గొనాలి. ప్రతివారూ పార్టీ పత్రిక చదవాలి. చదువురానివారు చదివించుకుని వినాలి. చదవనూ, రాయనూ నేర్చుకునేందుకు ప్రయత్నించాలి. విజ్ఞాన సాధనకు కృషి చేయాలి. మౌలిక సిద్ధాంత గ్రంథాలు చదవాలి. సమకాలీన అంశాలపై ప్రస్తుత పార్టీ విధానాన్ని వివరించే సాహిత్యం చదవాలి. పార్టీ నడిపే సభ్యులకుద్దేశించిన పాఠశాలలు, అధ్యయన తరగతులకు హాజరుకావాలి" – 1967 పార్టీ కేంద్ర కమిటీ తీర్మానం. సిద్ధాంతం ప్రజలను ఆవహిస్తే అది భౌతిక శక్తిగా మారుతుందన్నారు మార్క్స్. అందుకే సిద్ధాంతపరమైన కృషి కీలకమైంది. పార్టీలో సభ్యులుగా చేరిన తర్వాత చైతన్యం పెంచుకోవడానికి లేదా బలహీనపడకుండా కాపాడుకోవడానికి నిరంతర అధ్యయనం అవసరం. అందుకు పార్టీ పత్రిక, సాహిత్యం అధ్యయనం తోడ్పడతాయి.

(5) పార్టీ పిలుపుల్లో సభ్యులంతా పాల్గొనడంతోపాటు, ప్రజలను సమీకరించాలి. పార్టీ పిలుపులను అమలు జరిపే బాధ్యత పార్టీ సభ్యులది. ఇది విప్లవ కార్యాచరణలో భాగం. ఆచరణ లేని సిద్ధాంతం పనికిరానిదన్న విషయం సదా గుర్తుంచుకోవాలి.

ఈ కనీస బాధ్యతలు నిర్వహించడంలో ఎవరికైనా తాత్కాలికంగా ఇబ్బందులు ఎదురైతే వారు పార్టీ సభ్యత్వం నుండి ఉపసంహరించుకుని ఆగ్జిలరీ శాఖలో కొనసాగవచ్చు. కనీస బాధ్యతలు నిర్వహించడానికి పరిస్థితులు అనుకూలించినప్పుడు మళ్లీ పార్టీ సభ్యత్వం పొందవచ్చు.

**పార్టీ సభ్యుల హక్కులు:**

(1) పార్టీ సంస్థలను, కమిటీలను ఎన్నుకునేందుకు లేదా తాము ఎన్నికయ్యేందుకు అవకాశం ఉంటుంది.

(2) పార్టీ విధానం, నిర్ణయాలు రూపొందించడంలో తోడ్పడడానికి స్వేచ్ఛగా చర్చల్లో పాల్గొనవచ్చు. నిర్ణయాల్లో భాగస్వామి కావచ్చు.

(3) పార్టీలో తాము నిర్వహించే బాధ్యతల గురించి సూచనలు చేయవచ్చు.

(4) పార్టీ సమావేశాల్లో కమిటీల గురించి గాని, కార్యకర్తల పనివిధానం గురించి గాని విమర్శ చేయవచ్చు.

(5) తనపైన క్రమశిక్షణా చర్యలు ప్రతిపాదించినప్పుడు తాను శాఖకు హాజరై, తన వాదన వినిపించవచ్చు.

(6) భిన్నాభిప్రాయం కలిగి ఉండవచ్చు. దానిని పై కమిటీకి తెలియజేయవచ్చు. (పార్టీ నిర్ణ యాలను మాత్రం అమలు జరుపుతూనే ఉండాలి)

(7) కేంద్ర కమిటీతో సహా ఏ పై కమిటీకైనా తన స్టేట్‌మెంట్, లేదా విజ్ఞాపన లేదా ఫిర్యాదు పంపుకునే హక్కు ఉంటుంది.

**ప్రాథమిక శాఖ ఏర్పాటు:** వృత్తి ప్రాతిపదికగా గాని, ప్రాంతం ప్రాతిపదికగా గాని శాఖలు ఏర్పాటు చేయవచ్చు. శాఖలో సభ్యుల

> **"ప్రతి శాఖ కనీసం నెలకొకసారైనా సమావేశం కావాలి. ఎన్ని ఇబ్బందులున్నా శాఖను మాత్రం జాగ్రత్తగా పోషించాలి. ప్రత్యేక శ్రద్ధ వహించాలి. పై కమిటీ నుండి నాయకులు వస్తేనే సమావేశమయ్యే శాఖగా ఉండకూడదు. శాఖను సమావేశపర్చడంలో శాఖా కార్యదర్శి చొరవే కీలకం. ఇది శాఖా కార్యదర్శి ప్రాథమిక బాధ్యత."**

సంఖ్య 15 మందికి మించకూడదు. వృత్తిపరమైన శాఖలో ఉన్న సభ్యులు తాము నివసించే ప్రాంతంలో ఉన్న శాఖల్లో అసోసియేటెడ్ సభ్యులుగా ఉండవచ్చు. ఇలాంటి సందర్భాల్లో నివాస ప్రాంతంలోని శాఖలో తనకు సంబంధించిన నిర్ణయాలు వృత్తిపరమైన శాఖ చేసే నిర్ణయాలకు ఆటంకంగా ఉండకూడదు.

పార్టీలో అంతర్గత ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయాలని కోల్‌కతా ప్లీనం ఆదేశించింది. శాఖలను సక్రమంగా పని చేయించడం ద్వారానే ఇది సాధ్యం. నిర్ణయాలు చేయడంలోనూ, అమలు చేయడంలోనూ పార్టీ సభ్యుల భాగస్వామ్యం పెంచాలి. శాఖా సమావేశాలు కనీసం నెలకొక్కసారి జరగాలి. శాఖా సమావేశానికి సభ్యులంతా హాజరయ్యేటట్టు చూడాలి. శాఖా సమావేశాల్లో సభ్యుల అభిప్రాయాలు, విమర్శలు శ్రద్ధగా వినాలి. స్వీకరించాలి. శాఖకు నాయకుడు/ నాయకురాలు శాఖా కార్యదర్శి.

**శాఖా కార్యదర్శి బాధ్యత:** శాఖా కార్యదర్శిగా ఎన్నిక కావడానికి ప్రధానమైన అర్హత శాఖను సమావేశపర్చడమే. శాఖా కార్యదర్శి శాఖను సకాలంలో సమావేశపర్చాలి. తగిన ఎజెండా ప్రతిపాదించాలి. తన శాఖ సభ్యుల కన్నా తాను చురుకుగా పనిచేయాలి. సభ్యుల పనితీరును, బాధ్యతల అమలు తీరును తనిఖీ చేయాలి. సభ్యుల రాజకీయ, సైద్ధాంతిక సందేహాలు తీర్చాలి. అవసరమైతే ఇందుకు పై కమిటీ సహాయం కూడా తీసుకోవాలి.

**శాఖల కనీస ఎజెండా:**

(1) కార్యకలాపాల సమీక్ష – తన శాఖ నిర్ణయాలు గాని, పై కమిటీ పిలుపులుగాని అమలు చేసిన తీరును సమీక్షించాలి.

(2) స్థానిక సమస్యల మీద కృషి చేయాలి. తన శాఖా పరిధిలోని ప్రజలు ఎదుర్కొనే సమస్యల పరిష్కారం కోసం వారిని సమీకరించాలి. ఆందోళనా–పోరాటాలు నిర్వహించాలి. సేవా కార్యక్రమాల ద్వారా ప్రజలకు సహాయపడాలి.

(3) రాజకీయ సైద్ధాంతిక పరిణామాలను చర్చించాలి. ముఖ్యంగా తన శాఖ పరిధిలోని రాజకీయ సమీకరణలను, సైద్ధాంతిక ప్రభావాలను చర్చించి తగు నిర్ణయం చేయాలి.

(4) పై కమిటీ పిలుపులు అమలు చేసేందుకు తగు నిర్దిష్ట నిర్ణయాలు చేయాలి.

(5) పై కమిటీ నిర్ణయాలను రిపోర్టు చేయాలి.

పై విషయాలతో పాటు, అవసరాన్ని బట్టి ఇతర అంశాలను కూడా ఎజెండాలో చేర్చుకోవచ్చు.

**శాఖల పని విధానం:** పార్టీ సభ్యులు తమ కనీస కర్తవ్యాలను నిర్వహించాలంటే పార్టీ శాఖ సరిగ్గా పనిచేసేటట్టు చూడాలి. ప్రతి శాఖ కనీసం నెలకొకసారైనా సమావేశం కావాలి. ఎన్ని ఇబ్బందులున్నా శాఖను మాత్రం జాగ్రత్తగా పోషించాలి. ప్రత్యేక శ్రద్ధ వహించాలి. పై కమిటీ నుండి నాయకులు వస్తేనే సమావేశమయ్యే శాఖగా ఉండకూడదు. శాఖను సమావేశపర్చడంలో శాఖా కార్యదర్శి చొరవే కీలకం. ఇది శాఖా కార్యదర్శి ప్రాథమిక బాధ్యత. సభ్యులు కూడా ఇందుకు తోడ్పడాలి. శాఖను సమావేశపర్చమని సభ్యులు కూడా కోరాలి. పై కమిటీ నాయకుడి చొరవతోనే శాఖ పనిచేస్తే శాఖా కార్యదర్శి అభివృద్ధికి కూడా అది ఆటంకమవుతుంది. సభ్యులు హాజరు కాలేదనే పేరుతో సమావేశాలు వాయిదా వేయకూడదు. హాజరయ్యేటట్టు కృషి చేయాలి. వారి ఇబ్బందులు తెలుసుకోవాలి. తగు సూచనలు చేయాలి. పార్టీకి, ప్రజలకు మధ్య శాఖ ఒక వారధి అనే అంశాన్ని సభ్యులందరూ గుర్తించాలి. ❋

**పాఠకుల అభిప్రాయాలు**

## అంబేద్కర్‌పై చక్కటి వ్యాసం రాసిన బృందాకరత్‌కు అభినందనలు

భారతదేశంలో మహిళలకు ఉన్న స్థానం, అణచివేత విధానాలకు వ్యతిరేకంగా పోరాడిన యోధుడు అంబేద్కర్. ప్రపంచంలో మహిళల హక్కులకోసం, సమానత్వం కోసం రాజీనామా చేసిన మొదటి క్యాబినెట్ మంత్రి అంబేద్కర్. అందుకే అంబేద్కర్ సూర్యుడు. చక్కటి ప్రత్యేక వ్యాసం రాసిన కామ్రేడ్ బృందాకరత్‌గార్కి ధన్యవాదాలు...

**– తుంపాల శ్రీరామమూర్తి,** గాజువాక

## శాస్త్రీయ దృక్పథం వ్యాసం బాగుంది

జూన్ నెల 2016 మార్క్సిస్టులో శాస్త్రీయ దృక్పథంపై ఎస్. వెంకట్రావుగారి వ్యాసం బాగుంది. అభివృద్ధి క్రమంలో శాస్త్రీయ దృక్పథం చారిత్రకంగా ఎటువంటి ఒడిదుడుకులు ఎదుర్కొన్నదో ఆ అంశాలనూ, 4 దశలనూ చక్కగా వివరించారు. భవిష్యత్తులో శాస్త్రీయ దృక్పథానికి పునాదియైన గతితార్కిక భౌతికవాదం గురించీ, భావవాదం, దాని ఘర్షణ గురించి పాపులర్‌గా వివరణ ఇస్తే బాగుటుంది. "గతితార్కికవాదం అంటే ఏమిటి?"లో వివరించినట్లుగా శాస్త్రీయ ఆలోచనకు, 19వ శతాబ్ది మధ్యభాగంలో కనిపెట్టబడిన మూడు సిద్ధాంతాలు – (భౌతిక శాస్త్రానికి సంబంధించిన) శక్తి నిత్యత్వ సిద్ధాంతం, కణ నిర్మాణ సిద్ధాంతం (రసాయనిక శాస్త్ర సంబంధించినది), (జీవ శాస్త్రానికి సంబంధించిన) డార్విన్ సిద్ధాంతం – మంచి ఊపునిచ్చాయి. ఈ మూడు సిద్ధాంతాలు చాలావరకు ఏదో ఒక విధంగా పాఠ్యాంశాలలో కూడా చేరియున్నప్పటికీ, (సహజంగానే) స్పష్టత లోపిస్తున్నది. వెంకట్రావుగారు తెలిపినట్లుగా, ద్వైదీభావ ఆలోచనలు చిన్నప్పటి నుంచి నూరిపోస్తున్నందున అతి కొద్దిమందిలో మాత్రమే శాస్త్రీయ దృక్పథం, ముఖ్యంగా ప్రగతిశీల శక్తులలో నెలకొని ఉన్నది.

ఎం.బి.గారు శాస్త్రీయ దృక్పథం కొరవడటాన్ని "ఆలోచనా దారిద్ర్యంగా" పేర్కొన్నారు. ఈ ఆలోచనా దారిద్ర్యం నుండి బయటపడటానికి ప్రగతిశీల మేధావుల ఐక్యతను నిర్మించాలని నా కోరిక. వారు తమ తమ సంస్థల ద్వారా కృషి చేయాలనీ, చేస్తారని ఆశిస్తున్నాను. నేటి మితవాద వాతావరణంలో ఈ కృషికి చాలా ప్రాముఖ్యత ఉన్నది. **– మహ్మద్ అక్బర్,** గుంటూరు

# ఉగ్రవాద కేంద్రాలుగా అమెరికా, నాటో దేశాలు

ఎ కోటిరెడ్డి



రచయిత మార్క్సిస్టు మాసపత్రిక బాధ్యులు

అమెరికా, బ్రిటన్ సామ్రాజ్యవాదులు నాటోతో కలిసి 2001లో ఇరాక్‌పై దురాక్రమణ యుద్ధం ప్రారంభించారు. ఇరాక్‌పై సామ్రాజ్యవాదుల యుద్ధంలో బ్రిటన్ వ్యవహరించిన తీరుపై 2009, జూన్ 15న నాటి బ్రిటిష్ ప్రధాని గార్డన్ బ్రౌన్ సర్‌జాన్ చిల్కాట్ నాయకత్వంలో విచారణ కమిటీని ఏర్పాటు చేశాడు. 2001 నుండి 2009 వరకు ఇరాక్‌పై జరిపిన యుద్ధంలో బ్రిటన్ అనుసరించిన విధానం, భవిష్యత్‌లో తీసుకోవాల్సిన పాఠాలు అన్న అంశాలపై కమిటి విచారణ జరిపింది. కమిటి ఏడు సంవత్సరాల పాటు విచారణ జరిపి 2016, జులై 6వ తేదీన నివేదికను సమర్పించింది. అకారణంగా ఇరాక్‌పై బ్రిటన్ యుద్ధం ప్రారంభించిన తీరును సర్ జాన్ చిల్కాట్ నివేదిక కళ్ళకు కట్టింది. ఇరాక్ వద్ద సామూహిక జనహనన ఆయుధాలు ( వెపన్స్ ఆఫ్ మాస్ డిస్ట్రక్షన్) ఉన్నాయనేది సరికాదని, రెండవసారి ఇరాక్ వెళ్ళిన ఆయుధ ఇన్స్‌పెక్టర్ల బృందం నివేదిక సమర్పించకుండానే, భద్రతా మండలి రెండవసారి తీర్మానం చేయకుండానే యుద్ధానికి పూనుకున్నారని, అది గత్యంతరం లేక సైనిక చర్య తీసుకోవలసిన సమయం కాదని, సద్దాంహుస్సేన్ ప్రమాదాన్ని ఎక్కువ చేసి చూయించారని కమిటి చెప్పింది. సద్దాం అనంతరం ఇరాక్‌లో ఏమిచేయాలనే దానిపై స్పష్టత లేకుండానే యుద్ధానికి ఉపక్రమించారని చెప్పింది. సద్దాం హుస్సేన్ 48 గంటలలో ఇరాక్‌ను వదిలిపోవాలన్న అమెరికా అల్టిమేటంను అంగీకరించకపోతే ఇరాక్‌పై దాడి చేయాలని 2003, మార్చి 17న బ్రిటిష్ కేబినెట్ తీర్మానం చేసింది. కమిటి చెప్పిన అంశాల ప్రకారం ఏ విధంగానూ సమర్ధించటానికి వీలులేని విధంగా బ్రిటన్ ఇరాక్‌పై అక్రమంగా దురాక్రమణదారీ యుద్ధానికి పూనుకున్నది. బ్రిటన్ పాత్రను గురించి మాత్రమే నివేదిక చెప్పినా పైన పేర్కొన్న అంశాలు బ్రిటన్‌కే కాక యుద్ధానికి నాయకత్వం వహించిన అమెరికా, పాల్గొన్న ఇతర దేశాలన్నింటికీ వర్తిస్తాయి. అమెరికా, బ్రిటన్, నాటో కూటమి, అమెరికా మిత్రదేశాలు అంతర్జాతీయ న్యాయసూత్రాలను, చట్టాలను పాటించకుండా ఇరాక్‌పై యుద్ధానికి దిగాయి. ఈ యుద్ధ పరిణామాలు ఇరాక్ ప్రజలకు వినాశకరంగా పరిణమించాయి. లక్షలాది మంది మరణించటానికి, ఆ దేశం సర్వనాశనం కావటానికి ఈ దురాక్రమణదారి యుద్ధం కారణమైంది. అంతర్జాతీయ చట్టాలు, న్యాయసూత్రాలను ధిక్కరించి ఇరాక్‌పై యుద్ధానికి పూనుకున్న అప్పటి అమెరికా అధ్యక్షుడు బుష్, బ్రిటన్ ప్రధాని టోని బ్లెయిర్, ఇతర సామ్రాజ్యవాద దేశాల నాయకులను ఏం చేయాలి?లక్షల మంది ప్రాణాలను తీసి, కోట్లాది మంది ప్రజలను చెప్పరాని కడగండ్లకు గురిచేసిన వీరికి ఉరిశిక్ష సరిపోతుందా?

ఎక్కడైనా ఉగ్రవాద దాడులు జరిగి పదుల సంఖ్యలో ప్రజలు మరణించినపుడు ఆ దాడిని గురించి, ఉగ్రవాదుల దుర్మార్గాన్ని గురించి రోజుల తరబడి కథలు కథలుగా ప్రచారం చేసే ప్రచార సాధనాలు లక్షలాది మంది మరణాలకు కారణమైన, ఒక దేశాన్ని సర్వనాశనం చేసిన యుద్ధానికి కారణాలను వెలికి తీసిన సర్ జాన్ చిల్కాట్ నివేదికను ఒక్కరోజుతోనే మరచిపోయింది. ఉగ్రవాద దాడులను వెల్లడించటం, ఉగ్రవాదులకు వ్యతిరేకంగా ప్రజలను చైతన్యవంతం చేయటం అవసరమే. వాటితో పోల్చుకుంటే అనేక వందల రెట్లు ప్రమాదకరమైన, క్రూరమైన సామ్రాజ్యవాదుల దురాక్రమణదారి యుద్ధాన్ని గురించి మూగనోము పట్టటం సరైనదేనా? అమెరికా, నాటో దేశాలు ప్రపంచ ఉగ్రవాద కేంద్రాలుగా తయారయాయి. ప్రపంచంలో ఎక్కడ ఏ దేశం తాము చెప్పినట్లుగా వినకపోయినా, తమ ఆర్థిక, రాజకీయ ప్రయోజనాలకు విరుద్ధంగా వ్యవహరించినా ఆ దేశంపై దాడిచేసి, సర్వనాశనం చేస్తున్నారు. ఉగ్రవాదులను పెంచి పోషించటంలో, వారిని తన రాజకీయ ప్రయోజనాలకు వినియోగించుకోవటంలో, వారు తన అభీష్టానికి విరుద్ధంగా వ్యవహరిస్తే ఆ సాకుతో వారిపైనా, వారు ఆశ్రయం పొందుతున్న దేశాలపైనా దాడులు చేయటంలో అమెరికా అగ్రస్థానంలో ఉన్నది. అమెరికా తనదేశంలోనే వివిధ దేశాలలోని ఉగ్రవాదులకు శిక్షణా కేంద్రాలను ఏర్పాటు చేసి శిక్షణ ఇస్తున్న విషయాలు గతంలోనే వెల్లడైనాయి.

స్వతంత్ర దేశంగా ఉన్న ఇరాక్‌పై అమెరికా, బ్రిటన్, నాటో కూటమి దేశాలు ప్రారంభించిన యుద్ధం ఆ దేశాన్ని సర్వనాశనం చేసింది. ఇరాక్‌పై జరిపిన దురాక్రమణ యుద్ధంలో లక్షా యాభైవేల నుండి 10 లక్షల మందికి పైగా చనిపోయారని వివిధ సంస్థలు నిర్వహించిన అధ్యయనాలు స్పష్టం చేశాయి. చనిపోయిన వారిలో ఎక్కువ మంది సాధారణ పౌరులు. వారిలో మహిళలు, పిల్లలు, వృద్ధులు గణనీయంగా ఉన్నారు. లక్షలాది మంది వికలాంగులై జీవితాంతం భౌతిక ఇబ్బందులను, మానసిక క్షోభను అనుభవిస్తున్నారు. లక్షలాది మంది నిరాశ్రయులయ్యారు. సద్దాంహుస్సేన్ నిరంకుశంగా పాలించినా దేశంలో మతోన్మాద శక్తులు కాలూనటానికి తావివ్వలేదు. లౌకిక విధానాలకు కట్టుబడి ఉన్నాడు. సద్దాం హుస్సేన్ అనంతరం ఇరాక్‌లో మతోన్మాదశక్తులు పెచ్చరిల్లాయి. తీవ్రవాద సంస్థలు నిలదొక్కుకున్నాయి. దేశంలో ప్రతిరోజూ మారణకాండ సాగుతున్నది. బాంబు పేలుళ్ళు, ఆత్మాహుతి దాడులు పెరుగుతున్నాయి. ఐయస్‌ఐయస్ కొంత ప్రాంతంలో పట్టు సాధించింది. మోసుల్, ఫల్లూజా, అబూగ్రాయిబ్‌లను స్వాధీనం చేసుకుంది. ప్రాంతీయ రాజధానిగా ఉన్న రమాడిలో ఎక్కువ భాగంపై అదుపు సాధించింది. ఆ ప్రాంతంలో తన పాలనను ఏర్పాటు చేసినట్లు ప్రకటించి, ప్రజలను చెప్పరాని బాధలకు గురిచేసింది. కుర్దులు తిరుగుబాట్లు చేస్తున్నారు. వివిధ ప్రాంతాలలో జరుగుతున్న దాడులు, దౌర్జన్యాలు, తీవ్రవాదులు, అరాచకశక్తులు పెచ్చరిల్లటంతో ప్రజలు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని కాలం గడుపుతున్నారు. ప్రభుత్వ సైనికులు, ఉగ్రవాదుల మధ్య జరుగుతున్న యుద్ధంలో ప్రజలు

**"మధ్యప్రాచ్యంలో ఉన్న ముస్లింలలో తీవ్రవాద భావ జాలం ప్రారంభం కావటానికి, ముస్లింలలో సాయుధ మూకలు రూపుదిద్దుకోవటానికి సామ్రాజ్యవాదుల ఆధిపత్య వ్యూహాలే కారణం. 1930వ దశకం నుండి మధ్యప్రాచ్యంలో జరిగిన పరిణామాలను పరిశీలిస్తే సామ్రాజ్యవాదులు తీవ్రవాదాన్ని ఏ విధంగా పెంచి పోషించారో స్పష్టమౌతుంది."**



ఇరాక్‌లో అమెరికా సైన్యాల విధ్వంసం

నలిగిపోతున్నారు. తిండి దొరకక, కనీసావస రాలు తీరక ఇబ్బందులు పడుతున్నారు. దేశం మొత్తంగా అంతర్యుద్ధంలో కూరుకుపోయి, కుక్కలు చింపిన విస్తరిలా తయారయింది. సద్దాం హయాంతో ప్రస్తుత ఇరాక్ పరిస్థితి పోలిక పెట్టటానికి వీలులేని విధంగా దిగజారి పోయింది. ఇరాక్‌పై సాగించిన యుద్ధం మధ్య ప్రాచ్యంలో తీవ్రవాద సంస్థలు విస్తరించటానికి దారితీసింది. తీవ్రవాద సంస్థలను పెంచి పోషించటం, వాటి ద్వారా అభ్యుదయ, వామపక్ష ఉద్యమాలను దెబ్బతీయటం సామ్రాజ్యవాదుల వ్యూహంలో భాగంగా ఉంది. అమెరికా, బ్రిటన్ లు అనుసరించిన విధానాలే ముస్లింలలో మత మౌఢ్యం, తీవ్రవాద శక్తులు పెరగటానికి కారణమయ్యాయి.

ప్రపంచంలో జరుగుతున్న పరిణామా లను పరిశీలిస్తే వివిధ దేశాలలో తీవ్రవాద సంస్థలు తలెత్తటానికి, విస్తరించటానికి సామ్రాజ్య వాదుల పాత్ర ప్రధానమని స్పష్టమౌతున్నది. మధ్యప్రాచ్యంలో ఉన్న ముస్లింలలో తీవ్రవాద భావజాలం ప్రారంభం కావటానికి, ముస్లింలలో సాయుధ మూకలు రూపుదిద్దుకోవటానికి సామ్రాజ్యవాదుల ఆధిపత్య వ్యూహాలే కారణం. 1930వ దశకం నుండి మధ్యప్రాచ్యంలో జరిగిన పరిణామాలను పరిశీలిస్తే సామ్రాజ్య వాదులు తీవ్రవాదాన్ని ఏ విధంగా పెంచి పోషించారో స్పష్టమౌతుంది.

1917లో సోవియట్ యూనియన్ ఆవిర్భ వించిన తర్వాత ప్రపంచంలో కమ్యూనిస్టు భావ జాలం విస్తరించటం, వివిధ దేశాలలో కమ్యూ నిస్టు పార్టీలు ఏర్పడి వలస దోపిడీకి వ్యతిరేకంగా జాతీయ స్వాతంత్ర్యం కోసం పోరాటాలు తీవ్ర మయాయి. సోవియట్ పక్కనే ఉన్న మధ్యప్రాచ్యం లోని దేశాలతో ఆ దేశానికి స్నేహ సంబంధాలు బలపడుతుండటం, సోషలిస్టు భావాలు మరిం త వేగంగా వ్యాపించటం తదితర పరిణామాలు సామ్రాజ్యవాదులను భయకంపితులను చేశాయి. అటువంటి పరిస్థితులలో తన సామ్రాజ్యవాద ప్రయోజనాల కోసం 1930వ దశకం నుండి మధ్యప్రాచ్యంలో జోక్యం చేసుకోవటం, ముస్లిం మతంలో ఉగ్రవాదాన్ని ప్రోత్సహించటాన్ని అమెరికా ప్రారంభించింది. ముస్లిం దేశాలలోని ప్రజలను సోవియట్ ప్రభావం నుండి దూరం చేయటానికి, సోవియట్ వ్యతిరేక కేంద్రాలుగా ఆ దేశాలను మార్చటానికి అమెరికా ప్రయత్నాలు ప్రారంభించింది. సౌదీ అరేబియాలో 1938లో అమెరికా ఆయిల్ బావిని కనుగొన్నది. ఆ దేశంలో సైనిక స్థావరాన్ని ఏర్పాటు చేయటానికి 1945లో ఒప్పందం చేసుకున్నది. కమ్యూనిస్టు వ్యతిరేక ప్రచారాన్ని ఉధృతం చేసింది. స్థాని కంగా ఉన్న తీవ్రవాద గ్రూపులను సోవియట్‌కు వ్యతిరేకంగా రెచ్చగొడుతూ ప్రచారం చేసింది. అమెరికా గూఢచారి సంస్థ సిఐఎ ఈ ప్రచారానికి ప్రధాన సాధనంగా రేడియో లిబర్టీని వినియో గించుకున్నది. అమెరికా ఆధ్వర్యంలో జరుగు తున్న మత ప్రచార ఖర్చును సౌదీ– అమెరికా ఆయిల్ కంపెనీ అరాంకో భరించేది. ఈ సమ యంలోనే ఇరాన్‌లో మొసాదిక్ నాయకత్వంలో నేషనల్ ఫ్రంట్ బలమైన శక్తిగా అభివృద్ధి అయింది. నేషనల్ ఫ్రంట్‌ను చీల్చటానికి ఆ సంస్థలో ఒక నాయకుడుగా ఉన్న కసానీని వినియోగించుకొని, అతనిని అన్ని విధాలుగా ప్రోత్సహించింది. 1953లో ప్రజాస్వామ్య యుతంగా ఎన్నికైన మొసాదిక్ ప్రభుత్వం ఆంగ్లో, పర్షియన్ ఆయిల్ కంపెనీని జాతీయం చేసింది. సోవియట్ యూనియన్‌తో స్నేహసంబంధాలను పెంపొందించుకున్నది. ఈ విధానాలు పశ్చిమ దేశాల ప్రయోజనాలకు విఘాతం కలిగిస్తాయని భావించిన అమెరికా, బ్రిటన్‌లు మొసాదిక్ ప్రభు త్వాన్ని కూలద్రోసి, పశ్చిమ దేశాలకు అనుకూ లంగా ఉన్న షాను ఇరాన్ గద్దెపై కూర్చుండ బెట్టాయి. ఆ ప్రభుత్వంతో కలిసి అక్కడ మతోన్మా దాన్ని పెంచే విధానాలను అనుసరించాయి.

ఈజిప్ట్‌లో అభ్యుదయం వైపుకు జరుగు తున్న పరిణామాలను నిరోధించటంలో భాగం గా మధ్యప్రాచ్యంలో హంతకులకు స్థావరంగా, తీవ్రవాదానికి కేంద్రంగా ఉన్న మతోన్మాద సంస్థ ముస్లిం బ్రదర్‌హుడ్ నాయకుడు సయీద్ రమాదాన్‌ను ప్రోత్సహించటాన్ని అమెరికా ప్రారంభించింది. అప్పటి అమెరికా అధ్యక్షుడు ఐసెన్‌హోవర్ 1953లో వైట్‌హౌస్‌లో జరిగిన విందుకు అతనిని ఆహ్వానించాడు. 1952లో ఈజిప్ట్‌లో రాజుకు వ్యతిరేకంగా గమాల్ అబ్దుల్ నాజర్, మహమ్మద్ నకీబ్‌ల నాయకత్వంలో తిరుగుబాటు జరిగింది. రాజకీయంగా బలమైన శక్తిగా ఎదుగుతున్న నాజర్‌పై 1954లో ముస్లిం బ్రదర్‌హుడ్ సభ్యుడు హత్యా ప్రయత్నం చేశాడు. రాజును అధికారం నుండి తప్పించిన తర్వాతి పరిణామాలలో 1956లో నాజర్ ఈజిప్ట్ అధ్యక్షుడైన తర్వాత అరబ్ ప్రపంచంలో నాజర్ ప్రతిష్ఠ పెరిగింది. బ్రిటిష్ పెత్తనం కింద ఉన్న సూయజ్ కాలువను 1956లో నాజర్ జాతీయం చేశాడు. అరబ్ దేశాలను చీల్చటానికి ఇరాక్, టర్కీలతో బ్రిటన్ రూపొందించిన బాగ్దాద్ ఒప్పందాన్ని వ్యతిరేకించాడు. 1961లో అలీన దేశాల కూటమి ఏర్పాటులో ముఖ్యపాత్ర

**"1979లో ఆఫ్ఘన్ ముజాహిద్దీన్‌లకు సాయం అందించింది. ఆఫ్ఘన్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా అరబ్ దేశాలను కూడగట్టటానికి ప్రయత్నం చేసింది. అన్వర్ సాదత్ నుండి ఆర్థిక సహాయం, ముస్లీం బ్రదర్‌హుడ్ నుండి పోరాటంలో పాల్గొనేవారిని తీసుకున్నారు."**



గమాల్ అబ్దుల్ నాజర్

పోషించాడు. సోషలిస్టు దేశమైన చెకోస్లోవేకియా నుండి ఆయుధాలను కొనుగోలు చేశాడు. నైలునదిపై నిర్మిస్తున్న అశ్వన్‌డ్యాంకు సోవియట్ యూనియన్ నుండి ఆర్థిక, సాంకేతిక సహాయాన్ని తీసుకోవటానికి ఒప్పందం చేసుకున్నాడు. ఈ పరిణామాలతో ఈజిప్ట్ సోవియట్ కూటమికి దగ్గరౌతుందని భావించిన అమెరికా ముస్లీం బ్రదర్‌హుడ్‌తో పాటు ఆ దేశంలోని అభివృద్ధి నిరోధక శక్తులకు మద్దత్తునిచ్చింది. కమ్యూనిజానికి వ్యతిరేకంగా పోరాడే దేశాలకు ఆర్థిక, సైనిక సహాయం అందజేస్తానని ఐసెన్‌హోవర్ బహిరంగంగా ప్రకటించాడు. ఈ విధమైన సహాయంతో సౌదీ అరేబియా అత్యధిక లాభం పొందింది.

1967లో ఇజ్రాయిల్, అరబ్ దేశాల మధ్య యుద్ధం జరిగింది. ఈ సందర్భంలో అరబ్‌దేశాలలో అమెరికా వ్యతిరేక భావాలు బలపడ్డాయి. సౌదీ అరేబియా మినహా మిగిలిన అన్ని అరబ్ దేశాలలోని అమెరికా రాయబార కార్యాలయాలు మూతపడ్డాయి. సాంప్రదాయకంగా ఉన్న ముస్లీం మతతత్వంతో పాటు తీవ్రవాద భావజాలం వ్యాప్తిచెందటం ప్రారంభమైంది. 1970వ దశకంలో మధ్యప్రాచ్యంలో ముస్లీం తీవ్రవాద సంస్థలు తలెత్తాయి. 1970లో నాజర్ చనిపోయిన తర్వాత ఈజిప్టు అధ్యక్షుడైన అన్వర్ సాదత్ దేశంలో షరియా అమలు జరుగుతుందని ప్రకటించాడు. రాజకీయంగా ఇస్లాంను వినియోగించుకోవటం, ఇస్లామిక్ బ్యాంకింగ్ విధానాన్ని ప్రారంభించారు. ఇవి రెండూ ఇస్లామిక్ తీవ్రవాదానికి, టెర్రరిస్టులకు వినియోగపడ్డాయి. 1971 లో ప్రభుత్వం నుండి నాజర్ అనుయాయులను తొలగించి, ముస్లీం బ్రదర్‌హుడ్ ఖైదీలను అన్వర్ సాదత్ విడుదల చేశారు.

ఆఫ్ఘన్ ఇస్లామిక్ మూవ్‌మెంట్ నాయకులకు సహాయం చేయటానికి సిఐఎ 1970లో ఆసియా ఫౌండేషన్‌ను ఏర్పాటు చేసింది. 1980లలో సోవియట్‌కు వ్యతిరేకంగా పోరాడిన రబ్బాని సయ్యద్, గుల్బుద్దీన్ హెక్మత్యార్‌లు దీని నుండి ప్రయోజనం పొందారు. 1972లో ఇస్లామిక్ మూవ్‌మెంట్ ఆఫ్ యూత్‌ను ఏర్పాటు చేసి, కమ్యూనిస్టు వ్యతిరేక కార్యకలాపాలను తీవ్రం చేశారు. సోవియట్‌కు అనుకూలంగా ఉండే సర్దార్ దావూద్ 1973లో రాజరికాన్ని కూలదోసి, ప్రజాతంత్ర రిపబ్లిక్‌ను ఏర్పాటు చేశాడు. అమెరికా వెంటనే రాడికల్ ఇస్లామిస్ట్ పార్టీకి, ప్రభుత్వ వ్యతిరేకులకు నిధులివ్వటం ప్రారంభించింది. దావూద్ ప్రభుత్వాన్ని కూలద్రోయటం కోసం ఇరాన్, పాక్ ఇంటలిజెన్స్ సంస్థలతో సిఐఎ భాగస్వామ్యాన్ని ఏర్పాటు చేసుకున్నది. 1979లో ఆఫ్ఘన్ ముజాహిదీన్‌లకు సాయం అందించింది. ఆఫ్ఘన్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా అరబ్ దేశాలను కూడగట్టటానికి ప్రయత్నం చేసింది. అన్వర్ సాదత్ నుండి ఆర్థిక సహాయం, ముస్లీం బ్రదర్‌హుడ్ నుండి పోరాటంలో పాల్గొనేవారిని తీసుకున్నారు. బాంబులు తయారు చేయటం, మారణకాండతో ప్రజలను భయభ్రాంతులకు గురిచేయటం, గెరిల్లా యుద్ధంలో అమెరికా ప్రత్యేక బలగాలు వీరికి శిక్షణ ఇచ్చాయి. ఈ శిక్షణ పొందినవారే ఆ తరాత లాడెన్‌తో కలిసి ఆల్‌ఖైదాకు వెన్నుముకగా మారారు. విదేశీ యుద్ధాల్లో పాల్గొనే ఇస్లామిస్టులను సమన్వయం చేయటానికి ఆల్‌ఖైదా పూర్వరూపం సర్వీస్‌బ్యూరోను 1984లో లాడెన్ ఏర్పాటు చేశాడు.

పాలస్తీనా లిబరేషన్ ఆర్గనైజేషన్( పియల్‌ఒ)కు వ్యతిరేకంగా అహ్మద్ యాసిన్ నాయకత్వంలోని ఇస్లామిక్ అసోసియేషన్‌కు 1978 నుండి ఇజ్రాయిల్ మద్దత్తివ్వటం ప్రారంభించింది. తర్వాత అతడే హమాస్‌కు బౌద్ధిక నాయకుడయ్యాడు. 1987లో ముస్లీం బ్రదర్‌హుడ్‌లోని తీవ్రవాదులు హమాస్‌ను ఏర్పాటు చేశారు. ఇజ్రాయిల్ సీక్రెట్ సర్వీస్ వారికి రహస్యంగా సాయం అందించటం, పాలస్తీనా టెర్రరిస్టు గ్రూపులకు మిలిటరీ శిక్షణ ఇవ్వటం చేసింది. ముస్లీం బ్రదర్‌హుడ్, ఆఫ్ఘన్ పోరాటంలో పాల్గొన్నవారితో అల్జీరియాలో 1989లో ఇస్లామిక్ నేషనల్ ఫ్రంట్ పేరుతో రాజకీయ పార్టీని ఏర్పాటు చేశారు. లాడెన్ ఆర్థిక సాయంపై ఆధారపడిన తాలిబన్‌లతో 1994-98 మధ్య సంబంధాలను కొనసాగించారు. 1996లో లాడెన్ సూడాన్ నుండి వచ్చిన తర్వాత ఆఫ్ఘనిస్థాన్‌లో ఆశ్రయం కల్పించారు. ఈ విధంగా ప్రపంచంలో ఇస్లామిక్ తీవ్రవాదాన్ని పెంచి పోషించటంలో అమెరికా పాత్ర ప్రధానమైనది. అరబ్ దేశాలలో తలెత్తిన అభ్యుదయ ఉద్యమాలను విచ్ఛిన్నం చేయటానికి, కమ్యూనిస్టు ఉద్యమవ్యాప్తిని అరికట్టటానికి ఇస్లామిక్ తీవ్రవాదాన్ని సాధనంగా అమెరికా, సామ్రాజ్యవాదుల కూటమి వినియోగించుకున్నది.

**ఐయస్‌ఐయస్ ఆవిర్భావం**


ఇస్లామిక్ స్టేట్ ఇన్ ఇరాక్ (ఐయస్‌ఐ) పేరుతో 2013లో ఆల్‌ఖైదా నుండి చీలిపోయి స్వతంత్ర సంస్థగా ఏర్పడింది. సిరియాలోకి విస్తరించిన తర్వాత ఐయస్‌ఐయస్‌గా మార్పు చెందింది. ఇరాక్, సిరియాల్లో ప్రభుత్వ బలగాలతో పోరాడే ప్రధానశక్తిగా రూపుదాల్చింది. ఆ దేశాలలో కొన్ని విజయాలు సాధించిన తర్వాత మరింత ప్రమాదకరంగా మారింది. విదేశాల నుండి వచ్చి పోరాటాలలో పాల్గొంటున్న వారితో కలిపి వేలాది మంది సాయుధులు ప్రస్తుతం ఆ సంస్థలో ఉన్నారు. ముస్లీంలలో ఉన్న షియా, సున్నీ వైరుధ్యాలను కూడా ఐయస్ ఐయస్ వినియోగించుకొంటున్నది. ఇరాక్‌లో షియాలు మెజారిటి, సున్నీలు మైనారిటీగా ఉన్నారు. సున్నీలు అత్యధికంగా ఉన్న ఫల్లూజాను 2014లో స్వాధీనం చేసుకున్నది. సిరియాలో చేస్తున్న పోరాటంలో అసద్ వ్యతిరేకశక్తుల నుండి సహాయం పొందుతున్నారు. ఉత్తర ఇరాక్, తూర్పు సిరియాలోని ఆయిల్ బావులపై

> **"ఆయిల్‌పై పెత్తనాన్ని అమెరికా కంపెనీలకు అప్పగించటానికి ఆ ప్రభుత్వాలు అంగీకరించలేదు. తమ మాట వినని ప్రభుత్వాలను అధికారం నుండి తొలగించ టానికి యుద్ధాలు చేస్తున్నారు. ఈ విధంగానే ప్రపం చంలో అనేక దేశాలపై యుద్ధాలు చేస్తున్నారు."**

ఆధిపత్యం సాధించారు. మోసుల్‌ను స్వాధీనం చేసుకున్నపుడు ఇరాక్ సెంట్రల్ బ్యాంక్ మోసుల్ బ్రాంచి నుండి కోట్లాది డాలర్లను తీసుకున్నారు. అమెరికా, నాటో కూటమి దేశాలు సిరియాలో అసద్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఈ మధ్యకాలం వరకు ఈ సంస్థకు ఆర్థిక, ఆయుధ సహాయం అందించాయి. ఇపుడు అదించటం లేదని చెబు తున్నా సామ్రాజ్యవాదుల నయవంచక విధానా లను గుర్తుచేసుకొంటే వాళ్ళ మాటలను నమ్మలేం. బహిరంగంగా వ్యతిరేకిస్తున్నట్లు నటిస్తూనే తాము వ్యతిరేకించే ప్రభుత్వాలను కూలద్రోయటానికి గతంలో అనేక సంస్థలకు రహస్యంగా సహాయాన్ని అందించారు. అరబ్ దేశాలలోని ఉగ్రవాద సంస్థలన్నింటినీ అమెరికాయే పెంచిపోషించిందని ఇంతకు ముందే చూశాం.

తన సామ్రాజ్యవాద ప్రయోజనాల కోసం అమెరికా బలహీన దేశాలపై దాడలు చేస్తూ లక్షలాది మంది అమాయక ప్రజలను చంపు తున్నది. అమెరికా, నాటో సైన్యాలు అడుగు పెట్టిన దేశాలలో ప్రజలపై జరుపుతున్న హింసా కాండకు అంతుండదు. ప్రజలపై దాడులు, దౌర్జన్యాలు చేయటం, తమకు ఎదురు తిరిగిన వారిని కాల్చిచంపటం వారికి ఆటగా ఉంటుంది. వృద్ధులు, స్త్రీలు, పిల్లలనే విచక్షణ లేకుండా హింసించటం, మహిళలను మానభంగాలు చేస్తు న్నారు. ఈ పైశాచిక మూకలు అడుగుపెట్టిన ప్రాంతం శ్మశానాన్ని తలపించేలా మారిపో తుంది. సామ్రాజ్యవాద ముష్కరులు మనుషుల పట్ల ఎంత కౄరంగా వ్యవహరిస్తారో అబూ గ్రాయిబ్ జైలులో ఖైదీలపై అమలు జరిపిన దారుణమైన హింస స్పష్టం చేసింది.

తమదేశాలపై అక్రమంగా దాడిచేసి, తమ ప్రజలను హత్యలు చేస్తూ, స్త్రీలను మానభంగం చేస్తున్న సామ్రాజ్యవాద దేశాలపై దాడులకు గురవుతున్న దేశాలలోని యువత ఆగ్రహంతో రగిలిపోతున్నది. సామ్రాజ్యవాదులపై ప్రతీకారం తీర్చుకోవటానికి ముందుకొస్తున్నారు. వారి



సద్దాం హుస్సేన్

ఆగ్రహాన్ని సరైనదారికి మళ్ళించి, ప్రజలను కూడగట్టి, సామ్రాజ్యవాదులను తరిమివేయాలని ఉద్బోధించే శక్తులు బలహీనంగా ఉన్నాయి. ప్రత్యామ్నాయం చూపేవారు లేని పరిస్థితులలో ఆగ్రహం చెందిన యువత తీవ్రవాదం వైపు ఆకర్షితులవుతున్నారు. పెరుగుతున్న మతో న్మాదం, యువతలో పెరుగుతున్న నిరుద్యోగం, నిరాశ నిస్పృహలు యువతను దారి తప్పించి, ఉగ్రవాద జ్వాలలకు ఆహుతి చేస్తున్నాయి. ఉ గ్రవాదుల ఉచ్చులో చిక్కిన తర్వాత విచక్షణ కోల్పోయి అమాయక ప్రజలపై దాడులు, దౌర్జ న్యాలు, హత్యలు చేస్తున్నారు. తాము ఏ ప్రజల కోసం పోరాటం చేస్తున్నామనుకుంటున్నారో ఆ ప్రజల సానుభూతిని కూడా కోల్పోతున్నారు. ఇది కూడా సామ్రాజ్యవాదులకు ఆయాచిత ప్రయోజనం కల్పిస్తున్నది. ఉగ్రవాద సంస్థలు దారితప్పి వ్యవహరించటాన్ని సాకుగా చూపుతూ అమెరికా, నాటో కూటమి ఉగ్రవాదంపై యుద్ధం పేరుతో తనను వ్యతిరేకించే దేశాలపై దాడులు చేస్తున్నది.

ఉగ్రవాదులు జరుపుతున్న దాడుల్లో వేలాది మంది మరణిస్తున్నారు. గాయాల పాలవటం, వికలాంగులు కావటం జరుగు తున్నది. అనేక దేశాల్లో లక్షలాది మంది ప్రజలు ఉగ్రవాద భయంతో బతుకుతున్నారు. మహి ళలపై అత్యాచారాలకు పాల్పడుతున్నారు. ప్రజలను బెదిరించి డబ్బు వసూలు చేస్తున్నారు. తామున్న ప్రాంతంలో ప్రజలు ప్రశాంతంగా బతికే పరిస్థితి లేకుండా చేస్తున్నారు. ఈ విధంగా వ్యవహరిస్తున్న ఉగ్రవాదాన్ని అంతం చేయాలనే విషయంలో మరో మాటకు తావు లేదు. ఉ గ్రవాదం అంతం అయితేనే ఆయా దేశాలలోని ప్రజలు ప్రశాంతంగా బతకుతారు. ఉగ్రవాదుల దాడుల్లో వందల మంది మరణి స్తుంటే సామ్రాజ్యవాదుల దాడుల్లో లక్షల మంది మరణిస్తున్నారు. దేశాలకు దేశాలే సర్వనాశనం అయిపోతున్నాయి. ఇరాక్, సిరియాలు సామ్రాజ్య వాదుల దాడులలో సర్వనాశనం అయ్యాయి. ఇరాక్‌లో సద్దాం హుస్సేన్ ప్రభుత్వాన్ని, సిరియాలో అసద్ ప్రభుత్వాన్ని మార్చాలని ప్రచారం ప్రారంభించి, నాటో కూటమి దేశాల తో కలసి ఆ దేశాలపై దాడులకు దిగింది. ఎమెన్‌పైనా దాడులు చేస్తున్నారు. తనకు వేలమైళ్ళ దూరంలో ఉన్న దేశాల అంతర్గత వ్యవహారాలలో జోక్యం చేసుకోవలసిన అవసరం అమెరికా కేముంది? ఆ దేశాలలోని ప్రభుత్వాలు ప్రజాస్వామ్యయుతంగా వ్యవహరిం చకపోతే, ప్రజల సమస్యలను పరిష్కరించకపోతే ప్రభుత్వాలను ఏంచేయాలో ఆ దేశాలలోని ప్రజలే నిర్ణయించుకుంటారు. సామ్రాజ్య వాదులెందుకు జోక్యం చేసుకొంటున్నారు? ఈ విధంగా జోక్యం చేసుకోవటంలో సామ్రాజ్య వాదుల ప్రయోజనాలున్నాయి. తమ దేశాలలోని బహుళజాతి సంస్థలకు, ద్రవ్య పెట్టుబడులకు లాభాలు రావాలంటే తమకు అనుకూలమైన విధానాలనే అన్ని దేశాల ప్రభుత్వాలు అను సరించాలి. ఆ విధానాలు ఆ దేశాలలోని మెజారిటీ ప్రజల ప్రయోజనాలకు విఘాతం కలిగిస్తాయి. కాబట్టి ఏ దేశం అయినా తమ ప్రజలకు నష్టం కలిగించే విధానాలను అను సరించటాన్ని వ్యతిరేకిస్తే ఆ దేశాలపై కత్తిగట్టి, తప్పుడు ఆరోపణలు చేస్తూ దాడులు చేస్తున్నారు. ఇరాక్, సిరియాలలో ఆయిల్ నిల్వలున్నాయి. ఆయిల్‌పై పెత్తనాన్ని అమెరికా కంపెనీలకు అప్పగించటానికి ఆ ప్రభుత్వాలు అంగీకరించ లేదు. తమమాట వినని ప్రభుత్వాలను అధి కారం నుండి తొలగించటానికి యుద్ధాలు చేస్తున్నారు. ఈ విధంగానే ప్రపంచంలో అనేక దేశాలపై యుద్ధాలు చేస్తున్నారు. యుద్ధాలలో లక్షలాది మంది అమాయక ప్రజలు బలైపోతున్నారు. కాబట్టి ఏది నిజమైన ఉగ్ర

వాదం? ఏది ప్రపంచానికి ప్రమాదకరంగా పరిణమించింది? సామ్రాజ్యవాదమే అసలైన ఉగ్రవాదిగా ఉన్నది. ప్రపంచంలో ప్రజాస్వామ్యానికి, దేశాల సార్వభౌమ హక్కులకు, ప్రజల మానప్రాణాలకు సామ్రాజ్యవాదమే అసలైన ప్రమాదంగా ఉన్నది. వివిధ ఉగ్రవాద సంస్థలు తామున్న దేశాలకు, ప్రాంతాలలో చెదురుమదురుగా ప్రమాదం కలిగిస్తుంటే సామ్రాజ్యవాదం ప్రపంచంలోని అన్ని ప్రాంతాలకు, అన్ని దేశాలకు, ప్రజలందరికీ ప్రమాదంగా పరిణమించింది.

సరళీకరణ విధానాలు ప్రారంభమైన తర్వాత మనదేశంలో ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా అమెరికాతో అంటకాగే విధానాలను అనుసరిస్తున్నాయి. ఆ దేశంతో సైనిక సహకార ఒప్పందాన్ని చేసుకొని అమెరికా దాడులకు పరోక్ష సహకారాన్ని అందిస్తున్నాయి. దాడులకు మన ప్రభుత్వం నుండి సహకారం పెరిగేకొద్దీ మనదేశం ఉగ్రవాద కార్యకలాపాలు, దాడులకు లక్ష్యంగా మారుతున్నది. తమదేశాలపై దాడులకు ఎవరు సహకరిస్తున్నారో ఆ దేశాలపై తీవ్రవాదులు దాడులు చేసి, మారణకాండ సృష్టిస్తున్నారు. వీటిని చూయించి దేశంలోని ముస్లింలందరినీ ఉగ్రవాదులుగా ముద్రవేయటానికి హిందు మతోన్మాదులు ప్రయత్నిస్తున్నారు.

“దాడులకు మన ప్రభుత్వం నుండి సహకారం పెరిగేకొద్దీ మనదేశం ఉగ్రవాద కార్యకలాపాలు, దాడులకు లక్ష్యంగా మారుతున్నది. తమదేశాలపై దాడులకు ఎవరు సహకరిస్తున్నారో ఆ దేశాలపై తీవ్రవా దులు దాడులు చేసి, మారణకాండ సృష్టిస్తున్నారు.”



ఇరాక్‌లో అమెరికన్ సైనిక దళాలు

మనదేశంలో, ప్రపంచంలో ప్రజలపై దాడులు చేస్తున్న తీవ్రవాద సంస్థలను పరిశీలిస్తే దాదాపుగా అన్ని సంస్థలు ఏదో ఒక మతం, లేదా జాతి, ప్రాంతంపేరుతోనే మనుగడ సాగిస్తున్నాయి. మనదేశంలో ముస్లిం, హిందు, సిక్కు మతాల పేరుతో చెలామణి అవుతున్న ఉగ్రవాద సంస్థలున్నాయి. ఈశాన్య ప్రాంతంలో నాగా, అస్సామీ, బోడో తదితర జాతుల పేరుతో తీవ్రవాద సంస్థలున్నాయి. ప్రపంచంలో ముస్లీం, క్రైస్తవ, యూదు, బౌద్ధ మతాల పేరుతో తీవ్రవాద సంస్థలున్నాయి. వివిధ ప్రాంతాలలో జాతులు, ప్రాంతాల పేరుతో అనేక తీవ్రవాద సంస్థలు న్నాయి. వివిధ మతాలు చేస్తున్న ప్రబోధాలకు, మతం పేరుతో కొనసాగుతున్న తీవ్రవాద సంస్థలు నిర్వహిస్తున్న కార్యకలాపాలకు ఏ మాత్రం సంబంధం ఉండటం లేదు. మతాలన్నీ మానవాళిని ప్రేమించాలని, మానవులందరూ శాంతియుతంగా జీవించాలని చెబుతున్నాయి. మతం పేరుతో చెలామణి అవుతున్న సంస్థలు వీటిని పాటించకుండా ప్రజలపై దాడులు చేస్తూ, వేలాది మంది అమాయకుల ప్రాణాలను బలిగొంటూ హింసోన్మాద పూరితంగా వ్యవహరిస్తున్నాయి. ప్రపంచంలో మతోన్మాదం ఎక్కడ, ఏ రూపంలో ఉన్నా సామ్రాజ్యవాదుల మద్దత్తు లేకుండా మనుగడ సాగించే అవకాశం లేదు. మతం పేరుతో అయినా, జాతి పేరుతో అయినా, ప్రాంతం పేరుతో అయినా తీవ్రవాదం రూపుదిద్దుకోవటం నుండి పెంచి పోషించటం వరకు సామ్రాజ్యవాదుల పాత్ర అనివార్యంగా ఉంటున్నది. కాని సామ్రాజ్యవాదులు, వారి అదుపులోని ప్రచార సాధనాలు ముస్లింలను మాత్రమే తీవ్రవాదులుగా ప్రచారం చేస్తూ, ముస్లీం మతం హింసను, తీవ్రవాదాన్ని ప్రబోధించే మతమని ముద్ర వేస్తూ, సామ్రాజ్యవాదుల పాత్రను కప్పిపెడుతున్నారు.

సామ్రాజ్యవాదులు మనదేశం పట్ల ఏనాడూ సానుకూలంగా వ్యవహరించలేదు. మనదేశంలో కూడా అమెరికన్ సామ్రాజ్యవాదులు తీవ్రవాదశక్తులను ప్రోత్సహిస్తున్నారు. సిఐఎ పాకిస్థాన్ ఇంటలిజెన్స్ సంస్థ ఐయస్‌ఐతో కలిసి సరిహద్దులలో ఉగ్రవాద శిక్షణ కేంద్రాలను ఏర్పాటుచేసి, అక్కడ శిక్షణ పొందిన తీవ్రవాదులను మనదేశంలోకి ప్రవేశపెట్టి విధ్వంసం సృష్టించటం అనేక సందర్భాలలో వెల్లడైంది. కాశ్మీర్ సమస్య పరిష్కారం కాకుండా వేర్పాటువాద శక్తులను రెచ్చగొడుతున్నారు. ముంబాయి మారణకాండ సూత్రధారి డేవిడ్ హెడ్లీని మనదేశానికి అప్పగించకుండా తమదేశంలోనే ఉంచటంలోని మర్మమేమిటో స్పష్టమే. ఈశాన్య రాష్ట్రాలలోని వేర్పాటువాద శక్తులకు అమెరికా నుండి అన్ని విధాలైన సహాయ సహకారాలు అందుతున్నాయి. మనదేశానికి వ్యతిరేకంగా పాకిస్థాన్‌కు ఆయుధాలిస్తున్నారు. మనదేశంలోని ఖలిస్థాన్, అస్సాం ఆందోళనలు, ఈశాన్య రాష్ట్రాలలో జాతుల ఆందోళనలో అమెరికా పాత్ర గతం లోనే బట్టబయలైంది. ప్రస్తుత హిందు మతోన్మాదుల పెరుగుదల, వారి కార్యకలాపాలకు సామ్రాజ్యవాదుల మద్దత్తు ఉన్నది. ఈ విధంగా ప్రపంచదేశాలతో పాటు మన దేశంలో కూడా ఉగ్రవాదశక్తులకు మద్దత్తునిస్తున్న అమెరికాతో మన ప్రభుత్వం సైనిక సహకార ఒప్పందం చేసుకోవటం ద్వారా బిజెపి ప్రభుత్వం కొరివితో తలగోక్కోవటానికి పూనుకున్నది. ఉగ్రవాదాన్ని అంతం చేయాలంటే ఆ శక్తులను పెంచి పోషిస్తూ ప్రపంచ ప్రజలకు శాంతి లేకుండా చేస్తున్న సామ్రాజ్యవాదాన్ని అంతం చేయాలి. సామ్రాజ్యవాదాన్ని అంతం చేయటానికి ప్రజలు సన్నద్ధమైతేనే ఉగ్రవాద బెడద నుండి ప్రపంచానికి రక్షణ, ప్రజలకు విముక్తి లభిస్తుంది.


❈

ఈ మాసం ప్రత్యేకం

# నేను ఎందుకు నాస్తికుడనయ్యాను?

భగత్‌సింగ్

*(తెలకపల్లి రవిగారు సంకలనం చేసిన 'భగత్‌సింగ్' పుస్తకంలోని ఈ వ్యాసాన్ని మార్పిస్తూ పాఠకులకు అందిస్తున్నాం)*



ఒక సరికొత్త ప్రశ్న ఉదయించింది. సర్వాంతర్యామి, సర్వశక్తివంతుడూ అయిన దేవుడు ఉన్నాడని నేను విశ్వసించకపోవడం కేవలం నా అహంకారం వల్లనేనా? ఇలాంటి ప్రశ్న నేను ఎదుర్కోవలసి వస్తుందని నేనెన్నడూ ఊహించి ఉండలేదు. కాని కొంతమంది మిత్రులతో సంభాషించినప్పుడు దేవుడున్నాడనే విషయాన్ని నిరాకరించడం నాకు తగని విషయమని వారు భావించుతున్నట్లు అనిపించింది. ఈ రకంగా దేవుని పట్ల ఆ విశ్వాసాన్ని వెల్లడించడం నాలో ఉన్న ఒక రకమైన అహంకార భావమే నన్నట్లు వారు తలుస్తున్నారు. నిజమే. సమస్య చాలా తీవ్రమైనదే. నేను మామూలు మానవుల కంటే అతీతుడనని గొప్పలు చెప్పుకోవడం లేదు. నేనూ ఒక మానవుణ్ణే. అంతకంటే ఎక్కువేమీ కాదు. మామూలు మానవుల కంటే నేను అతీతుడనని ఎవరూ భావించరాదు. నా సహచరులలో కొంతమంది నన్ను నిరంకుశుడినని కూడా అంటారు. నాలో కూడా బలహీనతలు లేకపోలేదు. కానీ డాంబికంగా వ్యవహరించడం నా స్వభావ లక్షణాలలో ఒకటి కాదు. అయితే నా మిత్రుడు బి.కె.దత్ కూడా అప్పుడప్పుడు నన్ను నిరంకుశుడని అంటాడు. కొన్ని సందర్భాల్లో నన్ను నిరంకుశుడిగా నిందించిన వారు కూడా లేకపోలేదు. అనుకోకుండానే నా అభిప్రాయాలను ఇతరులపై రుద్దుతానని, ఆ విధంగా నా ప్రతిపాదనలు ఆమోదించబడేటట్లుగాయత్నిస్తానని కొంతమంది మిత్రులు తీవ్రంగానే ఫిర్యాదులు చేసిన ఉదాహరణలున్నాయి. కొంతవరకు అది నిజమే. దాన్ని నేను కాదనను. ఇది అహంభావం కిందకు రావచ్చు. ఇతర సిద్ధాంతాలకన్నా మన సిద్ధాంతం ఉత్తమమైనదనీ, దానిని అనుసరించుతున్నందుకు నాలో ఒక రకమైన గర్వభావం ఉండవచ్చు. అందులో వ్యక్తిగతమైన విషయమేమీ లేదు. ఇది సహేతుకంగా ఉండవలసిన గర్వమే. అది అహంభావం కిందకు రాదు. ఈ అహంభావం వలనా? లేక తీవ్రంగా అధ్యయనం చేసిన తరువాత, గాఢంగా పరిశీలనానంతరమే నాకు దేవుని యందు విశ్వాసం లేకుండా పోయిందా? అన్న విషయాన్నే ఇక్కడ నేను చర్చించదలిచాను. ముందుగా నేనొక విషయాన్ని స్పష్టం చేయదలిచాను. అది ఏమిటంటే అహంభావం, డాంబికంగా వ్యవహరించడమూ – రెండూ ఒకటి కాదు.

**మొదటి విషయం :** మితిమీరిన గర్వం లేదా డాంబిక ప్రవృత్తి ఒక వ్యక్తి దేవుడిని విశ్వసించడానికి ఎలా అవరోధం కాగలదో నాకు అర్థం కావడం లేదు. అర్హత లేకపోయినప్పటికీ ఎంతో కొంత ప్రజాభిమానాన్ని చూరగొనగలిగి ఉంటే అప్పుడు నిజంగానే ఒక గొప్పతనాన్ని నేను గుర్తించడానికి నిరాకరించి ఉండవచ్చు. అలాంటిది కొంతవరకు నమ్మదగినదిగానే ఉంటుంది. కాని కేవలం వ్యక్తిగత అహంకారంతో దేవుడిని విశ్వసించకుండా ఎవరైనా ఎలా ఉండగలడు? తనే దేవుడికి పోటీదారుడననీ, లేదా తాను దేవుడినని విశ్వసించే వ్యక్తి నిజానికి ఎలా నాస్తికుడు కాగలడు? మొదటి సందర్భంలో తనకు పోటీగా ఒక దేవుడు ఉన్నాడన్న విషయాన్ని నిరాకరించడం జరగదు. ఇక రెండో సందర్భంలో ఈ ప్రకృతికి సంబంధించిన అన్ని వ్యవహారాలకు సారథ్యం వహించే ఒక అతీతశక్తి ఉన్నదా?

అలా అంగీకరించేవాడు నాస్తికుడు కాజాలాడు. సర్వాంతర్యామి అయిన దేవుడొకడున్నాడనే విషయాన్నే నేను నిరాకరించుతున్నాను. ఎందుకలా నిరాకరిస్తున్నానో తర్వాత వివరిస్తాను. ఇక్కడ ఒక విషయాన్ని మాత్రం స్పష్టం చేయదలిచాను. నాస్తికత్వాన్ని నేను అంగీకరించడానికి అహంకారం కాని, డాంబిక ప్రవృత్తిగాని ఉండడం కారణం కానేకాదు. అందువలన కొంతమంది మిత్రులు ఆలోచించుతున్నట్లు రెండు కేసుల్లో, ఢిల్లీ బాంబుకేసులో నా తల తిరిగి నేను అహంకారిని కాలేదు.

వాస్తవం చెప్పుకోవాలంటే నా నాస్తికత్వం ఇటీవలిది కాదు. నేను ఎవరికీ తెలియని అనామకుడైన ఒక యువకుడుగా ఉన్న రోజుల్లోనే దైవాన్ని విశ్వసించడం మానివేశాను. నా మిత్రులకు ఈ విషయం తెలియదు. ఒక కాలేజీ విద్యార్థిగా ఉన్న వాడు ఏదో గర్వంతోనో, అహంభావంతోనో, నాస్తికత్వాన్ని చేపట్టడన్న విషయాన్ని గ్రహించడం అవసరం. కొంతమంది ప్రొఫెసర్లకు అభిమానపాత్రుడైన విద్యార్థిగాను, మరి కొందరిచే నిరసించబడే విద్యార్థినైనప్పటికీ నేను బాగా కష్టపడి చదివి ప్రముఖ విద్యార్థిగా పేరు పొందిన వాడిని కాదు. కాబట్టి నాకు గర్వం ఉండటానికి, అహంభావిని కావటానికి అవకాశం లేదు. నేను కొంత వరకు సిగ్గుతో ఉండే స్వభావంకల యువకుడిని. భవిష్యత్ జీవితాన్ని గురించి నిరాశాజనకంగా ఉండే స్వభావం నాది. ఆ రోజుల్లో నేను ఖచ్చితమైన నాస్తికవాదిని కాదు. మా తాత పలుకుబడిలో సనాతన ఆర్యసమాజవాదిగా పెరిగిన వాడిని. సనాతన ఆర్యసమాజవాది ఏదైనా కావచ్చు గాని నాస్తికుడు మాత్రం కాదు. నా ప్రాథమిక విద్య ముగిసిన తరువాత లాహోరులోని డి.ఎ.వి. స్కూల్‌లో చేరాను. అక్కడ బోర్డింగ్ హౌస్‌లో ఒక సంవత్సర కాలం ఉన్నాను. అక్కడ ఉన్నప్పుడు ఉదయం, సాయంత్రం ప్రార్థనలు చేయడంతో పాటు 'గాయత్రి మంత్రాన్ని' గంటల తరబడి పఠించేవాడిని, ఆ రోజుల్లో నేను దైవభక్తుడుగా ఉండేవాడిని. ఆ తరువాత నేను నా తండ్రితో కలిసి ఉన్నాను. మా తండ్రిగారు సనాతనులకు సంబంధించి ఉదారవాదిగా ఉండేవారు. ఆయన బోధనల ఫలితంగానే నా జీవితాన్ని దేశ స్వాతంత్ర్య సాధనకు ఉపయోగించాలని నిర్ణయించుకున్నాను. కాని ఆయన నాస్తికుడు కాదు. దైవంలో పూర్తిగా విశ్వసమున్నవాడు. రోజూ ప్రార్థనలు చేయాలని ఆయన నన్ను ప్రోత్సహించుతూ ఉండేవారు.


ఈ విధంగానే నేను పెరిగాను. సహాయ నిరాకరణోద్యమ రోజుల్లో నేను నేషనల్ కాలేజీలో చేరాను. అక్కడ నేను ఉదారబుద్ధితో ఆలోచనలు జరుపుతూ అన్ని మతాలను, చివరకు దేవుడినీ విమర్శించుతూ ఉండేవాడిని. అయినప్పటికీ అప్పటి వరకూ నేను దైవభక్తుడనే. అప్పటి వరకూ గడ్డాన్ని, తలజుట్టునూ పెంచుతూనే ఉండేవాడిని. కాని సిక్కు మతం లేదా ఇతర మతాలు చెప్పే సూత్రాలను మాత్రం నేను నమ్మేవాడిని కాదు. కాని దేవుడున్నాడనే విషయంలో మాత్రం నాకు ధృఢ విశ్వాసం ఉండేది.

ఆ తరువాత నేను విప్లవ పార్టీలో చేరాను. నేను మొట్టమొదట కాంటాక్ట్‌లోకి వచ్చిన నాయకుడికి అంత నమ్మకం లేకపోయినా దేవుడున్నాడన్న విషయాన్ని నిరాకరించే ధైర్యం లేదు. దేవుడిని గురించి నేను అదే పనిగా ఆయనను ప్రశ్నించుతూ ఉంటే "నీకు అవసరమనుకున్నప్పుడల్లా దేవుడిని ప్రార్థించు" అని మాత్రం చెప్పేవాడు. నేను కాంటాక్ట్‌లోకి వచ్చిన రెండో నాయకుడు దేవుడి మీద గట్టి విశ్వాసం ఉన్న వ్యక్తి. ఆయన పేరు శచీంద్రనాథ్ సన్యాల్. అందరూ గౌరవించే కామ్రేడ్ ఆయన. ఆయనిప్పుడు కకోరి కుట్రకేసు సందర్భంగా ద్వీపాంతరవాస శిక్షను అనుభవించుతున్నారు. ఆయన 'బందీ జీవన్' అనే ప్రఖ్యాత గ్రంథాన్ని రచించారు. ఆ పుస్తకంలోని మొదటి పేజీ నుండి కూడా దేవుడిని అత్యంత గొప్పగా శ్లాఘించుతూ ఉండటం గమనించదగిన విషయం. నేనిక్కడ చెప్పదలచుకున్నదేమిటంటే విప్లవపార్టీలో దేవుడి మీద అవిశ్వాసమనే భావమే జనించలేదు.

ప్రఖ్యాతి గాంచిన కకోరి కుట్రకేసులోని నలుగురు కూడా దేవుణ్ని ప్రార్థించుతూనే ప్రాణాలను విడిచారు. రామ్‌ప్రసాద్ బిస్మిల్ సనాతన ఆర్యసమాజవాది. సోషలిజాన్ని గురించి, కమ్యూనిజాన్ని గురించి రాజెన్‌లహిరీ లోతుగా అధ్యయనం చేసినప్పటికీ ఉపనిషత్తులలోని మంత్రాలను, గీతను ఆలాపించాలనే ఆకాంక్షను ఆయన తగ్గించుకోలేక పోయారు. ఈ విప్లవకారుల్లో ఎన్నడూ ప్రార్థన చేయని వారిని ఒక్కరినే నేను చూడగలిగాను. "మానవుని బలహీనత ఫలితమే వేదాంతం" అని ఆయన అనేవారు. మన విజ్ఞానానికి పరిమితి ఉండటం వల్లనే వేదాంతాన్ని నమ్ముతున్నామని కూడా ఆయన అనేవారు. ఆయన కూడా యావజ్జీవ ద్వీపాంతరవాస శిక్షను అనుభవించారు. కాని ఆయన కూడా దేవుడు లేడని చెప్పడానికి ఎన్నడూ సాహసించేవారు కాదు.

ఆ దశ వరకూ నేను ఒక స్వాప్నిక ఆదర్శ విప్లవవాదిగా మాత్రమే ఉండేవాడిని. అప్పటి

"ప్రతికూలురు తెచ్చే వాదనలను ఎదుర్కొనాలంటే అధ్యయనం ఒక్కటే మార్గమనిపించింది. సిద్ధాంతం సరియైనదని నిరూపించుకోవాలంటే అధ్యయనం ఒక్కటే మార్గమనిపించింది. సిద్ధాంతం సరియైనదని నిరూపించుకోవాలంటే అధ్యయనం చేసి వాదనలకు అవసరమైన పరిపుష్టిని చేజిక్కించుకోవడం అవసరం."



కారల్ మార్క్స్

వరకూ నాయకులను అనుసరించడమే మా పని. ఇంక ఆ తరువాత మొత్తం బాధ్యతలను నెత్తిమీద వేసుకొనే సమయమాసన్నమైనది. అనివార్య కారణాల వలన అసలు పార్టీ ఉనికే అసాధ్యమన్న పరిస్థితి ఏర్పడింది. ఉత్సాహవంతమైన కామ్రేడ్స్ మమ్ములను ఎగతాళి పట్టించడం ప్రారంభించారు. కొంత కాలానికి నేను కూడా భయపడ్డాను. మా కార్యక్రమం ఏ విధంగానూ ఫలించబోదనే అనుమానం ఏర్పడింది. అప్పుడే నా విప్లవ జీవితంలో ఒక మూలమలుపు ఏర్పడింది. "అధ్యయనం" అవసరమన్న ఆవేశం నా మనస్సులో ప్రతిధ్వనించడం ఆరంభించింది. ప్రతికూలురు తెచ్చే వాదనలను ఎదుర్కొనాలంటే అధ్యయనం ఒక్కటే మార్గమనిపించింది. సిద్ధాంతం సరియైనదని నిరూపించుకోవాలంటే అధ్యయనం ఒక్కటే మార్గమనిపించింది. సిద్ధాంతం సరియైనదని నిరూపించుకోవాలంటే అధ్యయనం చేసి వాదనలకు అవసరమైన పరిపుష్టిని చేజిక్కించుకోవడం అవసరం. అందుకని గ్రంథాలను అధ్యయనం చేయడం ఆరంభించాను. దీనితో అంతకు ముందు నాలో ఉన్న విశ్వాసాల్లో తీవ్రమైన మార్పులు వచ్చాయి. మా ముందు తరం విప్లవకారుల కార్యక్రమంలో హింసాపూరితమైన పద్ధతులకే ప్రాధాన్యత ఉండేది. ఇప్పుడు ఆ స్థానంలో కొన్ని తీవ్రమైన భావాలకు స్థానం ఏర్పడింది. అద్భుతాలను విశ్వసించడం గాని, గుడ్డిగా నమ్మడంగాని వదిలివేశాం. వాటి స్థానంలో వాస్తవికత చోటు చేసుకున్నది. తప్పనిసరి పరిస్థితుల్లోనే హింసా చర్యలను చేపట్టడం అవసరమనుకున్నాం. ప్రజా ఉద్యమాలన్నిటికీ అహింసా పద్ధతులే తప్పనిసరి అని భావించడం మొదలైంది. పద్ధతులకు సంబంధించి ఆ నిర్ణయం జరిగింది. అన్నింటి కంటే ముఖ్యమైన దేమంటే మనం ఏ లక్ష్యం కోసం పోరాడుతున్నామనే విషయంలో స్పష్టత ఏర్పడింది. కార్యాచరణకు సంబంధించి నిర్వహించవలసిన ముఖ్య కార్యకలాపాలు లేనందు వలన, ప్రపంచ విప్లవానికి సంబంధించి నిర్వహించవలసిన ముఖ్య కార్యకలాపాలు లేనందు వలన, ప్రపంచ విప్లవానికి సంబంధించి వివిధ రకాల భావాలను గురించి అధ్యయనం చేయటానికి బాగా అవకాశం దొరికింది. ఆరాచకవాద నాయకుడైన బకునిన్‌ను నేను అధ్యయనం చేశాను. కమ్యూనిజానికి మూల పురుషుడైన మార్క్స్‌ను గురించి కొంత చదివాను. తమ దేశంలో విప్లవాన్ని జయప్రదంగా నిర్వహించిన అనుభవం గల లెనిన్, ట్రాట్స్కీ తదితరుల రచనలను గురించి హెచ్చుగా అధ్యయనం చేశాను. వారంతా నాస్తికులే. 'దేవుడు - రాజ్యం' అన్న బకునిన్ రచన పైపైనే ఉన్నప్పటికీ చదవడానికి ఎంతో ఆసక్తిదాయకమైన విధంగా తోచింది. ఆ తరువాత నిర్మలానంద స్వామి రచించిన 'ఇంగిత జ్ఞానం' అన్న గ్రంథం చదవడం సంభవించింది. అది ఒక రకమైన కాల్పనిక నాస్తికత్వాన్ని గురించిన రచన. నాస్తికత్వం నాకు అత్యంత ఆసక్తిదాయకంగా పరిణమించింది. 1926 సంవత్సరం ముగిసేటప్పటికీ ఈ జగత్తును సృష్టించి నడుపుతున్న సర్వాంతర్యామి ఒకడున్నాడన్న విషయానికి ప్రాతిపదికలేదని నేను విశ్వసించడం ఆరంభించాను. ఈ విషయాన్ని గురించి నా మిత్రులతో చర్చించడం మొదలుపెట్టాను. దానితో నేనే ఖచ్చితమైన నాస్తికుడనయ్యాను. అయితే అదంటే ఏమిటో ఇప్పుడు చర్చించుకుందాం. 1927 మేలో నేను లాహోర్‌లో అరెస్టు

> **“ మామూలుగా అయితే విజయ మో, వీర స్వర్గమో అన్న ఆశతో యుద్ధంలో వీరులు తమ ప్రాణాలనర్పించడానికి సిద్ధపడ తారు. కాని అలాంటిదేమీ లేకుండా మానవాళికి సేవ చేయడా నికి, పీడితులకు విముక్తిని సాధించడానికి నిస్వార్థంగా, అధికారి కంగా స్త్రీ పురుషులు ముందుకొచ్చినపుడు విముక్తి యుగానికి నాందీ ప్రస్తావన జరుగుతుంది. ”**

అయ్యాను. ఆ అరెస్టు ఏమాత్రం ఊహించని అకస్మిక సంఘటన. పోలీసులు నన్ను వేటాడుతున్నారన్న విషయమే నాకు ఎరుక లేదు. నేనొక తోటలో నుండి వెళుతుండగా అకస్మాత్తుగా పోలీసులు నన్ను చుట్టుముట్టారు. ఆ సమయంలో నేను ఏ మాత్రం ఉద్రేకపడకుండా ప్రశాంతంగానే ఉండగలగడం నాకే ఆశ్చర్యాన్ని కలిగించింది. నన్ను పోలీసు కస్టడీలో ఉంచారు. మరునాడు రైల్వే పోలీసు లాకప్‌కు తీసుకుని వెళ్లి పూర్తిగా నన్ను ఒక నెల రోజుల పాటు అక్కడ బంధించారు. కొన్ని రోజుల పాటు పోలీసు ఆఫీసర్లతో సంభాషణలు జరిపిన ఫలితంగా కకోరి పార్టీతోనూ, విప్లవోద్యమానికి సంబంధించిన కొన్ని కార్యకలాపాలతోనూ నాకేదో సంబంధం ఉన్నట్లు వాళ్లకు సమాచారం అందినట్లు నేను ఊహించాను. కకోరి కుట్ర కేసు విచారణ జరుగుతున్న సమయంలో నేను లక్నో వెళ్లానని, వారిని తప్పించడానికి ఏదో పథకాన్ని గురించి మేము ఆలోచించామని, దానికి వారి ఆమోదాన్ని పొందిన తరువాత మేము కొన్ని బాంబులను సేకరించామని, వాటిని పరీక్షించేందుకు 1926 దసరా పండుగ నాడు ఒక గుంపు మీద ఒక బాంబు విసిరామని వారు నాతో చెప్పారు. విప్లవ పార్టీ కార్యకలాపాలను గురించి మరికొంత సమాచారాన్ని తెలుపుతూ నేను ఒక ప్రకటన చేసే పక్షంలో నన్ను జైలులో ఉంచబోమని, ఇదంతా నామేలు కోసమే చెబుతున్నామని వారు చెప్పారు. వారి ప్రతిపాదన విని నేను ఫక్కున నవ్వాను. అదంతా అబద్ధమన్నాను. కొన్ని ఉన్నత భావాలు కలిగిన నాలాంటి వాళ్లు అమాయకులైన ప్రజలపైన బాంబులు వేయరు. ఒకరోజు ఉదయం పూట అప్పటి సి.ఐ.డి సీనియర్ సూపరింటెండెంట్ నా వద్దకు వచ్చాడు. చాలా సేపు నాతో ఎంతో అభిమానపూర్వకంగా మాట్లాడిన తరువాత తాము కోరినట్లుగా స్టేట్‌మెంట్ ఇవ్వని పక్షంలో చక్రవర్తిపై యుద్ధం చేయడానికి కుట్ర పన్నిన కకోరి కేసులో నన్ను కూడా ఒక ముద్దాయిగా చేరుస్తామనీ, దసరా సందర్భంగా బాంబులు వేసి క్రూరంగా హత్యలకు తలపడినట్లు ఆరోపించుతూ కేసు పెడతామని ఆయన తెలిపారు. ఇలా తెలుపుతున్నందున తాను ఎంతో విచారపడుతున్నట్లు నటించాడు. ఈ సందర్భంగా నాపై తగినంత సాక్ష్యం తన వద్ద గలదనీ, దానితో ఉరిశిక్షపడేటట్లు చేయగలనని కూడా ఆయన నన్ను బెదిరించాడు. ఈ విషయంలో నాకు అంతగా తెలియనప్పటికీ పోలీసులు కావాలనుకుంటే అంతపనీ చేయగలరని నేను విశ్వసించాను. నేను ఎలాగూ ఉరిశిక్షకు ఆహుతి కాక తప్పదు కాబట్టి ప్రతిరోజు రెండుసార్లు ప్రార్థనలు జరుపుకోవలసిందని పోలీసు ఆఫీసర్లు నాకు సలహా ఇచ్చారు. అప్పటికే నేను నాస్తికుడను. శాంతిగాను, సరదాగాను ఉన్నప్పుడు నేను నాస్తికుడనని గర్వంగా చెప్పుకోవచ్చు. కాని కష్ట సమయంలో కూడా ఆ సూత్రానికి కట్టుబడి ఉండగలనా అనేదే కీలక సమస్య. ఈ సమస్యను గురించి బాగా ఆలోచించుకున్న తరువాత దేవుడిని ప్రార్థించరాదనే నిర్ణయానికి వచ్చాను. అది నిజానికి పరీక్షా సమయం. ఆ పరీక్షలో నేను దృఢంగా నిలవగలిగాను. ఇతర కారణాలతో నేను ఉరి నుండి తప్పించుకోవాలనే ఆలోచన నాలో ఏ మాత్రం రాలేదు. ఆ విధంగా నేను ఖచ్చితంగా దేవుడిపై నమ్మకం లేనివాడిని. అప్పటి నుండి అలాగే కొనసాగాను. ఆ పరీక్షలో నిలబడి నెగ్గడం అంత సులభమైన విషయమేమీ కాదు. దేవుడి మీద “నమ్మకం” అనేది కష్టాలను కొంతవరకు మరిచిపోయేలా చేయగలదు. ఒక విధంగా సంతోషాన్ని కూడా కలుగజేయగలదు. దేవునిపై గల నమ్మకంతో మానవుడు ఎంతో ఓదార్పును, ఆత్మస్థైర్యాన్ని పొందగలడు.

దేవుడు కనుక లేకపోతే మానవుడు కేవలం తనపైననే ఆధారపడవలసి వస్తుంది. విపరీతమైన కష్టాల మధ్య, పెను తుపాన్ల మధ్య ఎవరి కాళ్ళపై వాళ్లు నిలబడగలగడం ఏ మాత్రం చిన్న విషయం కాదు. అలాంటి సమయంలో అహంకారం అంటూ ఏమైనా ఉంటే అది ఎగిరిపోతుంది. అందరూ నమ్మేదానిని కాదనడానికి ఎవ్వరూ సాహిసించలేరు. అలా కాదనగలిగితే అహంకారానికి మించి మరో శక్తి అతనిలో ఉన్నదనే అభిప్రాయానికి రావలసి వస్తుంది. ఇదీ అనాటి పరిస్థితి. నా కేసుపై తీర్పు ఇప్పటికే అందరికీ తెలిసిన విషయమే. అది మరో వారం లోపల ప్రకటించబడుతుంది. ఒక ఆశయం కోసం నా జీవితాన్ని త్యాగం చేయబోతున్నాననే సంతృప్తి మినహా మరొకటేమి ఉంటుంది? దేవుడి మీద నమ్మకం ఉన్న హిందువైతే వచ్చే జన్మలో ఒక రాజుగా పునర్జన్మ ఉంటుందని ఆశించుతాడు. ముస్లిం లేదా క్రైస్తవుడైతే ఇలా త్యాగం చేసినందుకు స్వర్గంలో భోగభాగ్యాలను అనుభవించవచ్చునని ఆశించ వచ్చు. కాని నాకు ఏమి ఆశ ఉంది? నాకు తెలుసు. నా మెడకు ఉరిత్రాడు బిగించడంతో అదే నా జీవితంలో ఆఖరి క్షణం కాగలదని. ఇంకా ఆ తర్వాత ఏమీ ఉండదు. ఒక లక్ష్యం కోసం పోరాడిన వ్యక్తి జీవితం ఆ విధంగా ముగించడం మినహా మరేమీ లేదు. ఎలాంటి స్వార్థం లేకుండా లేదా ఎలాంటి పారితోషికం ఇప్పుడు గాని, ఆ తరువాత గాని పొందకుండా నా జీవితాన్ని దేశస్వాతంత్ర్య సాధన కోసం వినియోగించాననే సంతృప్తి, ఆనందం మాత్రమే మిగులుతుంది. మామూలుగా అయితే విజయ మో, వీర స్వర్గమో అన్న ఆశతో యుద్ధంలో వీరులు తమ ప్రాణాల నర్పించడానికి సిద్ధపడతారు. కాని అలాంటిదేమీ లేకుండా మానవాళికి సేవ చేయడానికి, పీడితులకు విముక్తిని సాధించడానికి నిస్వార్థంగా, అధికారికంగా స్త్రీ పురుషులు ముందుకొచ్చినపుడు విముక్తి యుగానికి నాందీ ప్రస్తావన జరుగుతుంది.

ఇక్కడ రాజు కావడమో లేదా ఇతరంగా లాభపడడమో లేదు. మరణించిన అనంతరం ఉంటుందనుకునే స్వరంలోకి వెడతామనే ఆశలేకుండా కేవలం దోపిడీదార్లను, పీడకులను, నిరంకుశులను సవాలు చేసి, మానవ జాతిని బానిసత్వాన్నుండి విముక్తి చేసి, మానవులకు స్వాతంత్ర్యాన్ని, శాంతిని ప్రసాదించే లక్ష్యం కోసం ప్రాణాలర్పించడంలో అహంకారం ఏముంటుంది? అహంకారంతో దేవుడిపై అవిశ్వాసాన్ని నేను ప్రకటించాననే అపవాదు వేయడానికి ఎవరికి సాహసం ఉంటుంది? అలాంటి వారు తెలివితక్కువ వారో, దుర్బుద్ధి గలవారో అయివుంటారు. అలాంటి వారిని క్షమించుదాం. ఆ తరువాత అయినా అలాంటి మహోన్నతమైన త్యాగానికి ప్రేరేపించడానికి ఏ మహోన్నత లక్ష్యాలు కారణమైనాయో వారు గుర్తించగలరు. ఎవరి కాళ్ళపై వాళ్లు నిలవటాన్ని

అహంకారంగా పరిగణించడం అత్యంత శోచనీయమైన విషయం

ఆనాడు ప్రజల్లో బలంగా ఉన్న విశ్వాసాలను మీరు వ్యతిరేకించితే, అందరిచే విమర్శకు అతీతుడనుకున్న ఒక గొప్ప వ్యక్తిని లేదా ఒక వీరుడిని మీరు విమర్శించితే అందుకోసం మీరు చేసే వాదనలన్నీ అహంకారయుతమైనవని జనం మిమ్ములను తెగనాడటం కద్దు. ఇందుకు కారణం మానసికంగా స్తబ్ధత ఏర్పడడమే. విమర్శ, స్వతంత్ర ఆలోచన, ఇవి రెండూ ఏ విప్లవకారునికైనా తప్పనిసరిగా ఉండవలసిన మంచి లక్షణాలు. మహాత్మాజీ గొప్పవాడు కాబట్టి ఆయనను ఎవ్వరూ విమర్శించలేదు. ఆయన చాలా పెద్దవాడైనాడు గాబట్టి రాజకీయాల్లో, మత వ్యవహారాల్లో, ఆర్థిక రంగంలో లేదా నైతిక సూత్రాల విషయంలో ఆయన ఏమి చెప్పినా సరియైనదే. ఆయన చెప్పే తీరాలి. ఈ రకమైన మనస్తత్వం ప్రగతి వైపుకు దారి తీయదు. పైపెచ్చు అది అభివృద్ధి నిరోధకమైనది కాగలదు.

మన తాత ముత్తాతలు సర్వశక్తివంతుడైన దేవుడిపై నమ్మకం కలిగిన వారు కాబట్టి ఆ విశ్వాసాన్ని ఎవరైనా సవాల్ చేయడానికి సాహసించితే అతణ్ణి విద్రోహి కింద నిందించుతారు. అతని వాదనలు సహేతుకంగా ఉండి, నిరాకరించడానికి వీలులేనివైతే అతణ్ణి అహంకారి అని ప్రకటిస్తారు. అలాంటి వారితో వాదించి ఫలితం ఉండదు. ఈ సమస్య ప్రజల ముందు బహిరంగ చర్చకు మొదటిసారిగా వస్తుంది. కాబట్టి దీనిని గురించి మొత్తంగానే వాదించుతాను.

**మొట్టమొదటి సమస్య :** నేను నాస్తికుడను కావడానికి దారి తీసింది అహంభావం కాదనేది ఇప్పటికే నేను స్పష్టం చేయగలిగానని భావించుతున్నాను. నేను వాదన చేసిన తీరు నచ్చిందీ లేనిదీ తీర్పు చెప్పవలసింది నేను కాదు పాఠకులే. ప్రస్తుత పరిస్థితుల్లో దేవుడిపై నమ్మకం ఉంటే నా జీవితం మరింత సులభతరమై ఉండేది. నా భారం కూడా తగ్గేది. కాని దేవుడిపై నాకు నమ్మకం లేకపోవడం వలన పరిస్థితి నాకు కష్టతరంగా పరిణమించింది. దైవత్వంపైనా, పరలోకంలోని సుఖభోగాలపైనా నమ్మకం ఉండివుంటే మరణం ఆనందకరంగానే ఉండేది. కాని ఆ మైకంలో నేను ఉండదలచలేదు. నేను వాస్తవికవాదిని. హేతువాదం సహాయం పైననే నేను నిలబడదలిచాను. ఈ లక్ష్యసాధనలో నేనెప్పుడూ జయప్రదం కాలేను. కాని అందుకోసం ప్రయత్నించడం మానవ ధర్మం. విజయం పరిస్థితులపై ఆధారపడి ఉంటుంది.

ఇంక రెండో ప్రశ్న ఉదయించుతుంది. ఇది అహంభావం వలన కాకపోతే ప్రాచీన కాలం నుండి వస్తూ నేటికీ ప్రబలంగా ఉన్న దేవునిపై విశ్వాసం లేకపోవడానికి మరొక కారణం ఉండి తీరాలి. దాని విషయానికే ఇప్పుడు వస్తున్నాను. అందుకు మరో కారణం లేకపోలేదు. నా ఉద్దేశ్యంలో ఏ వ్యక్తికైనా ఏమాత్రం వాదనాశక్తి ఉన్నా తాను ఉన్న పరిస్థితుల్లో ఏది ఏమిటన్న విషయాన్ని గురించి తర్కించుతాడు. ఎప్పుడైతే సరియైన, ప్రత్యక్షమైన ఆధారాలు దొరకవో అప్పుడు విశ్వాసమనేది ప్రధాన స్థానమాక్రమించుతుంది. ఇంతకు ముందు నేను చెప్పినట్లు మానవుని బలహీనత ఫలితమే మత విశ్వాసమని ఒక విప్లవమిత్రుడు నాతో అంటూ ఉండేవాడు. మన పూర్వీకులకు ఈ ప్రపంచ రహస్యాన్ని, దాని గతం, వర్తమానం, భవిష్యత్తును గురించి పరిశోధించి తెలుసుకోవడానికి తగినంత సమయం ఉండేది. ఈ ప్రపంచం ఎక్కడ నుండి పుట్టింది? ఎప్పుడు ఉనికిలోకి వచ్చింది? మొదలైన విషయాలను ఆలోచించినప్పుడు వారి వద్ద సూటిగా ఆధారాలు కొరవడేవి. ప్రతి ఒక్కరూ తమకిష్టం వచ్చిన రీతిలో సమస్యను పరిష్కరించడానికి ప్రయత్నించేవారు. అందువల్లనే వివిధ మతాలు సిద్ధాంతాల మధ్య విపరీతమైన భేదాలు మనకు కనిపించుతాయి. ఆ సిద్ధాంతాలు ఒక్కోసారి పరస్పర విరుద్ధంగా ఉండి ఘర్షణకు సిద్ధపడే ధోరణిలో ఉంటాయి.

**"అభ్యుదయం కోసం నిలబడే ప్రతి వ్యక్తీ పాత విశ్వాసాలలోని ప్రతి ఒక్క అంశాన్ని మూఢంగా నమ్మకుండా ఒక దాని తరువాత మరొక దానిని సవాలు చేయాలి. దానిపై వాదోపవాదాలకు సిద్ధపడాలి. వాదనల అనంతరం ఆ సిద్ధాంతాన్ని గాని, ఆ మత విశ్వాసాన్ని గాని అంగీకరించితే మనం ఆహ్వానించవలసిందే."**



చెంఘిజ్ ఖాన్

ప్రాక్ పశ్చిమ వేదాంతాలు విభిన్నమైనవి. తిరిగి ప్రాచ్య దేశాల్లోని మతాల్లోనే ముస్లిం మతం హిందూ మతానికి పూర్తిగా విరుద్ధంగా ఉంటుంది. భారతదేశంలోనే బౌద్ధమతమూ, జైనమతమూ, బ్రాహ్మణత్వానికి భిన్నంగా ఉంటాయి. మళ్ళీ పరస్పర విరుద్ధమైన ఆర్య సమాజం, సనాతన ధర్మమూ వేరుగా ఉంటాయి. చార్వాకుడు గత యుగాలకు సంబంధించిన మరో స్వతంత్ర ఆలోచనాపరుడు. గత యుగంలోనే ఆయన దేవుడి అస్తిత్వాన్ని సవాలు చేశారు. మౌలిక సమస్యలపైన ఈ మతాలన్నీ ఒక దానితో మరొకటి విభేదించుతాయి. అజ్ఞానాన్ని అధిగమించి ఈ నిగూఢమైన సమస్యకు పరిష్కారాన్ని కనుగొనడానికి బదులుగా వాటినే గుడ్డిగా విశ్వసించుతూ మానవ ప్రగతికి అడ్డుపడుతుంటారు.

అభ్యుదయం కోసం నిలబడే ప్రతి వ్యక్తీ పాత విశ్వాసాలలోని ప్రతి ఒక్క అంశాన్ని మూఢంగా నమ్మకుండా ఒక దాని తరువాత మరొక దానిని సవాలు చేయాలి. దానిపై వాదోపవాదాలకు సిద్ధపడాలి. వాదనల అనంతరం ఆ సిద్ధాంతాన్ని గాని, ఆ మత విశ్వాసాన్ని గాని అంగీకరించితే మనం ఆహ్వానించవలసిందే. ఆ వ్యక్తి వాదన పొరపాటు కావచ్చు. కొన్ని సందర్భాల్లో తప్పుకావచ్చు. కాని ఆ తరువాత సరిదిద్దుకోవచ్చు. ఎందువల్లనంటే ఆ వ్యక్తి జీవితంలో హేతువాదం మార్గదర్శకం కావాలి. కాని కేవలం విశ్వసించడం, గుడ్డిగా నమ్మడం ప్రమాదకరం. అది మేధస్సును పనిచేయకుండా చేస్తుంది. వ్యక్తిని అభివృద్ధి నిరోధకంగా మార్చివేస్తుంది. వాస్తవికవాదినని చెప్పుకునే ప్రతి వ్యక్తీ పాత విశ్వాసాలను సవాలు చేయాలి. అవి వాదనకు నిలబడలేకపోతే సహజంగానే కుప్పకూలిపోతాయి. అప్పుడు పాత విశ్వాసాలను త్రోసిపుచ్చి నూతన తత్వశాస్త్రం కోసం అన్వేషించాలి. ఇందుకోసం పాత విశ్వాసాలను సంబంధించి

**"ఎల్లప్పుడూ మాన వులకు ఆవేదనలనూ, అశాంతినీ కలుగజేసే విధంగా ఈ ప్రపంచాన్ని ఎందుకు సృష్టించాలి? దేవుడు సర్వశక్తి సమన్వితుడు కదా? ఏదైనా సరే చేయటానికి లేదా చేయకుండా ఉండటానికి ఆయనకు శక్తివుంది కదా? అటువంటప్పుడు ఇన్ని దుఃఖాలు, బాధలుపడే మానవుల్ని ఆయన ఎందుకు సృష్టించాలి? ఆయన చేసిన పనిని మనం ఎలా సమర్థించగలం?"**

నంత వరకూ ఈ అంశంపై నేను పెద్దగా అధ్యయనం చేయలేదని ఒప్పుకొంటాను.

ప్రాచ్యదేశాలకు సంబంధించిన మతాలను గురించి అధ్యయనం చేయాలని నాకు ఎంతో ఆసక్తి ఉంది. కాని అందుకు నాకు అవకాశం లభించలేదు. కాని ఈ ప్రకృతి నంతటినీ శాసించే ఒక అతీతశక్తి లేదనే విషయంలో మాత్రం నేను గట్టిగానే ఉన్నాను. మేము ప్రకృతిని విశ్వసించుతాం. ప్రకృతిని తన కోసం ఉపయోగించుకోవడానికి దానిపై అధిపత్యాన్ని సాధించడానికి మానవుడు ఎల్లప్పుడూ ప్రయత్నించాలి. మొత్తం ఉద్యమం ఇందుకే కృషి చేస్తుంది.

ఇంక అతీతశక్తిపై నమ్మకం ఉండేవారిని కొన్ని ప్రశ్నలు అడుగుదాం.

ఈ భూమిని, ఈ ప్రపంచాన్ని సృష్టించిన ఒక సర్వశక్తివంతుడు, సర్వాంతర్యామి, భగవంతుడు ఉన్నాడని మీరు నమ్ముతున్నారు. అలా అయితే దానిని ఆయన ఎందుకు సృష్టించాడో చెప్పగలరా? ఈ ప్రపంచంలో ప్రజలు పేదరికంతో, రకరకాల కష్టాలతో, బాధలతో అనేక అత్యాచారాలకు గురవుతూ జీవించుతున్నారు. ఎవ్వరూ తృప్తిగా జీవించడం లేదు.

దయచేసి ఆయనకున్న శాసనాలకు లోబడి చేస్తున్నాడని అనబోకండి. ఆయనే గనుక కొన్ని శాసనాలకు కట్టుబడి ఉండవలసినవాడైతే ఆయన కూడా ఒదిగి ఒదిగి ఉండవలసిన బానిస మాత్రమే కాగలడు. ఇలా జనాన్ని బాధపెట్టడం ఆయనకు సరదా అని అనబోకండి.

నీరో చక్రవర్తి రోమ్ నగరాన్ని తగుల బెట్టించాడు. నీరో పరిమిత సంఖ్యలోనే ప్రజలను హతమార్చాడు. అనేక విషాదాలను తన చిద్విలాసం కోసమే ఆయన జరిపించాడు. మరి అలాంటి నీరో చక్రవర్తి స్థానం చరిత్రలో ఏమిటి? చరిత్రకారులు ఆయనను ఏ పేరుతో పిలుస్తారు? నీరో చక్రవర్తిని ఎన్ని రకాల విషభరితమైన, అపభ్రంశమైన పేర్లను పెట్టి పిలవాలో అన్నీ పెట్టి మరీ పిలుస్తారు. నీరో చక్రవర్తి పరమ నిరంకుశుడు, కఠిన హృదయుడు పరమ క్రూరుడు అని చరిత్ర పుటలన్నింటా వర్ణించబడ్డాడు.

ఇక చెంఘిజ్ ఖాన్ తన క్రూరమైన సంతోషం కోసం వేలమందిని హతమార్చాడు. చెంఘిజ్ ఖాన్ పేరు చెబితేనే మనకు వళ్ళు మండుతుంది. అత్యంత ద్వేషం, అసహ్యం కలుగుతుంది. అలాంటప్పుడు ప్రపంచంలోని అశేష ప్రజల జీవితాలను దుఃఖభాజనం చేసే దేవుణ్ణి, ప్రతి రోజూ, ప్రతి గంట, ప్రతి నిమిషం కష్టాలతో, విషాదాలతో వారి జీవితాలను అధోగతి పాల్జేసే దేవుణ్ని, ఈనాటికి వారిని కష్ట సముద్రాల్లో నిత్యమూ ముంచుతున్న దేవుణ్ని మనం ఏమనాలి? చెంఘిజ్‌ఖాన్, నీరోచక్రవర్తి ఎప్పుడో ఒకసారి చేసిన దానికంటే దేవుడు ఈ ప్రపంచంలోని ప్రజలను నిత్యమూ కష్టాలకు, బాధలకు, అత్యాచారాలకు గురి చేస్తున్నప్పుడు ఆయనను ఎలా పూజించాలి? ఎలా కొలవాలి?

మీకు నా సూటి ప్రశ్న ఇది. ఇంచుమించు నరకప్రాయంగా ఉన్న ఈ ప్రపంచాన్ని ఆయన ఇలా ఎందుకు సృషించాలి? ఎల్లప్పుడూ మానవులకు ఆవేదనలనూ, అశాంతినీ కలుగజేసే విధంగా ఈ ప్రపంచాన్ని ఎందుకు సృష్టించాలి? దేవుడు సర్వశక్తి సమన్వితుడు కదా? ఏదైనా సరే చేయటానికి లేదా చేయకుండా ఉండటానికి ఆయనకు శక్తివుంది కదా? అటువంటప్పుడు ఇన్ని దుఃఖాలు, బాధలుపడే మానవుల్ని ఆయన ఎందుకు సృష్టించాలి? ఆయన చేసిన పనిని మనం ఎలా సమర్థించగలం?

పూర్వం ఒక రకం మృత్యు క్రీడలు జరిపి ఆనందించేవారు ఉండేవారట. (గ్లాడియేటరు సంస్థ నిర్వాహకులు వారు) ఆకలితో ఆరాటపడే సింహాలు, పులుల ముందు మనుషులను నెట్టేవారు. ఆ సింహాలకు, పులులకు ఆహారమై పోకుండా ఎవరైనా ఒక అభాగ్యుడు బయటపడితే వాడికి పంచభక్ష్య పరమాన్నాలు పెడతాం, సర్వసౌఖ్యాలు, సంపదలు ఇచ్చి సత్కరిస్తాం అనే వారట. సరిగ్గా అలాగే ఉంది దేవుడి సంగతి. సర్వజ్ఞుడు, సర్వశక్తివంతుడు, సర్వచైతన్యమూర్తి అయిన భగవంతుడు ఈ దుఃఖమయ ప్రపంచాన్ని, అందులో అష్టకష్టాలు పడే మానవుణ్ని ఎందుకు సృష్టించాలి అని నేను అడుగుతున్నాను.

హిందూ వేదాంతం మరో వాదన కూడా తీసుకురావడానికి పెనుగులాడుతుంది. కానీ మహమ్మదీయులూ, క్రైస్తవ మతావలంబులారా పై ప్రశ్నలకు మీరిచ్చే సమాధానమేమిటి? హిందువుల్లా మీరు పునర్జన్మను అంగీకరించరు. అలాంటి పునర్జన్మ సిద్ధాంతాన్ని మీరు విశ్వసించరు. పూర్వజన్మలో చేసిన పాపాల ఫలితాన్ని, దుష్కృత్యాల ఫలితాలను మానవులు ఈ జన్మలో అనుభవిస్తారని మీరు హిందువులవలె వాదించరు. అయితే మీరు చెప్పేదేమిటి? మీ విశ్వాసాలు ఏమిటి? ఈ ప్రపంచాన్ని సృష్టించడానికి భగవంతుడు వారంలో ఆరు రోజులు పని చేస్తూ ఉంటాడట. సృష్టి ఆరు రోజులు చేసేవాడు ఏడో రోజున తను సృష్టించిన ప్రపంచంలో లోటుపాట్లను ఎందుకు తెలుసుకోడు? అనుభవాన్నుండి ఎందుకు నేర్చుకోడు? అలాకాక సృష్టి చేసిన ప్రతి రోజూ ఆఖరున 'అంతా సవ్యంగా ఉంది. అంతా సక్రమంగానే జరిగింది'. అని ఎలా అనుకుంటాడు?

చెరసాలలో మగ్గేవాళ్లు, ఆకలిమంటలతో అలమటించేవాళ్లు లక్షలాది కోట్లాది ప్రజలు ఈ ప్రపంచంలో ఉన్నారు. దోపిడీ చేయబడుతున్న కష్టజీవులు, కార్మికులు, అభాగ్యులు, దీనులు, హీనులూ ఉన్నారు. వీరంతా తమ రక్తాన్ని స్వేదంగా మారుస్తున్నారు. ఈ రక్తాన్ని పిండి పెట్టుబడిదారీ వర్గాలు రాబందులవలె, జలగలవలె వీరిని పీలుస్తూ సంపన్నులవుతున్నారు. లక్షలాది మందిని నిరుద్యోగులుగా, నిరర్థకులుగా చేస్తున్నారు. అంతేకాదు, అవసరమైతే తమ లాభాల రక్షణ కోసం, అధికోత్పత్తి చేసి నిల్వపడి ఉన్న సరుకులను, ఆహార ధాన్యాలను సముద్రం పాలు చేస్తున్నారు. (పెట్టుబడిదారీ విధానంలో సంక్షోభం ఏర్పడినప్పుడు, ధరల మాంద్యం వచ్చినప్పుడు లక్షల కోట్ల టన్నుల పాల డబ్బాలను ఇతర ఆహార పదార్థాలను పెట్టుబడిదారీ వర్గాలు సముద్రం పాలు చేస్తాయి. అనువాదకుడు) ఆకలితో మలమల మాడే కోటాను కోట్ల ప్రజలకు ఈ ఆహార ధాన్యాలను పాలడబ్బాలను, బట్టలను తదితర జీవితావసర వస్తువులను పంచిపెట్టరు. తమ చెమటను, రక్తాన్ని ధారపోసి శ్రామిక ప్రజలు పంటలు పండిస్తారు. తమ ఎముకలను సున్నంగా చేసి మహా భవనాలను కార్మికులు నిర్మిస్తారు.

వారందరూ దారిద్ర్యంతో కడుపునిండా తిండిలేక, బట్టలేక, ఇల్లులేక ఎందుకు అలమటించాలి? దీనికి భగవంతుడు ఏమి సమాధానం

చెపుతాడు? ఇలా ఎందుకు జరుగుతున్నది? ఇలా ఒకవైపున జరుగుతూ ఉంటే నా సృష్టి అంతా సవ్యంగానే ఉన్నదని భగవంతుడు ఎలా అనగలడు? దీనికి ఆయన ఏమైనా సమాధానం చెప్పగలడా? మౌనమే సమాధానమా?


ఇంక పూర్వజన్మల, పాపపుణ్యాల సిద్ధాంతాలు ఎంతవరకు నిజమో కొంచెం పరిశీలించుకుందాం. నేరస్తుణ్ణి సంస్కరించి సన్మార్గంలోకి, సమాజంలోకి తీసుకుని వచ్చేటట్లు శిక్షలుండాలనేది సర్వత్రా అంగీకరిస్తున్న విషయం. మానవ పురోభివృద్ధికి ఈ సృష్టి అవసరం. కాని తప్పు చేసిన వాళ్లను దేవుడు ఎలా శిక్షించాలి? ఎలా శిక్షించుతున్నట్లు నేడు చెపుతున్నారు? పాపం చేసిన వారిని కుక్కగానో, పిల్లిగానో, ఆవుగానో, చెట్టు చేమలుగానో పుట్టమని దేవుడు శాసిస్తున్నాడా లేదా శపించుతున్నాడా! ఇలాంటి శిక్షలు 84 లక్షలున్నాయట.

నేను అడుగుతున్నాను. దేవుడు విధించుతున్న ఈ శిక్షలు తప్పుచేసిన వారిని సంస్కరించే శిక్షలేనా అని, మీలో ఎప్పుడైనా, ఎవరైనా నేను పూర్వజన్మలో గాడిదగా పుట్టాను. నేను చేసిన పాపానికి నాకు దేవుడు అలాంటి శిక్షను విధించాడని అని అన్నారా? అలా చెప్పినవాళ్లు ఎవరైనా ఉన్నారా? ఉండరు. పురాణాల సంగతినలా ఉంచండి. అందు లోకి నేను వెళ్లదలచలేదు. కాని ఒక్క సంగతి మాత్రం చెప్పగలను. అన్ని పాపాలకంటే మహా పాపం దరిద్రుడుగా ఉండడమే. దరిద్రం కంటే పాపం మరొకటి లేదు. అంతకంటే శిక్ష మరొకటి లేదు.

న్యాయవేత్త లేదా న్యాయాధిపతి లేదా నేర శిక్షానిపుణుడు ఎవరైనా ఇలాంటి శిక్షను విధించినట్లయితే అటువంటి శిక్షను ప్రశంసించుతారా? సమర్థిస్తారా? ఈ దారిద్ర్యమనే శిక్ష ఇంకా అనేక నేరాలు చేయడానికి దారితీయదా? దోహదపడదా?

ఉదాహరణకు ఒకరు దారిద్ర్యంలో, నిరక్షరాస్యతతో ఉండే కుటుంబంలో లేదా పాకీ పనిచేసే కుటుంబంలోనో జన్మించాడనుకొందాం. అతడు దారిద్ర్యంలో ఉన్నాడు. కాబట్టి చదువుకొనే అవకాశం లేదు. కడజాతికి చెందిన నిర్భాగ్యుడు కాబట్టి అతణ్ణి ఎవ్వరూ దగ్గరకు చేరనివ్వరు. పైపెచ్చు చేసే వృత్తిరీత్యా చూస్తేనే అస్యహించుకుంటారు. ఛీ కొడతారు. తాము అధికులమని అనుకుంటారు. దారిద్ర్యంలో పుట్టిన వ్యక్తి యొక్క అ విద్యా, అ విజ్ఞానం ఇతరులు అతనిపట్ల చూపే చిన్నచూపు ఇవన్నీ అతనిలో ఈ సమాజం పట్ల ఒక విధమైన కసిని, అసహనాన్ని కలుగజేస్తాయి. అతని మనస్సు కరుడుగట్టేట్లు చేస్తాయి. ఒకవేళ ఈ పరిస్థితుల్లో ఉన్న

**"వేదాలు చదువుతూ ఉంటే వినకూడని వాళ్లు ఈ సమాజంలో ఉన్నారట. వేదంలో ఒక ముక్క విన్నప్పటికీ వాళ్ల చెవుల్లో సీసం కరిగించి పోయాలంటా? అది వారికి శిక్షట? ఈ శిక్షలకు కూడా పూర్వజన్మలో చేసుకున్న పాపఫలమే కారణమా? ఈ పాపం చేయడానికి కారకులు, బాధ్యులు ఎవరు? ఫలితాన్ని అనుభ వించేది ఎవరు?"**



ఛార్లెస్ డార్విన్

వ్యక్తి ఏదైనా అ కార్యం లేదా చేయరాని పనిని చేశాడనుకుందాం. ఇందుకు బాధ్యత ఎవరిది? ఎవరు దీని ఫలితాన్ని, పర్యవసానాన్ని అనుభవిస్తారు? దేవుడు బాధ్యత వహిస్తాడా లేక ఆ వ్యక్తి బాధ్యత వహిస్తాడా లేక ఈ సమాజాన్ని నడిపిస్తున్న పండితులు వహిస్తారా? అహం భావం, అధిక్యభావం కలిగిన బ్రాహ్మణ వర్గం సంఘంలో కొందరిని అజ్ఞానంలోనూ, అమాయకత్వంలోనూ ఉంచుతున్నారు. ఈ విధంగా అజ్ఞానంలో ఉంచబడటం కూడా వారికి పూర్వజన్మ పాపఫలితంగా వచ్చిన శిక్షేనా?

వేదాలు చదువుతూ ఉంటే వినకూడని వాళ్లు ఈ సమాజంలో ఉన్నారట. వేదంలో ఒక ముక్క విన్నప్పటికీ వాళ్ల చెవుల్లో సీసం కరిగించి పోయాలంటా? అది వారికి శిక్షట? ఈ శిక్షలకు కూడా పూర్వజన్మలో చేసుకున్న పాపఫలమే కారణమా? ఈ పాపం చేయడానికి కారకులు, బాధ్యులు ఎవరు? ఫలితాన్ని అనుభవించేది ఎవరు?

ప్రియ మిత్రులరా? ఈ సిద్ధాంతాలన్నీ సమాజంలో కడుపు నిండిన వారు, అన్ని హంగులూ, అధికారాలు కలిగిన వారు సృష్టించినవే తప్ప మరొకటి కాదు. తాము చేజిక్కించుకున్న అధికారాన్నీ, సకల సంపదలను, అధిక్యతలను కాపాడుకునేందుకు ఈ సిద్ధాంతాలన్నింటినీ వారు కనిపెట్టారు. వాటి సహాయంతోనే తమ స్థానాన్ని నిలబెట్టుకుంటున్నారు.

ఆప్టన్ సింక్లర్ అనుకొంటాను. ఒకచోట ఇలా చెప్పాడు. 'మానవుడు అమరుడు అనే విశ్వాసాన్ని కలిగించు. నీకు ఎన్నటికీ మరణం లేదు అని చెప్పు. అతని వద్దనున్న సకల సంపదలు, వస్తు వాహనాలు అన్నీ లాగేసుకో, నీవు అడిగినదంతా ఇస్తాడు'. నమ్మకం అటువంటిది, విశ్వాసం అటువంటిది. ఒక రకంగా చెప్పాలంటే మతాధిపతులకు, రాజ్యాధికారం చెలాయించేవారికి మధ్య సమన్వయం ఉంది. ఈ సమన్వయం ఫలితంగానే జైళ్లు, ఉరికంబాలు, విద్యాస్థానాలు, ఈ పూర్వజన్మల పుణ్యంతో పాటు సిద్ధాంతాలను ప్రవేశపెట్టారు.

ఒక మనిషి ఏదైనా పాపకార్యం చేస్తున్నపుడు అది చేయకుండా దేవుడు... ఈ సర్వశక్తివంతుడైన భగవంతుడు ఆ పాప కార్యము చేయకుండా ఎందుకు ఆపు చేయకూడదు? యుద్ధ బీభత్సాలను, మానవ మారణహోమాన్ని సాగించే రాజులను, ప్రభువులను ఎందుకు హతమార్చడు? ఇలాంటి దుర్మార్గులను ముందుగానే ఎందుకు శిక్షించకూడదు? మానవజాతిని మారణహోమం చేసే భయంకరమైన ప్రపంచ యుద్ధాన్ని రాకుండా దేవుడు ఆపు చేయలేడా?

మరొక ప్రశ్న అడుగుతాను. భారతదేశాన్ని బానిసత్వంలో ముంచిన బ్రిటీష్ వారి మనసును మార్చి భారతదేశాన్ని బానిసత్వాన్నుండి విముక్తి అయ్యేటట్టు ఎందుకు చేయకూడదు? పెద్ద పెద్ద ధనవంతులు, పెట్టుబడిదారులు తమ వద్దనున్న ధనాన్ని, ఉత్పత్తి సాధనాలను ప్రజల పరం చేసేటట్లు భగవంతుడు వారికి హృదయపరివర్తన ఎందుకు తీసుకురాకూడదు? ఆ విధంగా కష్టజీవులందరినీ ఉద్ధరించేటట్లు చేయరాదా? పరమ కిరాతకమైనా ఈ దోపిడీ విధానం నుండి, బానిసత్వం నుండి యావత్ సమాజాన్ని దేవుడే స్వయంగా విముక్తి చేస్తే బాగుంటుంది కదా?

**"అనేక కష్టాలను ధైర్యంగా ఎదుర్కొన్న నాస్తికుల జీవితాలను నేను చదివాను. కనుక నేను కూడా ఒక మనిషి వలే చివరి వరకూ నా ఆశయాల కోసం మనోనిబ్బ రంతో నిలబడటానికి, చివరికి ఉరికంబం ఎక్కడానికి కూడా సంసిద్ధంగా ఉన్నాను."**

అన్యాయాలు, అక్రమాలు, దోపిడీలు లేని సోషలిస్టు సమాజం ఏర్పడితే ఎంతో బాగుండునని మనం అనుకొంటున్నాం. అలాంటి సమాజాన్ని ఎలా సాధించుకుందాం అని చర్చించుకుంటాం. అందుకోసం పోరాడే మార్గాలను అన్వేషించుదాం. కొందరు అది ఆచరణ సాధ్యం కాదని వాదిస్తారు. అయితే అలాంటి సోషలిస్టు సమాజాన్ని మనకు బాదరబందీ లేకుండా సర్వశక్తివంతుడైన దేవుడే సృష్టించవచ్చు కదా? భగవంతుడే స్వయంగా రంగంలోకి దిగి సమాజాన్ని అంతటినీ ఒక క్రమ పద్ధతిలో పెట్టి సవ్యంగా నడిపించవచ్చును కదా?

భగవదేచ్ఛ అలా ఉంది గాబట్టే బ్రిటిష్ సామ్రాజ్యవాదులు ఇక్కడికి వచ్చి భారతదేశంలో తిష్టవేసి కూర్చోలేదు. భగవంతుడు అలా రాసి పెట్టలేదు. బ్రిటిష్ వాళ్ల చేతుల్లో అధికార బలం ఉంది. మన దగ్గర ఆ బలం లేదు. కాబట్టి మనం వాళ్లను రాకుండా చేయలేకపోయాం. వాళ్లను తిప్పికొట్టగల శక్తి సామర్థ్యాలు మన వద్దలేవు. అంతేకాని భగవంతుని సాయం వలన ఆయన ఇచ్ఛమేరకు బ్రిటిష్ వారు భారతదేశాన్ని ఆక్రమించుకొని తమ అధీనంలో ఉంచుకోలేదు. తుపాకులతో, రైఫిళ్లతో, బాంబులతో, బుల్లెట్లతో, సైన్యంతో, పోలీసులతో వారు మనలను బానిసలుగా చేసుకోగలిగారు. మన జాతిని బానిసత్వంలో ముంచి ఘోరమైన అన్యాయాన్ని, నేరాన్ని, దారుణమైన దోపిడీని వారు కొనసాగిస్తున్నారు. ఇంత ఘోరాతిఘోరం జరుగుతున్నదంటే భగవంతుడు ఉంటే అతడు ఏమి చేస్తున్నట్లు? మానవకోటి పడుతున్న బాధలను చూస్తూ ఆనందిస్తున్నాడా? దేవుడు నీరో చక్రవర్తి లేదా చంఘీజ్‌ఖాన్ లాంటి కర్కోటకుడా? అయితే అలాంటి భగవంతుడు మనకు ఏమాత్రం అవసరం లేదు.

అయితే, ఈ ప్రపంచానికి మూలం ఏమిటి? మానవునికి ఆది ఏమిటి అని మీరు నన్ను అడుగుతారా? సరే, చెపుతాను వినండి. ఈ సమస్యపై చార్లెస్ డార్విన్ కొంత వెలుగునివ్వడానికి యత్నించాడు. ఆయన రచనను చదవండి. అలాగే నిర్మలానందస్వామి రాసిన "ఇంగిత జ్ఞానం" అన్న గ్రంథం చదవండి. మీ ప్రశ్నలకు కొంతవరకు వారు సమాధానాలు ఇవ్వగలరు. ప్రకృతి స్వభావాన్ని గురించి వారు వివరించారు. యాదృచ్ఛికంగా కొన్ని రకాల పదార్థాలు కలిసిన నెబ్యులా ఈ భూమిని సృష్టించింది. చరిత్రను పరిశీలించండి. ఈ పరిణామక్రమంలో జంతువులు పుట్టాయి. సుదీర్ఘకాలం అనంతరం జంతు వుల నుండి మానవుడు పరిణామం చెందాడు. డార్విన్ రచించిన "ఆరిజన్ ఆఫ్ స్పిసీస్" అధ్యయనం చేయండి. ప్రకృతితో నిరంతరం మానవుడు ఘర్షణపడి ప్రకృతిని లోబరుచు కోగలుగుతున్నాడు. క్లుప్తంగా చెప్పాలంటే ఇది పరిణామక్రమం.

కొంతమంది పిల్లలు గ్రుడ్డిగాను, కుంటిగానూ పుడతారు. ఇదంతా గత జన్మలో వారు చేసిన పాప ఫలితమేనంటారు సనాతనులు. మానవ శాస్త్రవేత్తలు, వైద్యులు దానిని చక్కగా వివరించారు. వారి తల్లిదండ్రులలో గల లోపాల వల్లనే వారలా పుడతారని.

సహజంగానే మీరు నన్ను మరో ప్రశ్న కూడా అడగవచ్చు. అసలు దేవుడే లేకపోతే ఈ ప్రపంచంలో దేవుడిని ఇంతమంది జనం నమ్మటం ఎలా సాధ్యమైందని. ఇందుకు నా సమాధానం క్లుప్తంగాను, స్పష్టంగాను ఇది. లేని దయ్యాలను గురించి మనుష్యులు ఎలా నమ్ముతున్నారో దేవుణ్ణి గురించి కూడా అంతే. అయితే ఒక్కటే భేదం. దేవుడిని అందరూ నమ్మడం, దాన్ని గురించి ఒక తత్వశాస్త్రాన్ని రూపొందించి చక్కగా ప్రచారంలో పెట్టగలగడం, కొంతమంది తీవ్రవాదులు చెప్తున్నట్లు దోపిడీదారులు, పీడకులు తమ స్వప్రయోజనాల కోసం దేవుడిని సృష్టించారని మాత్రం నేను చెప్పదలచలేదు. అయితే మతాన్ని వారు ఉపయోగించుకొన్నారన్న విషయాన్ని నేను కాదనను. రాజు మీద తిరుగుబాటు చేయడం పాపమని అన్ని మతాలు చెబుతాయి.

నా ఉద్దేశ్యంలో మానవుడు తనకున్న పరిమితులను, బలహీనతలను, లోపాలను దృష్టిలో ఉంచుకుని దేవుడనే సర్వశక్తివంతుడిని ఊహలోకి తెచ్చుకున్నాడు. కష్ట సమయంలో ప్రమాదాలను ధైర్యసాహసాలతో ఎదుర్కొనేందుకు దేవుడి మీద విశ్వాసం తోడ్పడుతుందనుకున్నాడు. అలాగే సమాజానికి హాని చేయకుండా మానవుడిని దేవుడు అదుపులో పెట్టగలడనుకొన్నాడు. ఒక తండ్రి, తల్లి, సోదరి, సోదరుడు, మిత్రుడిగా అవసరమైనపుడు దేవుడు ఆదుకోగలడనే విశ్వాసాన్ని మానవుడు తనలో పెంపొందించుకున్నాడు. ఆదిమ సమాజంలో తప్పులు చేయకుండా దేవుడు అనే విశ్వాసం మానవుడికి సహాయపడింది. అలాగే దేవుడనే భావం కష్ట సమయంలో ఓదార్పుగా మానవుడికి ఉండేది.

ఆ తరువాత కాలంలో పూజలు చేస్తే దేవుడు రక్షించుతాడనే భావనకి వ్యతిరేకంగానూ, సంకుచిత మత విశ్వాసాలకు వ్యతిరేకంగానూ, ఇతర మూఢవిశ్వాసాలకు ప్రతికూలంగా సమాజంలో పోరాడవలసి వచ్చింది. అలాగే మానవుడు తన కాళ్లపై తాను నిలబడటానికి ప్రయత్నించుతూ వాస్తవికవాది అయినప్పుడు ఈ దేవుడనే విశ్వాసాన్ని త్రోసిపుచ్చుతాడు. కష్టాలు వచ్చినప్పుడు ధైర్యంతో అధిగమించ డానికి దేవుడిని తిరస్కరించడం లేదు. పైన వివరించిన ఆలోచనా విధానమే నన్ను నాస్తికుడిగా చేసింది. దేవుడిని నమ్మడం, ఆయ నను నిత్యం ప్రార్థించడమూ అత్యంత స్వార్థ పూరితమైన విషయమని నేను భావించుతాను. ప్రార్థించడం ద్వారా దేవుడి నుండి ప్రయోజనం పొందాలనుకోవడం మానవుని నైతిక పతనానికి నిదర్శనం. అనేక కష్టాలను ధైర్యంగా ఎదుర్కొన్న నాస్తికుల జీవితాలను నేను చదివాను. కనుక నేను కూడా ఒక మనిషి వలే చివరి వరకూ నా ఆశయాల కోసం మనోనిబ్బ రంతో నిలబడటానికి, చివరికి ఉరికంబం ఎక్కడానికి కూడా సంసిద్ధంగా ఉన్నాను.

నేను ఎలా వ్యవహరించుతానో చూడండి. ఒక మిత్రుడు నన్ను దైవ ప్రార్థన చేయవలసిందిగా కోరాడు. నేను నాస్తికుడనని చెప్పినా ఆయన ఇలా అన్నాడు. "ఆఖరి రోజుల్లోనైనా దేవుడిని నమ్మటం నీవు ప్రారంభిస్తావు". అలాంటిదేమీ లేదని నేనన్నాను. అది ఎన్నటికీ జరిగేదికాదని కూడా అతనికి స్పష్టం చేశాను. కష్ట సమయంలో అలా దేవుడిని నమ్మడమంటే నేను నైతికంగా దిగజారిపోవడమే కాగలదు. నా స్వార్థం కోసం నేను ప్రార్థించదలచలేదు. పాఠకులారా, మిత్రులారా ఇది అహంభావం అనిపించుకుంటుందా? ఒకవేళ అదే అయితే అందుకే నేను నిలబడతాను. ❋

# అమెరికా అణు విద్యుత్: దేశానికి భారం

**ప్రబీర్ పుర్కాయస్థ**



ప్రజారోగ్య పరిరక్షణ సంస్థ
జాతీయ నాయకులు

మోడీ నాల్గవ దఫా అమెరికా పర్యటన సాధించిందేమీ లేదు. ఆరు అణు రియాక్టర్లకు సంబంధించిన పని ప్రారంభం కావడమే ఘన కార్యంగా పత్రికల పతాక శీర్షికలు గగ్గోలు పెట్టడంలో ఆశ్చర్యమేమీ లేదు. అయితే ఈ వైఫల్యంతో సంబంధం లేకుండా మధ్య రెండు తరాల రియాక్టర్లను విడిచిపెట్టి... వెస్టింగ్‌హౌస్ ఎపి 1000 రియాక్టర్లను ఐదవ తరం రియాక్టర్లుగా విపరీతమైన ప్రచారం జరిగింది. పూర్వపు ఎ.పి 600 రియాక్టర్లను రెండవ తరం రియాక్టర్లుగా, ఎపి 1000 రియాక్టర్లను మూడవ తరం రియాక్టర్లుగా (భారత మీడియాలోని కొందరు పెద్దమనుషులు మినహా) ప్రపంచం అంతా భావిస్తోంది. వాస్తవానికి, వెస్టింగ్‌హౌస్ రియాక్టర్లకు సంబంధించి ఎనిమిదేళ్లపాటు చర్చలు చేసిన అనంతరం, అణువిద్యుత్ కేంద్రాన్ని భారత్ ఇప్పుడు మితివిర్ధి నుంచి ఆంధ్ర ప్రదేశ్‌లోని శ్రీకాకుళంకు మార్చింది. వెస్టింగ్‌హౌస్‌తో ఒప్పంద విషయమై చర్చలు నిల్చిపోయిన వేళ... కొత్త ప్రదేశాన్ని ప్రకటించడమొక్కటే... కొత్త విషయం. మొత్తం మీద వెస్టింగ్ హౌస్ ఒప్పుకున్నదేమిటంటే కొత్త ప్రదేశంలో కొంత పని ప్రారంభించడానికి అంగీకారం తెలపడమే.

ఇవాళ ప్రపంచం మొత్తం మీద అణు ఇంధనం అనేది ఉనికిని కోల్పోతున్న సాంకేతిక పరిజ్ఞానం. దీని ఖర్చు చాలా ఎక్కువగా ఉంటుంది. అనుకున్న షెడ్యూలు లోపల నిర్మాణం జరుగుతుందన్న నమ్మకం ఉండదు. పైగా ధరలు విపరీతంగా పడిపోతున్న పవన, సౌర విద్యుత్ వంటి పునరుత్పాదక విద్యుత్ నుంచి దీనికి సవాళ్లు ఎదురవుతున్నాయి.

‘అణు వసంతం’గా చెప్పబడుతున్న అణు విద్యుత్‌తో తనకున్న స్వల్ప కాల అనుబంధం అనంతరం... అమెరికా ఆ సాంకేతిక పరిజ్ఞానం మీద ఇక మీదట ఎలాంటి పెట్టుబడులు పెట్టకూడదని నిర్ణయించుకుంది. మరణశయ్యపై నున్న అమెరికన్ అణు పరిశ్రమకు భారత్, చైనాలు మాత్రమే ప్రాణం పోస్తున్నాయి. అమెరికా, యూరోపియన్ యూనియన్ దేశాలలో వెస్టింగ్ హౌస్, జి.ఇ కంపెనీలకు ఇరతత్రా కొను గోళ్లేవీ లేవు. కాబట్టి, భారత్‌కు అణు రియాక్టర్లను ఇవ్వడానికి అమెరికా అంగీకరించడం గొప్ప విషయం కాదు. అడుగులోతు సమాధిలోకి జారిన రోగగ్రస్త అమెరికన్ అణు పరిశ్రమకు ప్రాణం పోస్తున్న దేశం భారత్. మృత్యు ముఖంలో ఉన్న వెస్టింగ్‌హౌస్‌ను బతికించేందుకు మనం ఎంత మూల్యం చెల్లిస్తున్నాం? అన్నదానికి ఎటువంటి అంకెలు అందుబాటులో లేనప్పటికి జైతాపూర్‌లోని అరెవాకు మనం చెల్లిస్తున్న మొత్తంతో పోల్చితే...ఆరు వెస్టింగ్‌హౌస్ రియాక్టర్లకు రు.2.8 లక్షల కోట్లు కట్టాల్సి రావచ్చు. అయితే అక్కడ తయారైన అణు విద్యుత్ యూనిట్ (కిలోవాట్) రు.12–14 ఉండవచ్చని అంచనా. లేదా థర్మల్ (బొగ్గు నుంచి తయారయ్యే) విద్యుత్ పరిశ్రమల నుంచి ఉత్పత్తి అయిన విద్యుత్తుకు మూడు నుంచి నాలుగు రెట్లు ఎక్కువగా ఉండవచ్చు. పవన, సౌర విద్యుత్ కంటే కూడా అణువిద్యుత్తు ధర చాలా ఎక్కువ.

### భారత్–అమెరికా అణు ఒప్పందం

పదేళ్ల కిందట కుదుర్చుకున్న భారత్–అమెరికా అణు ఒప్పందంలో భాగంగా 1000 మెగావాట్ల సామర్థ్యం కలిగిన ఆరు యూనిట్లను ఏర్పాటు చేసేందుకు జి.ఇ, వెస్టింగ్‌హౌస్ కంపెనీలకు భారత్ చెరో ఒక స్థలాన్ని కేటాయించింది. హిటాచి–జి.ఇ కంపెనీకి శ్రీకాకుళంలో స్థలాన్ని కేటాయించగా వారు తిరస్కరించారు. వెస్టింగ్‌హౌస్‌కు మితివిర్ధిలో స్థలాన్ని కేటాయించింది. దీనికి వ్యతిరేకంగా స్థానిక ప్రజలు ఆందోళనలు చేయడం, పర్యావరణ సంబంధిత పలు అభ్యంతరాలు వెలువడడంతో న్యూక్లియర్ పవర్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఎన్.పి.సి.ఎల్) మితివిర్ధి ఆలోచనలను మానుకుంది. అయితే అందుకు బదులుగా వెస్టింగ్‌హౌస్‌కు శ్రీకాకుళం స్థలాన్ని కేటాయించింది. మన్మోహన్ సింగ్ ప్రధానిగా ఉన్న సమయంలో చేసుకున్న భారత–అమెరికా అణు ఒప్పందం కొనసాగింపుగానే అణు విద్యుత్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు మోడీ–ఒబామా ప్రకటన వల్ల తెలుస్తుంది. ఎనిమిదేళ్లలో సాధించిందేమీ లేదు. తిరిగి ఇరు దేశాలూ మొదటికే వచ్చాయి.

మన్మోహన్ సింగ్ హయాంలో కనీసం అణు ఇంధన ఉత్పత్తి, అణు ఇంధన పరిశ్రమ పునరుద్ధరణకు సంబంధించిన చర్చయినా నడిచింది. ఫుకుషిమా ఘటన అనంతరం ప్రపంచంలో అధిక శాతం దేశాలు అణు విద్యుత్ ఊసే ఎత్తడం లేదు. భారత్, చైనా, రష్యా మాత్రమే ఇంకా వాటి జపం చేస్తున్నాయి. అణు విద్యుత్‌కు ఇవ్వాల్సిన దానికి మించి భారత్ అమెరికాకు చెల్లిస్తున్నది. ‘న్యూక్లియర్ క్లబ్బు’లో సభ్యత్వం పొందేందుకు అమెరికా ‘మద్దతు’ తెలపడమే అందుకు కారణం. అణు ఇంధన సరఫరాకు అనుమతి పొందినప్పటికి.. సాంకేతిక పరిజ్ఞానం, పౌర, సైనిక అవసరాలకు వినియోగించే ద్వంద్వ వినియోగ సాంకేతిక పరిజ్ఞానం, ఇంధన పున:శుద్ధి, ఎన్.ఎస్.జిలో సభ్యత్వం వంటి ఇతర వాగ్దానాలు నెరవేరనేలేదు. అణు ఒప్పందం జరిగి ఎనిమిదేళ్లయింది. ఇది చాలా సుదీర్ఘ కాలం. ఈలోగా ఫుకుషిమా నుంచి పెద్ద మొత్తంలో అణుధార్మికత సముద్రంలో కలిసిపోయింది. అమెరికా ఇతర అణు కేంద్రాలన్నిటిని ఆపివేసింది. ఫిన్‌లాండ్‌లోని ఒల్కిలువోటో, ఫ్రాన్స్‌లోని ఫ్లామన్ విల్లేలో ఏర్పాటు చేసిన అత్యంత ఖరీదైన ఇ.పి.ఆర్‌ల అనంతరం ఫ్రాన్స్ అణు పరిశ్రమల విస్తరణను ఆపివేసింది. అయితే ఒక్క బ్రిటన్ మాత్రం తను మూసివేయదల్చుకున్న పరిశ్రమల స్థానంలో ఇ.పి.ఆర్, వెస్టింగ్ హౌస్ రియాక్టర్లను ఏర్పాటు చేసే ఆలోచనలో ఉంది. జర్మనీ అణు ఇంధన పరిశ్రమలను మూసివేసి పవన, సౌర విద్యుత్ వైపు మొగ్గు చూపుతోంది. ఈ పరిణామాలన్నిటికి కారణం ఒక్కటే. మూడవ తరం రియాక్టర్లను నిర్మించడం చాలా కష్టమే కాదు క్లిష్టం కూడా. పెద్ద మొత్తంలో డబ్బు, సమయం ఖర్చవుతుంది. 80వ దశకంలో అణు విద్యుత్‌ను వద్దనుకోవడానికి కారణం కూడా అదే. నేటికీ అణు పరిశ్రమను వెన్నాడుతున్న సమస్య అదే. పైగా రియాక్టర్లకు విద్యుత్తు సరఫరా ఆగిపోయినప్పుడు పని చేయకుండా పోయే

**"ఈ ప్రకారం శ్రీకాకుళంలో నిర్మించ తలపెట్టిన ఆరు అణు రియాక్టర్ల ఖర్చు సుమారుగా రు.2.8 లక్షల కోట్లు అవుతుందని అంచనా! ఒక మెగావాట్ విద్యుత్తు ఉత్పత్తికి రు.42 కోట్లు అవుతుంది. అంటే బొగ్గుతో తయారయ్యే విద్యుత్తు ఖర్చుకు ఏడు రెట్లు ఎక్కువ."**

ప్రమాదం ఉందని ఫుకుషిమా ఉదంతం మనకు తెలియచేస్తోంది.

మనం కొనుగోలు చేసిన వెస్టింగ్‌హౌస్ రియాక్టర్ల గురించి మరింత లోతుగా పరిశీలిద్దాం. నిజానికవి ఇవాళ ఉపయోగపడతాయో లేదో చూద్దాం. ఫ్రెంచి ఎరెవా ఇ.పి.ఆర్ డిజైన్లను వెన్నాడిన సమస్యలే... వెస్టింగ్‌హౌస్ ఎ.పి. 1000 రియాక్టర్లకూ ఉన్నాయి. ఇ.పి.ఆర్ నిర్మాణ సమయంలో ఎదురైన డబ్బు, సమయం సంబంధిత సమస్యలే అమెరికా, చైనాలో నిర్మిస్తున్న ఎ.పి 1000 రియాక్టర్లు ఎదుర్కొంటున్నాయి. ఎ.పి 1000 రియాక్టర్లను (జార్జియాలోని ఓగ్టేల్, దక్షిణ కరోలినాలోని వి.సి సమ్మర్) రెండు చోట్ల ఏర్పాటు చేస్తున్నారు. విడివిడిగా 1,107 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం గల రెండు ఎ.పి 1000 రియాక్టర్లను ఏర్పాటు చేయాలన్నది వాటి లక్ష్యం. వాస్తవానికి నాలుగేళ్లలో రియాక్టర్ల నిర్మాణం పూర్తి కావాలి. అయితే రెండూ అనుకున్న సమయం దాటిపోయి మూడేళ్లయినా లక్ష్యాన్ని చేరుకోలేదు. మొదటి యూనిట్లు 2018 నాటికి, రెండవ యూనిట్ 2019 నాటికి పూర్తవుతుందని అంచనా.

వెస్టింగ్‌హౌస్... చైనాలో నాలుగు అణు యూనిట్లను నిర్మిస్తోంది. అమెరికన్ ప్లాంట్ల నిర్మాణంలో వలెనే ఇక్కడా మూడేళ్లు ఆలస్యమైంది. ఒల్కిలువోటో ప్లాంట్ మూడవ యూనిట్‌కు... దీనికి అత్యంత సన్నిహిత సారూప్యతలున్నాయి. ఐదేళ్లకు పూర్తి కావాల్సిన యూనిట్ ఎనిమిదేళ్లయినా నిర్మాణ దశలోనే ఉంది. ఎ.పి 1000 వలెనే అంతకంతకు ఆలస్యమవుతూనే ఉంది. కొత్త సమస్యలు వెలుగులోకి వస్తూనే ఉన్నాయి. దాంతో అనుకున్నదానికంటే సమయం పెరిగిపోయింది. 3 బిలియన్ యూరోల నిర్మాణ వ్యయం అవుతుందనుకున్నది వాస్తవ వ్యయం మూడు రెట్లు ఎక్కువగా 8.5 బిలియన్ల యూరోలకు చేరింది.

చైనా అణుప్లాంటు కాంట్రాక్టుకు సబంధించిన వివరాలు బయటకు అంతగా వెల్లడి కాలేదు. ప్లాంటు నిర్మాణ విషయమై చైనా అధికారులు తీవ్ర అసంతృప్తితో అన్నారన్న విషయం మాత్రమే తెలుస్తోంది. ఆలస్యం కారణంగా పెరిగే ఖర్చును ఎవరు భరిస్తారు? ఎంత ఖర్చు పెరుగుతుంది? అనే విషయాలు తెలియదు. తమ అనుభవం నుంచి చైనీయులు గుణపాఠం నేర్చుకున్నట్టే కన్పిస్తోంది. వారు దేశీయంగా వృద్ధి చేసుకున్న మూడవ తరం అణు రియాక్టర్లను ఏర్పాటు చేసుకునే ఆలోచనలో ఉన్నారు.

ఎ.పి 1000 నిర్మాణ వ్యయం ఎంత? అందుకు అవుతున్న జాప్యం ఎంత? లాంటి అంశాలను పరిగణనలోకి తీసుకోకుండా 2009లో ప్రారంభించిన ఓగ్‌టేల్ ప్లాంట్ రెండు యూనిట్ల నిర్మాణ వ్యయం సుమారుగా 14 బిలియన్ డాలర్లు (రు.94,0000 కోట్లు) ఉంటుందని అంచనా. ఈ ప్రకారం శ్రీకాకుళంలో నిర్మించ తలపెట్టిన ఆరు అణు రియాక్టర్ల ఖర్చు సుమారుగా రు.2.8 లక్షల కోట్లు అవుతుందని అంచనా! ఒక మెగావాట్ విద్యుత్తు ఉత్పత్తికి రు.42 కోట్లు అవుతుంది. అంటే బొగ్గుతో తయారయ్యే విద్యుత్తు ఖర్చుకు ఏడు రెట్లు ఎక్కువ. ఇవన్నీ మరీ అతిగా వేసిన అంచనాలు కావు! ఒక్కసారి జైతాపూర్ ఎరెవా ఇ.పి.ఆర్ ధరలను గుర్తు చేసుకుందాం. అవి కూడా వీటికి చాలా దగ్గరగా ఉన్నాయి. అయితే ఎన్.పి.సి.ఎల్‌కు ఎరెవాకు మధ్య ఏడేళ్లకు పైగా చర్చలు సాగిన సంగతి విస్మరించకూడదు.

మెగావాట్ విద్యుత్ ఉత్పత్తికి అయిన పెట్టుబడిని యూనిట్లలోకి మార్చితే (కిలోవాట్)కి ఎంతవుతుంది? మెగావాట్ విద్యుత్తుకు రు.42 కోట్లు ఖర్చయితే యూనిట్ విద్యుత్తు రు.12-14 పడుతుంది. అదే థర్మల్ విద్యుత్తుకు రు.3-4 పడుతుంది. అయితే భారతదేశంలో పవన విద్యుత్తు ... థర్మల్ విద్యుత్తుకంటే చవక. సౌర విద్యుత్తు యూనిట్‌కు రు.4 నుంచి రు.6 పడుతుంది. దిగుమతి చేసుకున్న అణు రియాక్టర్ల నుంచి ఉత్పత్తి చేసిన విద్యుత్తు పవన, బొగ్గు, సౌర విద్యుత్తు కంటే మూడు రెట్లు ఎక్కువ ఖరీదైనది.


### అంతకంతకు పెరిగే ధరలు

అణు విద్యుత్తు యూనిట్ ఖర్చు అంతకంతకు పెరిగిపోవడానికి పలు కారణాలున్నాయి. రెండు ముఖ్యమైన అంశాలను ప్రస్తావించుకుందాం. ఒకటి అణు దుర్ఘటనలు. విస్ఫోటక అణు పదార్థాలను వినియోగించడంలో అంతర్గతంగా కొంత సంక్లిష్టత ఉంది. ప్రక్రియ అంతటిలోను ఏ కీలక వ్యవస్థ విఫలమైనా వాటిని నియంత్రించడం కష్టం. పైగా రియాక్టర్లు పని చేయని పరిస్థితి ఏర్పడుతుంది. చెర్నోబిల్, ఫుకుషిమాలో మనం చూసిందదే. రెండవ అంశం, అంతకంతకు పెరిగిపోయే ధర. దాంతో అణు పరిశ్రమ పరిమాణాన్ని పెంచి, యూనిట్ ధరను తగ్గించే ప్రయత్నం చేస్తుంది. ఇది కూడ సంక్లిష్టతను తీవ్రం చేస్తుంది. 1,100 మెగావాట్లు (ఎ.పి 1000), 1,600మెగావాట్లు (ఐ.పి.ఆర్) అణు రియాక్టర్లు అత్యంత భారీ పరిమాణపువి. వాటిని నిర్మించడం, ఉత్పత్తి ప్రారంభించడం రెండూ క్లిష్టమే. అణు పరిశ్రమ అనుకున్న కాల పరిమితి లోపల ప్రాజక్టు నిర్మాణాలను పూర్తి చేయకపోవడానికి కీలకాంశమిదే. అమెరికాలోని అణు పరిశ్రమను మింగేసింది త్రీమైల్ ఐలాండ్ విపత్తు కాదు. అనుకున్న కాల పరిమితి లోపల నిర్మాణాన్ని పూర్తిచేయలేకపోవడం, ఖర్చును భరించడంలో పదే పదే విఫలం కావడమే. పరిగణనలోకి తీసుకోవాల్సిన మరొక అంశం ఉంది. అనేక అణు యూనిట్లను ఒకేచోట ఏర్పాటు చేసినట్లయితే అణు దుర్ఘటనల తీవ్రత పెరుగుతుంది. విద్యుత్ ప్లాంటుకు కావాల్సిన స్థలాన్ని పొందడంలో కలిగే ఇబ్బందులు, విద్యుత్ ధరలను తగ్గించే ప్రయత్నంలో భాగంగానే మనం ఆ నిర్ణయం తీసుకుని ఉండొచ్చు. 1,100 మెగావాట్లు (శ్రీకాకుళం) లేదా 1,600 మెగావాట్ల (జైతాపూర్) యూనిట్లను ఒకే చోట ఏర్పాటు చేస్తే దుర్ఘటనలు సంభవించినప్పుడు వినాశకర పరిణామాలకు దారితీస్తుంది. ఒక్క అణు సాంకేతిక పరిజ్ఞానానికి సంబంధించిన ఉత్పత్తులకు మాత్రమే కాలంతో పాటుగా ధరలు పెరుగుతుంటాయి. ఇతర పవన, సౌర విద్యుత్ ధరలు కొంతకాలం తర్వాత గణనీయంగా తగ్గుతాయి. అణు విద్యుత్తు విషయంలో అలా జరగదు. ఇవాళ మనం థర్మల్ విద్యుత్తును కాదనుకుంటే పునరుత్పాదక అవకాశం కలిగిన ఇతర విద్యుత్తులను ఆశ్రయించవచ్చు. ఆర్థికంగా చూసినా లేదా స్వచ్ఛమైన విద్యుత్తు వనరుగా చూసినా సమస్యకు అణు విద్యుత్తు పరిష్కారం కాదు.

**(అనువాదం : కె అంజన)**

# ధ్యాన మార్గం సర్వరోగ నివారిణి అవుతుందా?

ఎ రవి



రచయిత సిపిఐ (ఎం) పశ్చిమ గోదావరిజిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు

ఇరవై ఏళ్ల క్రితం పొద్దున లేవడంతోనే నూనె నోట్లో వేసుకుని పుక్కిలించడంతో దినచర్య ప్రారంభించేవారు. దీన్నే ఆయిల్ పుల్లింగ్ ప్రక్రియ అంటారు. ఉన్నత, మధ్యతరగతి కుటుంబాల్లోని అత్యధికులు ఈ ప్రక్రియను పాటించేవారు. దీనిపై చాలా పుస్తకాలు వచ్చాయి. ఆయిల్ పుల్లింగ్ సర్వరోగ నివారిణి అంటూ ప్రచారం సాగింది. రోగ కారక క్రిములు అత్యధికంగా నోట్లోనే ఉంటాయి. స్వచ్ఛమైన సన్‌ఫ్లవర్ ఆయిల్ నోట్లో వేసుకుని పుక్కిలిస్తే వ్యాధులు దరిచేరవు. సర్వరోగ నివారిణి పనిచేయడమెలాగున్నా సన్‌ఫ్లవర్ ఆయిల్ అమ్మకాలు మాత్రం బాగా పెరిగాయి. నేడు ధ్యానం చేస్తే సర్వరోగాలు దూరమై వైద్యులు బోర్డులు తిప్పేసుకుంటారన్న ప్రచారం నాటి ఆయిల్ పుల్లింగ్ ప్రక్రియను గుర్తు చేస్తున్నది.

శ్వాస మీద ధ్యాస ఉంచి ధ్యానం చేస్తే ఉన్న రోగాలు పోతాయి. కొత్త రోగాలు దరిచేరవు. సర్వరోగ నివారిణిగా పనిచేస్తుంది. డాక్టర్లు అవసరం లేదు. మందులతో పనిలేదు. పిరమిడ్ సంస్థవారు చేస్తున్న ప్రచారమిది. దేశమంతటిని ధ్యాన మార్గం లోకి తెచ్చేందుకు ప్రయత్నిస్తున్నారు. ఈ ప్రక్రియ పద్ధతి, ఫలితాలపై ధ్యాన బ్రహ్మర్షి పత్రీజీ పుస్తకాలు రాశారు. తాజాగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు యోగాసనాలు, ధ్యానం అంశాలు అన్నీ పాఠశాలల్లో విధిగా బోధించాలని ఆదేశించాయి.

మనిషికి ఏకాగ్రత, పరధ్యానం రెండూ ఉంటాయి. ఏకాగ్రతతో చేసే పనిపై ధ్యాస పెట్టాలి. ఈ భౌతికాంశాన్ని చిలువలు, పలువలు చేసి ఇందులో ధ్యాన మార్గాన్ని సూచించడం ఓ అడుగైతే, దాన్ని సర్వరోగ నివారిణిగా చెప్పటం పరాకాష్ట. తద్వారా సైన్సును అపహాస్యం చేస్తున్నారు. ఓ భౌతిక ప్రక్రియకు ఆధ్యాత్మికతను అద్దుతున్నారు. భారతీయ భౌతికవాదులు నిరీశ్వర వాదాన్ని చాటిచెప్పారు. ఆత్మే పరబ్రహ్మమని, జీవుడే దేవుడని, దేహమే దేవాలయమంటూ భౌతికవాదులు చెప్పినట్లుగా తమ భావవాద ప్రచారానికి బరితెగించి వినియోగించుకోవడం దీని ప్రత్యేకత. వేదాల ప్రామాణికతను నిరాకరించి, నాస్తికవాదాన్ని, నిరీశ్వర వాదాలను భారతీయ భౌతిక వాదాలైన బౌద్ధం, జైనం చాటి చెప్పాయి. వేదాల ప్రామాణికతను అంగీకరించి నప్పటికీ సాంఖ్యం, న్యాయం, వైశేషికాలు నిరీశ్వర వాదాన్నే చెప్పాయి. బౌద్ధం అనాత్మ వాదాన్ని బలపర్చింది. శరీరం లేకుండా ఆత్మ ఉండదని, శరీరంతో పాటు ఆత్మ నశిస్తుందని లోకాయతం భారతీయ సమాజానికి తెలియజేసింది. ఆత్మ శరీరాన్ని అంటిపెట్టుకోవడంతో పాటు, విడిగా కూడా ఉంటుందని అనే కాంత వాదాన్ని జైనం పేర్కొంది. ఐతే ఆత్మ విశ్వంతాన్ని చేరుకుంటుందని చెప్పిందే తప్ప పరమాత్మను చేరుతుందని చెప్పలేదు. చిత్ర మేమంటే భౌతికవాద దర్శనాలకు గుండెకాయ లాంటి ఈ అంశాలను ధ్యానమార్గం వారు మరుగున పరుస్తున్నారు. వక్రీకరించి తమ సిద్ధాంతాలకు తగ్గట్లుగా యథేచ్ఛగా వాడుకుంటున్నారు.

ప్రపంచీకరణ, నయా ఉదారవాద విధానాలు ప్రపంచమంతటా వేగంగా అమలౌతున్నాయి. మనదేశ పాలకవర్గాలు వీటిని తు.చ తప్పకుండా అమలు చేస్తున్నాయి. ఫలితంగా దేశంలో ధరలు, పేదరికం, నిరుద్యోగం పెరిగిపోతున్నాయి. దీంతో తమ ఉద్యోగ, పని భద్రతలతో పాటు జీవితాలకే భద్రత కరవైపోయింది. ఫలితంగా రోజువారీ జీవితం ఆందోళనమయమైపోయింది. దీంతో మానసిక ప్రశాంతత సైతం కొరవడింది. చేసే పనిపై ఏకాగ్రత దెబ్బతింటుంది. ఒకప్పుడున్న సాధారణ ప్రశాంతత, ఏకాగ్రతలు ప్రస్తుత పరిస్థితుల్లో ఎండమావిగా మారుతున్నాయి. చివరికి తమ శ్వాస ప్రక్రియను పట్టించుకునే తీరిక కరువయ్యింది. మరోపక్క క్రమేపి శారీరక శ్రమ బాగా తగ్గుతున్నది. రెడిమేడ్ ఆహారాలకు అలవాటు పడ్తున్నారు. దీంతో ఉబకాయం ఇతర అనారోగ్య సమస్యలు వెంటాడుతున్నాయి. ఈ పరిస్థితుల మధ్య, ఉన్నత మధ్యతరగతి ప్రజానీకం సులువుగా ఆకర్షించబడుతున్నారు. పైగా ఈ ప్రక్రియ ఆచరించడం ఖర్చు, శ్రమ లేనిది మనం ఖాళీ సమయంలో ఇంటో నైనా చేయొచ్చు. దీంతో వీటివైపుకు సులభంగా మళ్లుతున్నారు.

మనదేశంలో అపూర్వమైన భౌతికవాద వారసత్వం ఉంది. వెయ్యేళ్లకు పూర్వం దేశమంతటా భౌతికవాద దర్శనాలే పై చేయి సాధించాయి. భావవాదుల్ని ముప్పతిప్పలు పెట్టాయి. భావవాదం పాలక వర్గాలకు బలమైన ఆయుధంగా మారితే భౌతికవాదం వారి వ్యతిరేక శక్తులకు సాధనమయ్యింది. అందువల్ల పాలకవర్గాలు భౌతికవాదుల్ని లంగదీసుకోవాలనుకున్నారు. భౌతికవాద దర్శనాల్లో భావవాదాన్ని చొప్పించారు. చివరికి వాటిని భావవాద దర్శనాలుగా దిగజార్చారు. వీరికి లంగని లోకాయతులు వంటి వారిని అంతం చేశారు. వారి రచనలు, భావాలు రూపురేఖలు లేకుండా ధ్వంసం చేశారు. వర్తమానంలో భౌతిక ప్రక్రియలకు ఆధ్యాత్మికతను జోడిస్తున్నారు. సైన్సును అపహాస్యం చేయడమే కాకుండా, కుహనా సైన్సును ముందుకు తెస్తున్నారు. వాటిని సర్వరోగ నివారిణిలుగా ప్రచారం చేస్తున్నారు. మతోన్మాద శక్తులు తమ ఎజెండాకు పావుగా వాడుకుంటున్నాయి. అందుకు తాజా ఉదాహరణే యోగాసనాలకు ముందు ఓంకారాన్ని ఉచ్ఛరించాలని కేంద్ర ప్రభుత్వం ఆదేశించడం.

యోగ శాస్త్రం శరీర దారుఢ్యాన్ని, ఏకాగ్రతను పెంచేందుకు ఉద్దేశించిన అదిభౌతిక వాద దర్శనం. ఇందులో చేర్చబడ్డ ప్రయోగాలలో ఆదిమ సమాజపు రూపాలున్నాయి. ఆదిమజాతులు శరీరాన్ని అదుపులోకి తెచ్చే ప్రయత్నం చేసినట్లు సింధు నాగరికతకు చెందిన శాసనాల్లో కనపడుతున్నది. అంటే ఆర్యులు మనదేశానికి రాకముందు నుండే యోగశాస్త్రం విస్తరించింది. యోగతత్త్వం నుండే యోగాచారం, యోగసిద్ధాంతం, ఆచరణ నుంచి ఏకాగ్రతను రూపొందించారు. ఆదిమ వాసులైన అనార్యుల నుండి ప్రారంభమైన ఈ యోగాచారం అర్యులు కూడా అభ్యసించారు. ఈ అంశం ఋగ్వేదంలో ప్రస్తావించబడింది. తదనంతరం భౌతికవాదులుగా ప్రసిద్ధిచెందిన బౌద్ధులు, జైనులు, సాంఖ్యులు ఒక్కొక్కరు ఒక్కో రీతిలో

**"ధ్యానం చేయటం సర్వరోగ నివారిణి అని చెప్పడమే కాకుండా సైన్సును, వైద్యుల్ని నిరాకరించడం, వాటి అవసరమే లేదనడం విడ్డూరం. జీవితంలో పుట్టిన దగ్గర నుండి, చనిపోయేవరకూ సైన్సును వినియోగించ కుండా జీవించినవారు ఒక్కరైనా ఉంటారా? అసలు ఉండగలరా?"**



యోగా చేస్తున్న విద్యార్థులు

ఆచరించారు. భౌతికవాదులకున్న తర్కబుద్ధికి భావవాదులు కుదేలయ్యారు. ఈ తర్కబుద్ధిని కించపర్చడానికి, పల్చన చేయడానికి యోగా చారాన్ని మంచి పనిముట్టుగా వినియోగించుకున్నారు. పతంజలి యోగశాస్త్రానికి ఆధ్యాత్మికతను జోడించడం ప్రారంభించాడు. తదనంతరం ఆధ్యాత్మికతను జోడించడంతో దానికున్న భౌతికవాద ఛ్చాయల్ని దెబ్బతీశారు. ధ్యానమార్గం అంటూ ప్రస్తుతం చెప్పుకున్నప్పటికీ ముందు ఆచరించిన వారిలో ఏ ఒక్కరిలోనూ ఐక్యత లేదు. వీరికి యోగ దృష్టిలో ఏకానుభవం లేదు. ఉపనిషత్ కాలంలో బ్రహ్మను యోగం ద్వారా కనుగొనగలం. అందుకు ఆస్తిక విశ్వాసం ఓ షరతుగా విధించబడింది. అంటే భౌతిక ప్రక్రియను ఓ విశ్వాసంగా మార్చేశారు. యోగదర్శనానికి ఉన్న భౌతిక వాదచ్ఛాయల్ని తొలగించి, ఓఆస్తిక మార్గంగా నేడు ధ్యాన మార్గం వారు మార్చేశారు.

గౌతమ బుద్ధుడు సత్యాన్ని కనుక్కునే ఉపాయంగా ఆనపాన సతిని ప్రతిపాదించాడు. పాళిభాషకు చెందిన ఈ ప్రక్రియకు అర్థం శ్వాసమీద ధ్యాస. ఈ ప్రక్రియను తమ వయస్సుకు తగినట్లుగా ఆచరించాలి. తద్వారా దివ్యదృష్టి దశకు చేరుతాం. జంతుత్వానికి అధీనుడు కాకుండా యజమానిగా మారతాం. చిట్టచివరికి ఆత్మపరమాత్మను చేరే ఏకైక మార్గం, ఇదే, మన ఆత్మ పరమాత్మ: మన శరీరంలోని జీవమే దేవుడు శరీరమే దేవాలయమన్న మూడు సత్యాలతో కూడిన జ్ఞానాన్ని తెలుసుకోగలం. ఈ సత్యాన్ని గురువు ద్వారా తెలుసుకోగలం. మనశ్వాసే గురువు. సాధారణ ఉఛ్వాస, నిశ్వాసల ప్రక్రియే సుఖమయ ప్రాణాయామం. ఈ ప్రక్రియ ద్వారా మనస్సుకి విశ్రాంతి దక్కుతుంది. ముసలితనపు ఛాయలు రావు. ఎంత ఆయుష్షు కావాలంటే అంత దక్కుతుంది. అనారోగ్యం ఉండదు. సర్వరోగనివారిణి రోగాలు దరిచేరవు. ఈ ప్రక్రియ ఆచరిస్తే వైద్యులు, మందుల అవసరం రాదు. మాంసాహారం జంతుతత్త్వంతో కూడినది. కాబట్టి మాంసాహారాన్ని మానేయాలనేది ఓ షరతుగా ఉంటుంది.

ధ్యానం చేయటం సర్వరోగ నివారిణి అని చెప్పడమే కాకుండా సైన్సును, వైద్యుల్ని నిరాకరించడం, వాటి అవసరమే లేదనడం విడ్డూరం. జీవితంలో పుట్టిన దగ్గర నుండి, చనిపోయేవరకూ సైన్సును వినియోగించకుండా జీవించినవారు ఒక్కరైనా ఉంటారా? అసలు ఉండగలరా? వీరన్నట్లు రోగాలు రావనుకుందాం. మరి ప్రమాదాలు సంభవిస్తే. అప్పుడు కూడా వైద్యుల అవసరముండదా? భావవాదులకు శాస్త్రానికి ప్రతినిధులైన వైద్యులకు మధ్య సంఘర్షణ ఈనాటిది కాదు. తాము చెప్పే కర్మసిద్ధాంతం, వర్ణవ్యవస్థకు వైద్యవృత్తి వ్యతిరేకమైనది. ఎవరికి ఎలా రాసిపెట్టి ఉంటే అలా జరుగుతుంది. వారి పూర్వ జన్మసుకృతాన్ని బట్టి ప్రస్తుత జన్మలో నడక, ఫలితం ఉంటుందని కర్మసిద్ధాంతం చెప్తుంది. జబ్బులు ప్రమాదాలు అన్ని అందులో భాగమే కానీ వైద్యులు వైద్యం చేసి నయం చేస్తారు. బతికిస్తారు. ఇది కర్మసిద్ధాంతాన్ని దెబ్బతీసేది. ప్రకృతి నియామాలపై పనిచేసేది. ద్విజులు, శూద్రులుగా విభజితమైన వర్ణవ్యవస్థలో శూద్రుల్ని ముట్టరాదు. మనిషిగానే గుర్తించకూడదు. కానీ వైద్య వృత్తిలో జబ్బుతో వచ్చే వారికి ఎవరైనా సరే వైద్యం చేయాలన్నది ప్రాథమిక సూత్రం. శూద్రునికైనా వైద్యం చేస్తారు. ఇది వర్ణవ్యవస్థ నిషేదాలు, కట్టుబాట్లకు విరుద్ధం. జబ్బుకు వైద్యమనేది తార్కిక జ్ఞానాన్ని ప్రశ్నించే తత్వాన్ని పెంచుతోంది. ఇది నాటి పాలక వర్గాలు, భావవాదులకు గిట్టలేదు. వైద్యుల్ని శతృవులుగా చూశారు. నిషేధిత జాబితాలో పెట్టారు. మనుస్మృతిలో సైతం అడుగడుగునా ఇదే కన్పిస్తుంది. బ్రాహ్మణుల ఇంట్లో తద్దినానికి వైద్యుల్ని పిలవరాదు. వ్యభిచారులు. మాంస విక్రేతలు. చెప్పులు, బట్టలు కుట్టేవారు, బట్టలు ఉతికే వారితో పాటు వైద్యులు ఛండాలురతో సమానం. (మనుస్మృతి 1 అ:204 శ్లో) బ్రాహ్మలైనప్పటికీ వైద్యవృత్తిపై బ్రతికేవారు బ్రాహ్మలు కాదని వశిష్ఠుడు పేర్కొన్నాడు. దీన్ని బట్టే ఛాందసులు, భావవాదులకు వైద్యుల పట్ల ఎంత విరోధమో ద్యోతకమౌతుంది. ధ్యానమార్గం వారు శ్వాసమీద ధ్యాసపై ఎంత శ్రద్ధవహిస్తారో మాంసాహారం మానండి– శాఖహారం తినండి అనే ప్రచారంపైనా అంతే శ్రద్ధ వహిస్తారు. తమ రచనల్లో కోళ్లు, మేకల ఫోటోలు పెట్టి మమ్మల్ని తినొద్దని వేడుకున్నట్లు రాస్తారు. కుళ్లిన మాంసపు ఫోటోలు పెట్టి ఇంత నీచమైనవి కడుపులోకి పంపడం అవసరమా? అంటూ ప్రశ్నిస్తారు. మాంసాహారంపైనే కాదు మాంసాహారులు, విక్రేతలపైనా అసహ్యం పుట్టేంతగా ప్రచారం కావిస్తున్నారు. ధ్యాన ప్రక్రియను ప్రబోధించిన వారిలో అగ్రగణ్యుడు బుద్ధుడు. ఆయన మాంసాహారి. బౌద్ధులు మాంసాహారులు (కొన్నిశాఖల వారు శాకాహారులు) బుద్ధుడు కుళ్లిన అడవిపంది మాంసం తినడం వల్ల మరణించాడని చరిత్రలో ఉంది. అనార్యుల నుండి ధ్యాన ప్రక్రియ పరంపరంగా వచ్చిందనుకున్నాం. నాటి నుండి నేటివరకూ ఈ ప్రక్రియను అవలంబించిన వారంతా శాకాహారులు కాదు. వీరిలాగే వైద్యుల పట్ల తీవ్ర వ్యతిరేకత వ్యక్తం చేసిన మనువు సైతం ఏఏ వర్గాల వారు ఏఏ మాంసం తినొచ్చు. దానివల్ల ఫలితాలేమిటో చెప్పుకొచ్చాడు. అన్ని వర్గాల వారు ఎద్దు, పంది, తాబేలు మాంసాలు తినొచ్చు. (మ.స్మృ 5 అ.18 శ్లో) శ్రాద్ధం, మధుపర్కాలయందు మాంసం తినని బ్రహ్మడు 21 సార్లు పశుయోని ద్వారా పుడ్తాడు. (మ.స్మృ 46 అ. 35 శ్లో) ఏ నెల ఏ మాంసం తినొచ్చో చెప్పాడు. 12 నెలలు 12 రకాల మాంసాల పేర్లు వశిష్ఠుడు చెప్పాడు. మంచి పుత్రుడు కావాలంటే ఎద్దుమాంసం తినాలని యజ్ఞవల్క్యుడు చెప్పాడు.

ఈ మాటలు చెప్పిన వారిలో అత్యధికులు ధ్యాన మార్గీయులే.

మరో విడ్డూరమైన వాదన ఏమంటే మాంసం తింటే హింసా వాదులు, శాకాహారం తింటే అహింసావాదులుగా ఉంటారని నిర్ధారించేశారు. ఓ పక్క ధ్యాన మార్గంలో వైశేషికుల్ని ఉదహరిస్తారు. కానీ వారు చెప్పిన " ఆచరణే జ్ఞానానికి కొలబద్ద ' అన్న అంశాన్ని పట్టించుకోరు. శాకాహారులంతా అహింసా పరులైతే వారు చీమకు కూడా హానిచేయకూడదు. (కానీ అర్జునుడు యుద్ధం చేయొచ్చు. ఎంతమందినైనా చంపొచ్చు. అంటూ సమర్థిస్తారు.) శాకాహారులు అహింసాపరులని నిరూపించగలరా? నరరూప రాక్షసుడు మానవజాతి హననానికి పాల్పడిన హిట్లరు శాకాహారి. వేల సంవత్సరాల వర్ణవ్యవస్థలో శూద్రుల్ని, పంచముల్ని నిర్దాక్షిణ్యంగా అణచినప్పుడు ఎందరో బలయ్యారు. ఈ మారణ కాండకు పాల్పడిన వారిలో శాకాహారులు లేరని చెప్పగలరా? మతోన్మాదుల దాడులు, హత్యాకాండలకు పాల్పడిన వారంతా మాంసాహారులేనని తేల్చగలరా? విశ్వమానవాళి కోసం ప్రాణాలను సైతం అర్పించిన చేగువేరా మాంసాహారి. సాటి మనిషికి హాని తలపెట్టడం, కుట్రలు, కుతంత్రాలకు దూరంగా ఉండే ఆదివాసీల్లో అత్యధికులు మాంసాహారులే. వీరు ప్రబోధించే అహింస కేవలం జంతువుల పట్ల తప్ప సాటి మానవుల పట్ల కాదు. పత్రిజీ రాసిన పుస్తకంలో ఎవరెలా కొట్టుకుంటే మనకెందుకు? మనపని మనం చేసుకోవడం ఉత్తమం. అందుకు మన సమయం వృథా చేసుకోవద్దని హితవు పలికారు.

"ప్రతీ తత్త్వానికి ఓ వర్గ ప్రయోజనం ఉంటుంది. అందుకు ఇదేమీ మినహాయింపు కాదు. ఇందుకు పత్రిజీ రచనలే తార్కాణం. ధ్యాన సిద్ధిలో అందరితో పనులు చేయించుకోవచ్చు. అంటే దానర్థం కార్మికులు తమ డిమాండ్లను పరిష్కరించే యజమానితో చేయించుకోవడం కాదు. యజమానులు (పెట్టుబడిదారులు) కార్మికులతో చక్కగా పనిచేయించుకోవచ్చు."

ధ్యానం ద్వారా అందర్నీ వశపర్చుకోవచ్చని చెప్తారు. నువ్వో ఇంటర్వ్యూకి వెళ్తావు. అక్కడ నీకు తెల్సిన ప్రశ్నలే అడగాలని ధ్యానం చేస్తే ఆ అధికారి ఆ ప్రశ్నలే వేస్తాడు. పాఠాలు చెప్పే లెక్చరర్, విద్యార్థులు తన మాట వినాలని కోరుకుని ధ్యానం చేస్తే వారంతా లెక్చరర్ ఆధీనంలోకి వచ్చేస్తారు. ఇలా ఏపనైనా కావాలనుకుని ధ్యానం చేస్తే ఆ పని అయిపోతుంది. ఎంతటి వారైనా మన ఆధీనంలోకి వచ్చేస్తారు. ఇదీ వారి వాచాలత్వం. ఇంతకీ ఈ సంగతి ధ్యానం చేయనివారికి తెలీదని వక్కాణించారు. వీరు శ్రమయేవజయతే, అనే మాట వినలేదనుకోలేం. కృషి ఉంటేనే మనుష్యులు మహాపురుషులౌతారన్న సంగతి తెలీదనుకోలేం. ఒకపని పూర్తి కావాలంటే కృషి, భౌతిక పరిస్థితుల సానుకూలత ఉండాలి. కృషి మన చేతుల్లో ఉంటుంది. భౌతిక పరిస్థితులు మన చేతుల్లో ఉంటాయని చెప్పలేం. వర్షంలో తడవకుండా గమ్యం చేరాలంటే గొడుగుగానీ, రెయిన్‌కోటుగానీ ఉండాలి. కానీ తడవకుండా గమ్యం చేరాలని ధ్యానం చేస్తే సాధ్యం కాదు. భౌతిక పరిస్థితుల్ని సానుకూలంగా మార్చుకోవాలి. మేనెలలో 45 డిగ్రీల ఎండలో వెళ్తూ వడగాడ్పు తగల కూడదని కోరుకుంటే సరిపోదు. ఆ భౌతిక పరిస్థితులకు తగ్గ జాగ్రత్తలు తీసుకోవాలి. భావవాదులైనా ఆచరణలో భౌతిక వాదులేనన్నది సత్యం. అంతా ధ్యానులుగా మారి పోవాలని వీరు ధ్యానం చేసుకుంటూ కూర్చుంటే ప్రజలు ధ్యానం చేయరని తెలిసే, వీరు వివిధ రూపాల్లో తమ ప్రయత్నాలు చేస్తున్నారు. దీన్ని బట్టి ధ్యానంతో అంతా మన అధీనులౌతారన్నది ఎంత అసృతమో వెల్లడౌతున్నది.

ప్రతీ తత్త్వానికి ఓ వర్గ ప్రయోజనం ఉంటుంది. అందుకు ఇదేమీ మినహాయింపు కాదు. ఇందుకు పత్రిజీ రచనలే తార్కాణం. ధ్యాన సిద్ధిలో అందరితో పనులు చేయించుకోవచ్చు. అంటే దానర్థం కార్మికులు తమ డిమాండ్లను పరిష్కరించే యజమానితో చేయించుకోవడం కాదు. యజమానులు (పెట్టుబడిదారులు) కార్మికులతో చక్కగా పనిచేయించుకోవచ్చు. మన దగ్గర పని చేసేవాళ్లను మనం పరిపాలిస్తాం. వశీకరణ చేసుకుంటాం. మన పనులకు వారు చక్కగా ఉపయోగపడ్తారు. వాళ్ళున్నది అందుకోసమే. కానీ వారు ఆ పనులు చేయడం లేదు. సమ్మెలు చేస్తున్నారు. కనుక ఇంట్లో కూర్చుని ధ్యానం చేస్తే అంతా నీకు దాసోహమౌతారు. ఆ విధంగా మన జీవితాలను సస్యశ్యామలం చేసుకుందాం. ఇది పత్రిజీ ఇచ్చిన సందేశం. ఈ సందేశం ఎవరి కోసమో స్పష్టమౌతున్నది. ధ్యాన మార్గం ఎవరికి మేలు చేస్తుందో, ఎవరికి కీడు చేస్తుందో పత్రిజీ తేల్చేశారు.

కాబట్టి శ్రమజీవుల్లారా వీరు చెప్పే ధ్యాన మార్గం ఎవరి జీవితాలను సస్యశ్యామలం చేయడానికో గుర్తించండి. భౌతిక ప్రక్రియను పచ్చి భావవాద ప్రక్రియగా మార్చి, ఆత్మ పరమాత్మను చేరే మార్గం అంటూ పాలకవర్గాలకు ఊడిగం చేయించడమే వీరిలక్ష్యం. అందుకే ఈ ప్రక్రియలో వాస్తవాలు గుర్తించాలి. ప్రశ్నించే తత్త్వాన్ని అలవర్చుకోవాలి. భారతీయ భౌతిక వాదులు నెలకొల్పిన ఈ భౌతిక ప్రక్రియను మన ఏకాగ్రత, శరీర ధారుడ్యాన్ని పెంచుకునేలా వినియోగించుకుందాం.

❋

**'మార్క్సిస్టు'కు మీ సందేహాలు రాయండి!**

'మార్క్సిస్టు' సైద్ధాంతిక మాసపత్రికలో సిపిఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు ప్రతినెలా పాఠకుల సందేహాలకు సమాధానాలిస్తున్న సంగతి మీకు తెలుసు. ప్రస్తుత అంతర్జాతీయ, జాతీయ, రాష్ట్ర రాజకీయ పరిణామాలపై మీ సందేహాలను నివృత్తి చేసుకు నేందుకు ప్రశ్నలను రాసి పంపండి! ప్రతినెలా 20వ తేదీలోపు మీ ప్రశ్నలు మాకు చేరితే తదుపరి సంచికలో రాఘవులు సమాధానాలు లభిస్తాయి. మీ ప్రశ్నలు అందాల్సిన చిరునామా!

**ఎడిటర్,** 'మార్క్సిస్టు' సైద్ధాంతిక మాసపత్రిక,
ప్రజాశక్తి ప్రెస్,గవర్నరుపేట, విజయవాడ-2

# హింసాకాండకు ప్రతిఘటన

ఇషితా ముఖోపాధ్యాయ్



రచయిత్రి జాదవ్‌పూర్ యూనివర్శిటీ ప్రొఫెసర్

రాష్ట్రంలో జరుగుతున్న అత్యాచారాలకు, వాటిపట్ల రాష్ట్ర ప్రభుత్వం చూపుతున్న ఉదాసీన వైఖరికి నిరసనగా పోరాడుతున్న గ్రామస్తులు, ఉద్యమకారులు కామ్‌దుని సామూహిక అత్యాచారం కేసులో సెషన్స్ కోర్టు ఇచ్చిన న్యాయపరమైన తీర్పును స్వాగతించారు.

మహిళలపై జరుగుతున్న నేరాలలో దేశంలోని మిగిలిన రాష్ట్రాలతో పోలిస్తే పశ్చిమ బెంగాల్ (హాస్యాస్పదంగా) అగ్రస్థానంలో ఉన్నది. ఒక ఉన్నతాధికారి పరిశీలించిన నివేదిక తయారుచేశారు. గత నాలుగు సంవత్సరాలుగా తరచుగా మహిళలపై జరుగుతున్న హింసకు సంబంధించిన ఉదంతాలు రాష్ట్రంలో ప్రధానాంశాలుగా వస్తున్నాయి. 2014లో ప్రచురించబడిన జాతీయ నేర రికార్డుల బ్యూరో (ఎన్‌సిఆర్‌బి) గణాంకాల ప్రకారం దేశంలో మహిళలపై జరిగే నేరాలలో 12.67 శాతంతో బెంగాల్ ఈ జాబితాలో అగ్రస్థానంలో ఉన్నది.

2016 జనవరిలో కామ్‌దుని గ్యాంగ్‌రేప్ కేసులో దోషులుగా ఆరోపణ చేయబడిన ఎనిమిదిమందిలో ఆరుగురుని సెషన్స్ కోర్టు నేరస్తులుగా నిర్ధారించింది. సంబంధిత పౌరులు, మీడియా ద్వారా వెలుగులోకి తీసుకురాబడిన అనేక అత్యాచార కేసులలో ఇదొకటి. కలకత్తా నుండి సుమారు 30 కిలోమీటర్ల దూరంలో ఉన్న కామ్‌దుని గ్రామంలో 2013లో ఒక కళాశాల విద్యార్థినిపై అత్యాచారం చేసి హత్య చేయటం, మహిళలపై జరుగుతున్న అత్యాచారాలపై పాలక పార్టీ చూపుతున్న ఉదాసీన వైఖరికి వ్యతిరేకంగా ప్రజలు పెద్దసంఖ్యలో కదిలి నిరసన వ్యక్తం చేశారు. రాజకీయ సంబంధాలు కలిగి వున్న ఇటువంటి నేరస్తులు రాష్ట్ర పరిపాలన యంత్రాంగం, రాష్ట్రంలోని పాలకపార్టీ నుండి రక్షణ పొందుతున్నారని కూడా స్పష్టమైంది.

ఈ పార్క్‌స్ట్రీట్ రేప్ కేసు విషయంలో ఇది స్పష్టమైంది. ఆ కేసును దర్యాప్తు చేస్తున్న పోలీసు అధికారి బదిలీ చేయబడ్డాడు. అధికార పార్టీకి సంబంధించిన ఒక కార్యకర్తకు ఆశ్రయం కల్పించారు. పార్క్‌స్ట్రీట్, కామ్‌దుని రెండు కేసుల్లోనూ తృణమూల్ కాంగ్రెస్ నాయకులు కొందరు నేరస్తులతో కలిసిమెలిసి వ్యవహరిస్తున్నట్లు స్పష్టమైంది. న్యాయం పేరుతో తమపార్టీ కార్యకర్తలను కొందరు వేధిస్తున్నారని మమతా బెనర్జీ చేసిన ప్రకటనలు ఈ ఆరోపణలు తప్పని రుజువు చేయలేదు.

పై సంఘటనలు లింగ ఆధారిత హింసకు చెందిన చెదురుమదురు సంఘటనలు కాదు. 2013లో మధ్యంగ్రామ్ (కొల్‌కత్తా యొక్క ఉత్తరం అంచున వైపు పట్టణం)లో వలస కార్మికుని కూతుర్ని ఐదుగురు పురుషులు ఆమె ఇంటినుండి కొద్దిదూరం తీసుకెళ్ళి మానభంగం చేశారు. ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసి ఇంటికి తిరిగి వస్తుండగా మరలా మానభంగం చేశారు. తనపై దాడిచేసిన వారినుండి అనేకసార్లు బెదిరింపులు వచ్చిన తర్వాత ఆమె ఆత్మహత్య చేసుకున్నది. (టెలిగ్రాఫ్ బ్యూరో 2013)

2012లో బర్ధమాన్ జిల్లాలోని కట్వాలో ఒక మహిళ రైలులో ప్రయాణించే సమయంలో సాటి ప్రయాణీకులు ప్రతిఘటించే ప్రయత్నం చేసినా ఆమె కుమార్తె ముందే మానభంగం చేశారు. ఈ సంఘటన కల్పితం అని, తన ప్రభుత్వాన్ని అపఖ్యాతి పాలు చేయటానికి ఉపయోగించుకొంటున్నారని సిపిఎం మమతా బెనర్జీ చెప్పారు.(ఎన్‌డి టీవీ 2012) ఈ కేసులో నిందితులలో ఐదుగురిని నిర్దోషులుగా విడుదల చేశారు. తరువాత పబ్లిక్ ప్రాసిక్యూటర్ రాజీనామా సమర్పించారు.

## రాజకీయ-సామాజిక అసహనం

పౌర సమాజం కార్యకర్తల నుండి రాజకీయ చైతన్యం ఉన్న పౌరుల వరకు సామాన్య ప్రజల మద్దతు వలన 2011లో టిఎంసి అధికారంలోకి వచ్చింది. అయితే తృణమూల్ కాంగ్రెస్ చాలాకాలం అసహన రాజకీయాల వలన, ముఖ్యంగా మహిళలకు వ్యతిరేకంగా జరుగుతున్న హింసవలన ఎక్కువకాలం వారిని తనవైపు నిలుకుకోలేకపోయింది.

అలాంటి అసహన వాతావరణంలో ఒంటరిగా పోరాడటం సాధ్యం కాదని కామ్‌దుని ప్రజలు గ్రహించారు. తంపా కయాల్ , మౌసుమి కయాల్, ప్రదీప్ ముఖ్యోపాధ్యాయ ముగ్గురూ కలిసి కామ్‌దుని ప్రతిబద్ మంచ్ ( కామ్‌దుని ప్రజా సంఘటన)ను ఏర్పాటు చేసి ఆ ప్రాంతంలో రాజకీయంగా శక్తివంతులుగా ఉన్న వారికి వ్యతిరేకంగా రూపుదిద్దుకొంటున్న ప్రజా ఉద్యమంలో మాట్లాడగలిగిన వారిగా ముందు కొచ్చారు. తంప, మౌసుమిలు అత్యాచార బాధితురాలు చదివే పాఠశాల విద్యార్థులు. మాస్టర్ మోశాయ్‌గా అందురూ పిలిచే ముఖోపాధ్యాయ్ ఆ స్కూలులో ఉపాధ్యాయునిగా పనిచేస్తున్నారు. కొద్దికాలంలోనే కొన్ని మహిళా సంఘాలు, ప్రత్యేకించి వామపక్ష సంఘాలు కూడా వారితో కలిశాయి. కామ్‌దునిలోని రేప్ బాధితురాలి కుటుం బాన్ని మమతా బెనర్జీ సందర్శించారు. తంపా కళ్యాణ్, మౌసుమి కళ్యాణ్ ఆమెతో మాట్లాడాలని కోరుతున్నారు. మమతాబెనర్జీ వారిని మావోయి స్టులుగా (ఎబిపి ఆనంద్ 2013) అవమానిం చారని చెప్పారు. ఈ కామ్‌దుని సంఘటనపై నిరసనలు వ్యక్తంచేసే వారిపై అసహనం వ్యక్తం చేయటంలో ఇది మొదట సంఘటన. ముఖ్య మంత్రి నేతృత్వంలో ఉన్న రాజకీయ సంఘటన బలహీన పడటంలో కూడా ఇది ప్రారంభంగా ఉంది.

అధికారపార్టీ వైఖరికి వ్యతిరేకంగా వామపక్ష రాజకీయ పార్టీలు, స్వతంత్ర మహిళా సంఘాలు పెద్దఎత్తున నిరసనలు ప్రారంభించాయి. రాష్ట్రంలో ప్రజల సమూహాలన్నీ విస్తృత కూటమిగా ఏర్పడి వారిని అనుసరించారు. ఫేస్‌బుక్‌లో సిఎంకు వ్యతిరేకంగా వ్యంగ్య పోస్టర్స్ వేసినందుకు జైలులో పెట్టబడిన

జాదవ్‌పూర్ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ అంబికేష్ మహాపాత్ర, నేతృత్వంలో ఆమ్రా అక్రాంటో (మేము దాడికి గురైనవారం), ఇతరులు ఈ రకమైన రాజకీయ, సామాజిక అసహనానికి గురయ్యారు. కామ్‌దుని ప్రతిబాద్ మంచ్ లోని వారిసంఖ్య క్రమంగా పెరిగింది. ఆమ్రా అక్రాంటో కూడా ఉద్యమం లో భాగస్వాములయారు. వామపక్ష సంఘటనను అధికారం నుండి తొలగించటానికి టియంసి పక్షాన నిలిచిన అనేక సంస్థలు భిన్నస్వరంతో మాట్లాడటం ప్రారంభించాయి. తృణమూల్ కాంగ్రెస్ కార్యకర్తలు బాధిత కుటుంబాన్ని కామ్‌దుని గ్రామం వదిలి వెళ్ళమని బెదిరించ డం ప్రారంభించారు. తంపా కయాల్, మౌసు మి కయాల్, మాస్టర్ మౌసాయ్‌లను వేరుచేసి, గ్రామానికి శతృవులుగా ముద్రవేశారు.

ప్రదీప్ ముఖ్యోపాధ్యాయ్ పనిచేస్తున్న ప్రాథమిక పాఠశాల అథారిటీ అయిన రాష్ట్ర ప్రాథమిక పాఠశాల మండలి ఒక షోకాజ్ నోటీసు జారీ చేసింది. కానీ నిరసనలు వ్యక్తం చేస్తున్న ప్రజల బలం ముమ్మరం కావటంతో గ్రామస్తులు ప్రధాన నిందితుడైన అన్సారీ ఆలీని పట్టు కొని పోలీసులకు అప్పగించారు.

**గ్రామం గురించి...**

రాష్ట్ర ప్రజల ప్రతిఘటనకు ప్రధాన కేంద్రం అయిన కామ్‌దుని గ్రామం గురించి పరిచయం చేయటం అవసరం. కామ్‌దుని ఉత్తరం 24 పరిగణాల జిల్లాల్లోని బరాసత్-2 బ్లాక్, కిర్తిపూర్-2 గ్రామ పంచాయతీలో ఉన్నది. కలకత్తాకు సమీపంగా ఉండి వేగంగా అభివృద్ధి చెందుతున్న మధ్యమ్‌గ్రామ్‌కి ఇది అనుసంధానంగా ఉన్నది. మెట్రోపాలిటన్ నగరానికి దగ్గరగా ఉన్నప్పటికీ ప్రాథమిక మౌలిక సదుపాయాలు లేక, తీవ్రంగా నిర్లక్ష్యం చేయబడిన ప్రాంతంగా ఉంది. ఎక్కువమంది వ్యవసాయేతర పనుల్లో పాల్గొంటున్న కామ్‌దుని ప్రధానంగా ఒక మత్స్యకార గ్రామం. చేపలు పట్టటం ద్వారా వస్తున్న ఆదాయం గ్రామస్తులు కొంతమేరకు ఆర్థికంగా స్వయం సమృద్ధిని సాధించటానికి తోడ్పడుతున్నది. గ్రామంలో ప్రాథమిక, ఉన్నత పాఠశాలలున్నాయి. గ్రామానికి ఐదు కిలోమీటర్ల దూరంలో ఒక కాలేజీ ఉన్నది. కానీ ఎక్కువ మంది గ్రామ మహిళలు ఉన్న సెకండరి పాఠశాల స్థాయి వరకు మాత్రమే చదువుకున్నారు. వారు ఎక్కువ ఆదాయం వచ్చే ఉత్పత్తి కార్యకలాపాల్లో పాల్గొనటు లేదు.

**“ రాష్ట్రంలో ఉండే ప్రగతిశీల శక్తులు మరియు లంపెన్‌రాజ్‌లో నివసిస్తున్న, న్యాయపరంగా పితృస్వామిక పద్ధతులలో జీవిస్తూ అణచివేతకు గురవుతున్న మహిళలు అభ్యు దయ శక్తులను కదిలించటం, వారిని తమతో నడిపించటం చేయగలరని స్పష్టం చేస్తున్నారు. ”**



అత్యాచారం, హత్యకు వ్యతిరేకంగా నిరసన వ్యక్తం చేస్తున్న ప్రజలు

కానీ గ్రామం క్రమంగా ఫిషింగ్ మాఫియా, దొంగ సారాయి వ్యాపారుల ఆధిపత్యంలోకి పోయింది. ఈ గ్రామంలో అధికార పార్టీ యొక్క పునాదిని ఏర్పరిచారు. గ్రామంలో వీరే అధికారపార్టికి పునాదిగా ఉంటూ నేరపూరిత కార్యకలాపాలలో భాగస్వాములవుతున్నారు. గ్రామంలో సంఘ వ్యతిరేక కార్యకలాపాలు పెరగటంతో మహిళలు భయంతో ఇళ్ళలోనే ఉంటున్నారు. పాలకపార్టీ, లంపెన్స్‌కు వ్యతిరేకంగా గ్రామంలోని మహిళలు తీవ్రమైన ప్రతిఘటనకు పూనుకున్నారు. ఉన్నత విద్య, పనిలో భాగస్వాములు కావటం ద్వారా మాత్రమే మహిళలు తమ హక్కులను అమలు జరిపించుకోగలరని ప్రచారంలో ఉన్న అభిప్రాయం సరైనది కాదని ఇది రుజువు చేస్తున్నది. రాష్ట్రంలో ఉండే ప్రగతిశీల శక్తులు మరియు లంపెన్‌రాజ్‌లో నివసిస్తున్న న్యాయపరంగా పితృస్వామిక పద్ధతులలో జీవిస్తూ అణచివేతకు గురవుతున్న మహిళలు అభ్యుదయ శక్తులను కదిలించటం, వారిని తమతో నడిపించటం చేయగలరని స్పష్టం చేస్తున్నారు.

రాష్ట్రంలో కామ్‌దుని ప్రతిబాద్ మంచ్, రాష్ట్రంలోని ప్రజాస్వామ్య శక్తులు సెషన్స్ కోర్టు తీర్పును స్వాగతించాయి. ఈ కేసులో ముగ్గురు నిందితులకు ఉరిశిక్ష, ముగ్గురు నిదితులకు జీవితఖైదు వేశారు. కానీ నేరం మోపబడిన ప్రక్క గ్రామంలో నివసించే తృణమూల్ కాంగ్రెస్ పార్టీ అనుయాయులైన ఇద్దరు ముద్దాయిలను నిర్దోషులుగా వదిలిపెట్టారు. తీవ్రంగా భయాందోళనలకు గురవుతున్న గ్రామస్తులుఈ తీర్పు ఇచ్చే ముందురోజు పోలీసు రక్షణ కోరారు.

**ముగింపు...**

సారాంశంగా చూస్తే చదువుకున్న మహిళలు ఒక సమూహంగా ఏర్పడి పితృస్వామ్యాన్ని సవాలుచేసి రాజకీయ మద్దత్తు ఉన్న గుండాలు చేస్తున్న హింసాకాండను ఎదుర్కొని నిలబడ్డారు. తమ విధానాలు వ్యతిరేకిస్తున్న మహిళలను తృణమూల్ కాంగ్రెస్ తిరుగుబాటుదారులుగా పిలుస్తున్నది. తమ విధానాలకు వ్యతిరేకంగా ఎవరు మాట్లాడినా వారిపై అధికార పార్టీ చూపుతున్న రాజకీయ అసహనానికి వ్యతిరేకంగా ఎన్నికలలో టియంసికి ఓట్లు వేసిన ఈ మహిళలు రాష్ట్రంలోని వామపక్ష ప్రజా తంత్ర శక్తులతో కలిసి తమగొంతు వినిపిస్తు న్నారు.

ఈ విధమైన అన్ని కేసులలోనూ బాధితులకు న్యాయం చేయాలని కోరుతూ పశ్చిమ బెంగాల్‌లో పోరాటం కొనసాగుతుంది. కామ్‌దుని కేసులో ఇద్దరు నిందితులను విడుదల చేయటానికి వ్యతిరేకంగా ఉన్నత న్యాయ స్థానానికి వెళ్ళి పోరాటాన్ని కొనసాగించటానికి ప్రయత్నం చేస్తున్నారు. ఎన్నికైన సభ్యులలో మాత్రమే ప్రజాస్వామ్యం ఉండదని, ప్రజల గొంతుల్లో ఉంటుందని ఈ పోరాటం ద్వారా మరోసారి రుజువు చేసింది.

**(అనువాదం: సింహాద్రి ప్రతిభ)**

# గేట్స్ ఫౌండేషన్ దాతృత్వ పెట్టుబడి వ్యూహం

డా॥ ఊర్వశి అనేజా



రచయిత్రి ప్రముఖ విద్యావేత్త

పెట్టుబడిదారీ సేవాసంస్థల కార్యకలాపాలపై సరియైన చర్చ జరపకుండా, నియంత్రణా చర్యలు తీసుకోకుండా ఉంటే, అవి పాక్షికమైన పరిష్కారాలు మాత్రమే చూపగలవు. కొన్ని సందర్భాలలో అవి ఏ లక్ష్యం కోసం పనిచేస్తున్నాయని భావిస్తున్నామో ఆ లక్ష్యాలను దిగమింగే అవకాశాలూ ఎక్కువ. గేట్స్ ఫౌండేషన్ కూడా ఆ కోవకి చెందినదే.

**బిల్‌గేట్స్ ఫౌండేషన్...**

ధనిక, పేద దేశాలలో ప్రజలకు మందులు అందుబాటులో లేకుండా పోవడానికి ప్రధాన కారణం ధరలు. హెపటైటిస్-సి చికిత్సకు వినియోగంలోకి వచ్చిన అద్భుతమైన మందు సోల్వాడీ. కానీ ధర 84 వేల డాలర్లు. 84 రోజులు ఖచ్చితంగా వాడాలి. ఐబెన్, బ్రెస్ట్ క్యాన్సర్‌కి చక్కగా ఉపయోగపడే మందు. నెల రోజులకి దాని ఖరీదు 9850 డాలర్లు. ఆక్స్‌ఫామ్స్ అంచనాల ప్రకారం అభివృద్ధి చెందుతున్న దేశాలలో దాదాపు రెండు మిలియన్‌ల మందికి ఇది అవసరం ఉన్నా కొనలేని పరిస్థితిలో ఉన్నారు.

భారతదేశం ఎంతోకాలం నుండి ప్రపంచ ఫార్మసీ దేశంగా నిలిచింది. అంతర్గతంగా ఈ దేశంలో ఉన్న మేధో హక్కుల చట్టం, మందుల కంపెనీలు ఇప్పటికే అందుబాటులో ఉన్నా అన్ని రకాల మందులని జనరిక్ రూపంలో అతి తక్కువ ధరలకే ఉత్పత్తి చేసి ప్రపంచ దేశాలన్నిటికీ ఎగుమతి చేసే అవకాశం కల్పించింది. కానీ ఇది ఎక్కువకాలం నిలబడలేదు. ప్రస్తుతమున్న చట్టాల రూపాన్ని తమకను గుణంగా మార్చాలని అమెరికా మరియు యూరోపియన్ యూనియన్ దేశాలు నరేంద్ర మోడీ ప్రభుత్వంపై తీవ్రమైన ఒత్తిడి చేస్తున్నాయి. ఈ సంవత్సరం మార్చి నెలలో భారత ప్రభుత్వం అమెరికన్ వాణిజ్య అధికారికి అభయహస్తమిచ్చి, ఇక నుండి దేశంలో వాణిజ్య అవసరాలకి ఉత్పత్తి చేసే వాటన్నింటిలోనూ కంపల్సరీ లైసెన్సింగ్ విధానం అమలు చేయమని ప్రకటించారు. వాస్తవానికి, ఇదేమంత ఆశ్చర్యపడాల్సిన సంగతి కాదు. ఎందుకంటే మోడీగారు మేకిన్ ఇండియా పిలుపుతో విదేశీ పెట్టుబడులను ఆకర్షించటానికి ఎగబడుతూ, వాషింగ్టన్‌కి సన్నిహితంగా మెలుగుతున్నారు కాబట్టి ఇది అనివార్యం. ప్రజారోగ్యానికి కేటాయింపులు చేసే విషయంలో ఎవరు అధికారంలోకి వచ్చినా దానికి పెద్దపీట వేయలేదు కాబట్టి ఇటువంటి హానికర నిర్ణయాలు ఊహించినవే. ప్రపంచంలోనే అత్యంత తక్కువ కేటాయింపులు ప్రజారోగ్యానికి ఇస్తున్నది మన ప్రభుత్వమే. స్థూల జాతీయోత్పత్తిలో కేవలం ఒక శాతం పైన మాత్రమే ఖర్చుపెడుతున్నారు.

**పేటెంట్లు - ప్రశ్నలు**

అభివృద్ధి చెందుతున్న దేశాలలో ప్రజారోగ్యానికి సర్వసాధారణ కేటాయింపులు లేదా తక్కువ కేటాయింపులు జరుగుతున్నాయి. సంపూర్ణ ప్రజారోగ్యానికి మిగిలిన వెలితిని స్వచ్ఛంద సంస్థలు, ఆరోగ్య కార్యకర్తలు, ప్రయివేటు వారు అందించే ప్రయత్నం చేస్తున్నారు. ప్రపంచ ఆరోగ్యరంగంలో పెద్దన్న పాత్ర పోషించేస్థాయికి ఈ మధ్యకాలంలో "బెబిల్ మరియు మెలిండా గేట్స్ ఫౌండేషన్ (బి.ఎమ్.జి.ఎఫ్.) ఎదిగింది. ప్రపంచవ్యాప్తంగా ప్రజారోగ్య కార్యక్రమాలకి గ్రాంట్లుగా 32.9 బిలియన్ డాలర్లు బి.ఎం.జి.ఎఫ్. అందించింది. ప్రపంచ ఆరోగ్యసంస్థ యొక్క (డబ్ల్యుటిఓ) బడ్జెట్ 2014-15కి 4 బిలియన్ డాలర్లు. దాన్ని బట్టి గేట్స్ ఫౌండేషన్‌ను అడగాల్సిన సమయం వచ్చింది. ప్రపంచ ఆరోగ్య వ్యవస్థలో ఉన్న సవాళ్ళకి వారి సూచనలేంటి? అలాగే మందులపై పేటెంట్ హక్కుల గురించి వారి అభిప్రాయం తెలియజేయాలి.

చాలాకాలంగా బిల్‌గేట్స్ ఫౌండేషన్ దృఢమైన మేధోసంపత్తి హక్కులు ఉండాలని బలంగా వాదిస్తూ ఉంది. ఎంత దూరం వెళ్ళిందంటే, మేధోసంపత్తి హక్కులను పరిమితం చేస్తే అది కమ్యూనిజానికి దారితీస్తుందని ఆక్రోశించింది. గతంలో ఎన్నడూ లేనంతగా ఈనాడు మేధోసంపత్తి హక్కులను బలపరిచే ఆర్థికవ్యవస్థలు ఎక్కువయ్యాయి. ప్రపంచ వ్యాప్తంగా గతకాలంతో పోలిస్తే చాలా కొద్ది మందే కమ్యూనిస్టులు మిగిలారు. ఈ కాలంలో కొంతమంది నయా ఆధునిక కమ్యూనిస్టులు తయారయ్యారు. వీరు సంగీత విద్వాంసులకి, సినిమా దర్శకులకి, సాఫ్ట్‌వేర్ తయారీదారులకు ఇచ్చే బహుమతులు రద్దు చేయాలని కోరుకుంటున్నారు. ఇది ఉండటం వారికి నచ్చదం లేదు. అసలు మొత్తం మైక్రోసాఫ్ట్ ప్రపంచం నిర్మించబడిందే ఈ పేటెంట వల్ల. ఇటీవలనే 2007లో మైక్రోసాఫ్ట్ కంపెనీ జి-8 దేశాలను పేటెంట్ హక్కుల చట్టాలను మరింత కఠినం చేయమని కోరింది. గేట్స్ ఫౌండేషన్ కూడా అదే వాదనతో ఉంది. గేట్స్ ఫౌండేషన్ అసోసియేట్ డైరెక్టర్ జనరల్ ఎరిక్ ఐవర్సన్ మాట్లాడుతూ తమ ఫౌండేషన్ యొక్క మూలం మేధోసంపత్తి హక్కులను సంపూర్ణంగా గౌరవించమని ప్రకటించాడు. మేము వాటి ప్రాముఖ్యతను, ప్రాధాన్యతను గుర్తించాము కనుకనే ఏ పరిశ్రమ అయితే ప్రొడక్టలను తయారు చేసి అభివృద్ధి చెందిన, చెందుతున్న దేశాలతో వాణిజ్యం చేస్తున్నాయో వాటికి మద్దతుగా ఉంటున్నాము.

ఒకవైపు గేట్స్ ఫౌండేషన్ ప్రపంచంలో అతి పెద్ద ఆరోగ్య సంస్థగా నిలిచింది. రెండోవైపు తక్కువ ఖరీదుతో ఆరోగ్య రక్షణనందించే అంశాలను అది పూర్తిగా వ్యతిరేకిస్తోంది. ఆరోగ్యం అనేది ప్రజల ప్రాథమిక హక్కు. అది ప్రజలకు నిత్యావసర సరుకు. మైక్రోసాఫ్ట్‌కి, వినోద రంగానికి వర్తింప చేసే మేధోసంపత్తి

హక్కులు ఆరోగ్యానికి అంటగట్టడం దారుణం.

పెద్ద పెద్ద ఫార్మా కంపెనీలు వాదించేది ఏమిటంటే తాము పరిశోధనలలో పెట్టే పెట్టుబడి మందుల ధరలు ఎక్కువగా ఉండటానికి కారణమని, నూతన ఆవిష్కరణలకు రక్షణ, బహుమతులు వంటివి ఇవ్వాలని, ఇవి లేకపోతే ఈ రంగం కుంచించుకుపోతుందని పేర్కొన్నారు. అంతేకాదు మరింత మంది ప్రజలకి మందులు అందుబాటులోకి రావన్నారు. కాని అనేక అధ్యయనాలు, సర్వేలు దీనికి భిన్నంగా చెబుతున్నాయి. "ది కారవాన్" అనే పత్రికలో 2013లో ఇలా వాదించారు" నోవార్టిస్ అనే కంపెనీ "గ్లీవాక్" అనే క్యాన్సర్ ఔషధాన్ని తయారు చేయడానికి వంద మిలియన్ డాలర్లు ఖర్చుపెట్టారు. వాస్తవమేమిటంటే, ప్రపంచ వ్యాప్తంగా ఈ మందుకి 13 రోజులలో అమ్మిన దానితో ఈ మొత్తం సమానం. ఈ మధ్యనే వాల్‌స్ట్రీట్ జర్నల్ విలేకరి జొనాథన్ రాకాఫ్ మాట్లాడుతూ, ఫైజర్ కంపెనీ తయారుచేసే క్యాన్సర్ మందు "ఇబేన్" వాడితే నెలకి అయ్యే ఖర్చు 9,850 డాలర్లు అవుతుందని, కాని అదంతా పరిశోధనల ఖర్చు కానే కాదని, తనకుప్రత్యర్థిగా ఉన్న నొవార్టిన్ మందుల ధరలను బట్టి, అలాగే ఎంత రేటుకయితే డాక్టర్లు, ఇన్సూరెన్స్ కంపెనీలు మద్దతు కొనసాగిస్తాయో అవి దృష్టిలో పెట్టుకొని ధర నిర్ణయిస్తున్నారని తెలిపారు. ఏ మందయినా నెలకి పదివేల డాల ర్లు దాటితే వాటికి ఈ వర్గాల నుండి మద్దతు ఉండదు.

మేధోసంపత్తి హక్కులు నూతన ఆవిష్కరణలకు స్ఫూర్తిగా ఉంటాయనే వాదన సరియైనది కాదు. హక్కులు పొందినవారికి అవకాశాలు బాగా ఉన్నాయనే పరిస్థితి కనిపిస్తేనే ఆ హక్కులు నూతన ఆవిష్కరణలకు నాంది అవుతున్నాయి. అందువల్లనే ప్రపంచవ్యాప్తంగా తొంభైశాతం వ్యాధులకి కేవలం పదిశాతం నిధులను మాత్రమే కేటాయిస్తున్నారు. ఇది ఎక్కువగా అభివృద్ధి చెందుతున్న దేశాలలో పరిస్థితి. అదే సందర్భంలో తొంభై శాతం ప్రపంచ ఆరోగ్య నిధులు, వనరులు, కేవలం పదిశాతం ప్రజల వ్యాధులకే కేటాయించబడుతున్నాయి. మొటిమలు, జుట్టు రాలిపోవడం వంటి చిన్న చిన్న జబ్బులకి ప్రతి ఏడాది మందులు వస్తూనే ఉన్నాయి. కానీ క్షయ వ్యాధికి, అతినిద్రకి మటుకు కొత్తమందులు రావు.

### గేట్స్ భిన్న దృక్పధాలు

ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రముఖ ఆలోచనాపరులందరూ మందుల పేటెంట్లపై పునరాలోచించాలని సూచిస్తున్నారు. అలాగే మందుల నూతన ఆవిష్కరణలకి బహుమతులు, ఆరోగ్య ప్రభావ మూలనిధిలాంటివి ప్రత్యామ్నాయంగా తేవాలని సూచిస్తున్నారు. గేట్స్ ఫౌండేషన్ దీనికి ఎలా స్పందిస్తుంది? ప్రపంచ ఆరోగ్య పటానికి కొత్తగా తనంతట తానే రక్షకుడిగా ప్రకటించుకున్న గేట్స్ ఒకవైపు మేధోసంపత్తి హక్కులను సమర్థిస్తూ, రెండోవైపు ప్రపంచ ఆరోగ్య సూచిక లక్ష్యాలను తానే దిగమింగే విధంగా చేస్తున్నాడు.

> **"ది కారవాన్" అనే పత్రికలో 2013లో ఇలా వాదించారు నోవార్టిస్ అనే కంపెనీ "గ్లీవాక్" అనే క్యాన్సర్ ఔషధాన్ని తయారు చేయడానికి వంద మిలియన్ డాలర్లు ఖర్చుపెట్టారు. వాస్తవమేమిటంటే, ప్రపంచ వ్యాప్తంగా ఈ మందుకి 13 రోజులలో అమ్మిన దానితో ఈ మొత్తం సమానం."**



బిల్‌గేట్స్, మిలిందా గేట్స్

ఇటీవలికాలంలో సర్వే నిర్వహించిన గ్లోబల్ జస్టిస్ సంస్థ, 2014లో బి.ఎం.జి.ఎఫ్. (గేట్స్) ట్రస్ట్ ఫార్మాస్యూటికల్ మరియు రసాయనాల కంపెనీలలో భారీగా పెట్టుబడులు పెట్టిందని తెలిపింది. అవి డౌకెమికల్స్, బి.వి. ఎస్.ఎఫ్, గ్లాక్సోస్మిత్‌క్లైన్, నొవార్టిస్ మరియు ఫైజర్. ఈ రిపోర్టు ప్రకారం గేట్స్ ఫౌండేషన్ నేరుగా ఈ సంస్థల నుండి లాభాలు పొందుతున్నది. అందువల్లనే వీరు మేధోసంపత్తి హక్కులకి మద్దతుదారుగా ఉండి పెద్ద ఫార్మా కంపెనీలతో కుమ్మక్కయ్యారని నివేదికలో విమర్శించారు. కాని గేట్స్ అనేది ఏమిటంటే, మాకు ప్రపంచవ్యాప్తంగా అనుసంధానం ఉండటం వలన మా ప్రాజెక్టుల ద్వారా వచ్చే విజ్ఞానం, సమాచారం త్వరితగతంగా అంతటికీ విస్తరింపజేస్తున్నామని, ఆ అభివృద్ధిని అందరికీ అందుబాటు ధరలలో లభ్యమయ్యేలా అందజేస్తామని ప్రకటించారు. కానీ దీనిమీద ఎటువంటి రిపోర్టులు లేవు. పరిశీలించి వాటి ఫలితాలను విశ్లేషించే యంత్రాంగం కూడా లేదు.

కాకపోతే ఒక నిజాన్ని ఒప్పుకోవాలి. గేట్స్ ఫౌండేషన్, ఫార్మా కంపెనీలచే నిర్లక్ష్యానికి గురైన కొన్ని వ్యాధుల మీద పరిశోధలకి క్రమం తప్పకుండా నిధులు అందిస్తున్నది. ఆ మందులు కొన్నా తమకి లాభాలు రావని ఫార్మా కంపెనీలు వదిలేశాయి. అలాగే "గావి అలయెన్స్" అనే ప్రభుత్వ-ప్రయివేటు భాగస్వామ్యంతో పనిచేసే సంస్థకి మిలియన్ల డాలర్లు నిధులు అందిస్తోంది. ఈ సంస్థ పేద దేశాలలో ఇమ్యునైజేషన్ పెంచేందుకు కృషి చేస్తోంది. ప్రపంచ ఆరోగ్య సంస్థకి కూడా నిధులు అందిస్తోంది. కాని అవి ఎక్కువగా పోలియో నివారణ, శిశు సంరక్షణకి కేటాయించబడుతున్నాయి.

కాకపోతే, పెద్ద పెద్ద ఫార్మా కంపెనీలకి, గేట్స్ ఫౌండేషన్‌కి ఉన్న సంబంధమే అసలు సమస్య. ప్రపంచ ఆరోగ్య ఎజెండా మీద వీటి ప్రభావం ఎక్కువగా ఉంది. కాబట్టే మనం ఆందోళన పడుతున్నాం. 2008లో ప్రపంచ ఆరోగ్య సంస్థ మాజీ మలేరియా నివారణ ప్రాజెక్టు అధికారి డా॥ అరాటాకొచ్చి జి.ఎం. జి.ఎఫ్‌ను నిందిస్తూ, భిన్నమైన, అనేక రూపాల లో వస్తున్న శాస్త్ర సమాచారాన్ని తొక్కివేస్తున్నదని, దానివలన ప్రపంచ ఆరోగ్య పాలసీ నిర్ణయాలపై

**"గ్లోబల్ హెల్త్‌వాచ్ అనే ప్రపంచ సంస్థ కూడా దాదాపు ఇదే అభిప్రాయాన్ని వెళ్ళబుచ్చింది. అంతర్జాతీయ ఆరోగ్య విధాన రూపకల్పనలో గేట్స్ ఫౌండేషన్ పెత్తందారీ పాత్ర పోషించటం వలన మౌలికమైన ప్రజాస్వామ్యయుత అభిప్రాయాలకి, ప్రజలకు జవాబుదారీగా ఉండటమనేది తుడిచిపెట్టుకుపోయాయని విమర్శించింది."**

తీవ్రమైన వ్యతిరేక ప్రభావం కలుగుతుందని తెలిపారు. గ్లోబల్ హెల్త్‌వాచ్ అనే ప్రపంచ సంస్థ కూడా దాదాపు ఇదే అభిప్రాయాన్ని వెళ్ళ బుచ్చింది. అంతర్జాతీయ ఆరోగ్య విధాన రూపకల్పనలో గేట్స్ ఫౌండేషన్ పెత్తందారీ పాత్ర పోషించటం వలన మౌలికమైన ప్రజాస్వామ్యయుత అభిప్రాయాలకి, ప్రజలకు జవాబు దారీగాఉండటమనేది తుడిచిపెట్టుకుపోయాయని విమర్శించింది.

కానీ మరోవైపు ప్రయివేటు పెట్టుబడి, దాతృత్వం వంటివే ప్రపంచవ్యాప్త అభివృద్ధి అవసరాలకు ముఖ్యభూమిక పోషించగలవనే సిద్ధాంతం పెద్దఎత్తున వ్యాపిస్తోంది. గత సంవత్సరం అడిస్ అబాబాలో జరిగిన అంతర్జాతీయ అభివృద్ధి – పెట్టుబడి సమావేశంలో ఇదే అభిప్రాయం వ్యక్తీకరించబడింది. వాణిజ్య సూత్రాలను, మార్కెట్ పరిష్కారాలను అనుసంధానం చేసి అభివృద్ధి పెట్టుబడి ఉపయోగించాలని, అలాగే లాభం అనే ప్రోత్సాహకంతో నిరంతర మరియు వినూత్నమైన పరిష్కారాలు కనుగొని ప్రపంచ అభివృద్ధి సాధించాలని అభిప్రాయపడింది. ఈ ఉద్దేశ్యంతో మనం గమనిస్తే, బి.ఎం.జి.ఎఫ్. ఆగమనం, విధానాలు దానినొక స్నేహహస్తంగాకుండా దాతృత్వపు పెట్టుబడిదారీ విధానంగా చూడాలి. అందువలనే, బి.ఎం.జి.ఎఫ్. గుడ్డిగా డబ్బుని దానం చేయటం లేదు. మార్కెట్ పవర్‌ను ఉపయోగించుకొని, దానివలన లాభపడేవిధంగా పెట్టుబడులను సమీక్షలు చేస్తూ, వాణిజ్య కిటుకులు ఉపయోగించి, రాబడి ఎంత వస్తుందో అంచనా వేసుకొనే దానం చేస్తోంది.

దాతృత్వపు పెట్టుబడిదారీ విధానం ద్వారా ప్రపంచ అభివృద్ధి కార్యక్రమాలకి కావల్సిన నిధులు అందుతున్నాయన్నది నిస్సందేహంగా నిజమే. కానీ దీనివలన ఏ రకమైన అభివృద్ధి పోకడలు వస్తున్నాయో, వాటి ప్రభావం ఎలా ఉంటుందో గమనించాల్సిన అవసరముంది.

బి.ఎం.జి.ఎఫ్. దాతృత్వపు పెట్టుబడి, మిగతా కార్పొరేట్ రంగ పెట్టుబడులానే, తన దిశా నిర్దేశాలను ఎంచుకుంటుంది. గ్లోబల్ హెల్త్ వాచ్ రిపోర్ట్ విమర్శించినట్లు ఈ ఫౌండేషన్ యొక్క కార్పొరేట్ సంస్కృతి, పెట్టుబడుల మీద రాబడి ఉండాలనే లక్షణాల వలన దాని పెట్టుబడులన్నీ బయో–మెడికల్ మరియు సాంకేతిక పరిష్కారాల మార్గాలవైపే మళ్ళించబడుతున్నాయి.

కానీ ఈ అడ్డదారి విధానం వలన అభివృద్ధి చెందుతున్న ప్రపంచంలో అత్యవసరంగా ఆరోగ్యానికి అవసరమైన అభివృద్ధి ఏమీ జరగదు. ఈ విమర్శలకు స్పందిస్తూ 2005లో "గాది" తన కార్యక్రమాల పట్టికలో ఆరోగ్య విధాన బలోపేత విభాగాన్ని ఏర్పరి చింది. అయినా 2000 నుండి 2013 దాకా దాని మొత్తం పెట్టుబడులలో ఆరోగ్యానికి కేటాయింపులు 10 నుండి 11 శాతం దాటలేదు.

దాతృత్వం అనేది మౌలికంగా అసమానతలమీద పారంపరతలను బట్టి ఉంటుంది. కెనడియన్ సామాజిక శాస్త్రవేత్త ప్రకారం, అసమానతలు అనేవి దాతృత్వానికి కారణాలను, వనరులను సృష్టిస్తోంది. దీనికి ఉదాహరణలకి, అభివృద్ధి చెందుతున్న దేశాలు సంవత్సరానికి సుమారు వందల బిలియన్ డాలర్లు పెద్ద బహుళజాతి కంపెనీ పన్నుల ఎగవేత ద్వారా నష్టపోతున్నాయి. ఈ డబ్బులు ఉంటే అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి ఉండవచ్చు. 2012 అమెరికా సెనెట్ రిపోర్టు ప్రకారం మైక్రోసాఫ్ట్ కంపెనీకి లభ్యమ్యయ్యే దేశం ఆవల సబ్సిడీల వలన అది సుమారు 4.5 బిలియన్ డాలర్లు సంవత్సరానికి పన్నులు దాటవేయగలుగుతోంది. ఇది గేట్స్ ఫౌండేషన్ సాలీన ఇచ్చే గ్రాంట్ 3.5 బిలియన్ డాలర్ల కన్నా ఎక్కువ.

విశాలంగా ఆలోచిస్తే, ఇదేదో ఒక్క బి.ఎమ్.జి.ఎఫ్.పై విమర్శ చేయటానికి కాదు. అభివృద్ధి కార్యక్రమాలకి, ప్రయివేటు ఫైనాన్స్, దాతృత్వ పెట్టుబడిని అంగీకరించడం ఎంత వరకు సబబు. అలాగే వాటి పరిమితు లను, వాటిపై నియంత్రణ, నిఘా అనేవి ఖచ్చితంగా పెద్దఎత్తున పెట్టుబడి పెట్టకుండా, రక్షణ కవచాలను సృష్టించకుండా, ప్రయివేటు లేదా దాతృత్వ పెట్టుబడులపై సరియైన చర్చ జరపకుండా ఉంటే, బి.ఎం.జి.ఎఫ్. వంటి సంస్థలు పాక్షికంగా కొన్ని సమస్యలకి పరిష్కారాలు చూపగలవేమో గాని మొత్తంగా కాదు అనేది సత్యం. అలాగే చాలా సందర్భాలలో అవి ఏ వ్యవస్థనైతే మార్చాలనే లక్ష్యంతో వచ్చాయో వాటినే దిగమింగేసే పరిస్థితి దాపురిస్తోంది.

**(అనువాదం : ఎల్.ఎన్. భారవి)**

## 'మార్క్సిస్టు' పై మీ అభిప్రాయాలు తెలపండి!

'మార్క్సిస్టు' సైద్ధాంతిక మాసపత్రిక పైనా, పత్రికలోని నిర్దిష్ట వ్యాసాలపైనా మీ అభిప్రాయాలనూ, సూచనలనూ ఆహ్వానిస్తున్నాం. ఆయా వ్యాసాలపై మీరు చర్చించాల్సిన అంశాలున్నా, అదనపు సమాచారమున్నా క్లుప్తంగా రాసి పంపండి.

మీ లేఖలు అందాల్సిన చిరునామా!
**ఎడిటర్, 'మార్క్సిస్టు'** సైద్ధాంతిక మాసపత్రిక
ప్రజాశక్తి ప్రెస్, గవర్నరుపేట, విజయవాడ-2

# ఒక వ్యవస్థలో అంతర్భాగంగా కులాన్ని పరిశీలించాలి

**సందేహాలు సమాధానాలు**



**- బి.వి.రాఘవులు**

**ప్రశ్న : భారతదేశంలో కొంతకాలంగా సంకీర్ణ ప్రభుత్వాలు నడుస్తున్నాయి. పూర్తి మెజార్టీ ఉన్నప్పటికి కూడ కమ్యూనిస్టులు ఇతర పార్టీలను కలుపుకొని పాలనను చెక్కుచెదరకుండ నడుపుతున్నారు. అలాగే బూర్జువా- భూస్వామ్య పార్టీలు కూడ సంకీర్ణ ప్రభుత్వాలను నడుపుతున్నాయి.**

**ఇందులో చిన్న పార్టీలు కూడ పాలనలో భాగస్తులై ఉన్నారు. అంటే ఆయా పార్టీలకు ఓట్లు వేసి గెలిపించిన ప్రజలకు ప్రతినిధులు పాలనలో ఉండే విధానం నడుస్తున్నది.**

**ఇది "దామాషా" పద్ధతి అని, అన్ని వర్గాల ప్రజలు భాగస్వాములై ఉండాలని కోరే ఆలోచనకు పోతుందని నేను అనుకొంటున్నాను. మీరేమంటారు ? నమస్కారాలతో...**

**– ఇలిపిళ్ల సూర్యనారాయణ, విజయవాడ**

మనదేశంలో ఇంకా అనేక ఇతర దేశాలలోను సంకీర్ణ ప్రభుత్వాలు ఏర్పడుతున్నాయి. పరిపాలిస్తున్నాయి. కొన్ని సందర్భాలలో ఈ ప్రభుత్వాలు అస్థిరం పాలవుతున్నా కొన్ని చోట్ల స్థిరంగానే పరిపాలిస్తున్నాయి. అయితే 'దామాషా' పద్ధతిలో ఎన్నికలు జరిగి ఏర్పడే ప్రభుత్వాలకు ఈ ప్రభుత్వాలకు పోలిక ఖచ్చితంగా ఉంటుందనుకోరాదు. 'దామాషా' అన్నది ఎన్నికల నిర్వహణ పద్ధతి. 'సంకీర్ణం ' అన్నది ఎన్నికలయిన తర్వాత ప్రభుత్వం ఏర్పడడానికి సంబంధించిన పద్ధతి. రెండూ ఒకటి కాదు. దామాషా పద్ధతిలో ఎన్నికలు జరిగినపుడు ఒకే పార్టీ ప్రభుత్వం ఏర్పడవచ్చు. సంకీర్ణ ప్రభుత్వమూ ఏర్పడవచ్చు. 'దామాషా' పద్ధతిలో ఒకపార్టీకి వచ్చిన ఓట్లను బట్టి దానికి రావలసిన స్థానాలను నిర్ణయిస్తారు. ఈ పద్ధతిలో ఏ పార్టీకయినా అత్యధికంగా ఓట్లువస్తే దామాషా ప్రాతిపదికన స్థానాలు కూడా అధికంగా వస్తాయి. ఆ పార్టీ ఒంటరిగా ప్రభుత్వం ఏర్పాటు చేయవచ్చు. అలా రాని ఎడల కొన్ని పార్టీలు కలిసి సంకీర్ణ ప్రభుత్వాన్ని ఏర్పరచాల్సి ఉంటుంది. ఇప్పుడు మన దేశంలో జరుగుతున్న ఎన్నికల పద్ధతిలో కొన్ని సందర్భాలలో సంకీర్ణ ప్రభుత్వాలు ఏర్పడుతున్నా ఆ పార్టీలకు దామాషా పద్ధతిలో స్థానాలు వస్తున్నాయని చెప్పలేం. అలాగే కొన్ని సందర్భాలలో వచ్చిన ఓట్లను బట్టి దామాషా పద్ధతిలో అయితే కొన్ని సీట్లు వచ్చే అవకాశం ఉన్నా ఒక్క సీటు కూడా రాని సందర్భాలున్నాయి. అలాగే వచ్చిన ఓట్లకు దామాషా పద్ధతిలో అయితే ఎక్కువ సీట్లు రావాల్సి సందర్భాలలో తక్కువ సీట్లు, తక్కువ సీట్లు రావాల్సిన సందర్భాలలో ఎక్కువ సీట్లు వచ్చిన సందర్భాలు మనం చూస్తున్నాం. అందువలన ప్రస్తుతం ఎన్నికల పద్ధతిలో సంకీర్ణ ప్రభుత్వాలు ఏర్పడుతున్నప్పటికి ఈ పరిస్థితిని 'దామాషా' పద్ధతిలో పోల్చలేం. ఇప్పుడు మనం అనుసరిస్తున్నది. ఎవరు ముందు గీత దాటితే వారిదే స్థానం అన్న విధానం.

## పార్టీ పూర్తికాలం కార్యకర్తల రాజకీయ తరగతులలో వచ్చిన ప్రశ్నలు

**ప్రశ్న: కులం ఉపరితలంలో భాగం అని గతం నుండి చెప్పుకుంటున్నాం. ఇపుడు కులం పునాదిలో భాగం అని కొందరు వాదిస్తున్నారు. ఆర్థిక అంశాలకు సంబంధించని కులం పునాదిలో భాగం ఎలా అవుతుంది?**

'కులం' అన్నదాన్ని ఒంటరిగా చూడకూడదు. దాన్ని ఒకవ్యవస్థలో అంతర్భాగంగా చూస్తేనే మనకు అర్థం అవుతుంది. అందువలన మనం కులవ్యవస్థను ఆ దృష్టితో పరిశీలన చెయ్యాలి. కులవ్యవస్థ పెట్టుబడిదారీ విధానపు పూర్వ సమాజ వర్గవ్యవస్థ యొక్క రూపం. అలాగే ఆ సమాజం యొక్క ఉత్పత్తి సంబంధాలలో ఒక భాగం. పెట్టుబడి ధారీ విధానం అభివృద్ధి అయ్యే కొద్ది, పాత వ్యవస్థ ఉత్పత్తి సంబంధాలు ఛిద్రమై అదృశ్యం అయ్యే కొద్ది కులవ్యవస్థ ఉత్పత్తి సంబంధాల రూపాన్ని కోల్పోతుంది. భావజాల రూపంగా కొనసాగుతుంది. ప్రస్తుతం భారతదేశంలో పెట్టుబడి దారీ ఉత్పత్తి సంబంధాలు ఆధిపత్య స్థాయికి వస్తున్నాయి. అయినా పాత ఉత్పత్తి వ్యవస్థల ఉత్పత్తి సంబంధాలు కొన్నిచోట్ల తీవ్రంగా, కొన్ని చోట్ల బలహీనంగా ఇంకా కొనసాగుతున్నాయి. అటువంటి చోట్ల కులవ్యవస్థ ఉత్పత్తి సంబంధాలలో భాగంగా కొంతమేరకు, కొన్ని రూపాల వ్యవస్థల సంబంధాలను తనలో ఇముడ్చుకుని మిగిలివున్న కులవ్యవస్థ ఉత్పత్తి సంబంధాలను నాశనం చేయడం, కులవ్యవస్థ భావజాలాన్ని నిర్మూలించడం పెట్టుబడి దారీ వ్యవస్థను కూలదోయడంపై ఆధారపడి ఉన్నది.

పెట్టుబడిదారి వ్యవస్థ అభివృద్ధి మూలంగా ఉత్పత్తి వ్యవస్థలో ఉత్పత్తి సంబంధా లలో వచ్చిన మార్పులను గమనంలో ఉంచుకునే కులవ్యవస్థ, వర్ణవ్యవస్థ ప్రస్తుతం ఒకటికాదు. కులం, వర్గం ఒకటి కాదు అని నిర్ధారిస్తున్నాం.

**ప్రశ్న : పార్టీలో కేంద్రీకృత ప్రజాస్వామ్యాన్ని సక్రమంగా అమలు చేయలేకపోయామని చెప్పుకుంటున్నాం. భారతదేశంలో ఉన్న కులవ్యవస్థ, ఇతర సామాజిక పరిస్థితులు ఇందుకు కారణమా? లేక ఇతర కారణాల వలన అమలు చేయలేకపోతున్నామా?**

కేంద్రీకృత ప్రజాస్వామ్యం అమలు అనేది ఒక సాంకేతిక సమస్య కాదు. భారతదేశంలోని విభిన్న సామాజిక ఆర్థిక, పరిపాలనా పరిస్థితులు (విభిన్నభాషలు, రాష్ట్రాలు, మతాలు, తెగలు, భౌగోళిక పరిస్థితులు, కులాలు, వలసపాలనా ప్రభావాలు వగైరా) మూలంగా దేశవ్యాపితంగా ఏకీకృత నిర్ణయాలు జేయడం చాలా సంక్లిష్టతతో మాడుకున్న విషయం. పరిస్థితులు వేగంగా మారుతున్నపుడు సహజంగా ఈ సంక్లిష్టత పార్టీ చర్యల్లో కూడా వ్యక్తమవుతుంది. భిన్నాభిప్రాయాల రూపంలో, భిన్నమైన అంచనాల రూపంలో వ్యక్తమవుతుంది. ఓపికగా అంతరంగిక ప్రజాస్వామ్యాన్ని ఉపయోగించుకుని, చర్చల ద్వారా ఏకాభిప్రాయానికి రావడానికి పార్టీ ప్రయత్నిస్తుంది. లేదా మహాసభల అంతిమ నిర్ణయానికి లోబడి పార్టీ పనిచేస్తుంది.

భవిష్యత్తులో ఇటువంటి లోపం పునరావృతం కాకుండా కేంద్రకమిటి సహాయంతో రాష్ట్రకమిటి అవసరమైన చర్యలు తీసుకుంటున్నది. రాజకీయ పరిస్థితులు సంక్లిష్టంగా ఉన్నపుడు, బెంగాల్లో లాగా పార్టీ తీవ్ర నిర్బంధాన్ని ఎదుర్కొంటున్నపుడు ఇటువంటి ధోరణులు పొడచూపే అవకాశం ఉంటుంది. అయితే పార్టీ యొక్క పరిపక్వత లోపాలను అర్థం చేసుకుని పరిష్కరించుకోవడంలోనే బయటపడుతుంది. అటువంటి పరిపక్వత పశ్చిమబెంగాల్ పార్టీకి కేంద్ర కమిటికి ఉన్నది.

(మిగతా 35వ పేజీలో)

## నైజాంను మించిన నెహ్రూ సైన్యం నిర్బంధకాండ

జరిగింది. నన్నే శాఖ కార్యదర్శిగా నియమించ డానికి ప్రధాన కారణం ఏడుగురు నిరక్షరాస్యులు. ఒకతను నాకంటే చిన్నవాడు చేదే పుల్లయ్య. అప్పుడే నేను 5వ తరగతి చదివి ఉన్నం దున కార్యదర్శిగా పెట్టారు. ఇప్పటికీ ఆ కామ్రేడ్ ఖమ్మం పట్టణంలో ప్రజానాట్య మండలిలో చురుకుగా పనిచేస్తున్నారు. ఆ రోజులలో గ్రామాలలో దళాలు నిర్భయంగా తిరిగేవి. నెహ్రూ సైన్యాలు వచ్చాక దళాలపైన, గ్రామాలపైన నిఘా పెంచారు. దళాల సమాచారం అందించే ఇన్‌ఫార్మర్‌ల వ్యవస్థను సృష్టించారు. యువకులను హోంగార్డులుగా పెట్టి భృతిని కల్పించి పెద్ద పెద్ద గ్రామాలలో పోలీసు క్యాంపులను ఏర్పాటు చేశారు. అదే సమయంలో దళాలకు సహకరించే వారిని, అనుమానితులను, పెద్ద సంఖ్యలో ప్రజలను క్యాంపులకు తరలించి దళాల ఆచూకీ తెలపమని చిత్రహిం సలకు గురిచేస్తూ ఉండేవారు. అదే రోజుల్లో మా గ్రామంలోని జైలుకెళ్ళిన ఐదుగురు కుటుంబాలలోని పిల్లలు, పెద్దలు, అందరినీ తీసుకెళ్ళి చిత్రహింసలకు గురిచేసినారు. అందులో మా అమ్మ కూడా ఉండేది. బట్టలను ఊడదీసి సిగరెట్లతో మర్మస్థానాలలో కాల్చేవారు. వైద్యం చేయించుకోవడానికి కూడా అవకాశంలేని స్థానాలలో కూడా దుర్మార్గంగా కాల్చినారు. గ్రామాలలో ప్రజలతో గ్రామ కమిటీలు పోలీసులే ఏర్పాటు చేసి గ్రామ నలుమూలలా కాపలా పెట్టేవారు. కాపలా ఉన్నవారి వద్ద తప్పనిసరిగా ఈటెలు, బల్లెలు, కర్రలు, రాళ్ళ కుప్పలు, వడిశెలు ఉండాలని ఆజ్ఞాపించేవారు. అలాగే జరిగేది. కారణం దళాలు గ్రామాల్లోకి రాకుండా నివారించేందుకు ఈ వ్యవస్థను ఏర్పాటు చేశారు. అయినా మేము, ప్రజలు దళాలకి సమాచారం అందిస్తూనే, సహ కరిస్తూ ఉండేవాళ్లం.

ఇదే సమయంలో పోలీసులు కూడా మామూలు దుస్తులలో దళాలలాగా వస్తే పోలీసులకు మాత్రం మేము నికారసుగా ఉన్నట్లుగా మెలిగేవాళ్ళం. ఒక్కోమారు పోలీసులు సివిల్ డ్రస్‌లో వచ్చినా మేము దళం వచ్చిందని కేకలు, బొబ్బలు పెడుతూ దాడికి ఉపక్రమించేవాళ్ళం. తర్వాత వాళ్ళు పెట్టిన ఇన్‌ఫార్మర్లతోటి మేము పోలీసులం అని చెప్పించేవారు. అదే సందర్భాలలో ప్రజలను మభ్యపెట్టే విధంగా ప్రచారం కోసం గాంధీని హైదరాబాద్ నుండి విజయవాడ వరకు రైలు ప్రయాణం చేపిస్తూ మధ్య మధ్యలో రైల్వే స్టేషన్‌లలో ఆపి జనాన్ని సమీకరించి గాంధీ సూక్తులు బోధించేవారు. హిందూ, ముస్లిం భాయ్ భాయ్ అంటూ అంతరానితనం నిర్మూలన మా ధ్యేయం అని హరిజనోద్ధరణ అందరికీ కూడు, గూడు, గుడ్డ, దారిద్ర్య నిర్మూలన వంటి నినాదాలతో మభ్య పెట్టేవారు. అలాగే అరుణ అసఫలి, వినోబాభావే తదితర జాతీయ నాయకులను పెద్ద పెద్ద గ్రామాలలోకి తీసుకొచ్చి బహిరంగ సభలు పెట్టేవారు. ఆనాడు ప్రతి నాయకుడికి ఖద్దర్ చొక్కా ఖద్దర్ పంచా, టోపి ఉండేది. ఈ సందర్భంలోనే దళాలు గ్రామ ప్రజా రక్షణ సైన్య వ్యవస్థను ఏర్పాటు చేసుకున్నాయి. వీటి పని గ్రామం నలుమూలల ఉన్న పెద్ద చెట్లపై సెంట్రీగా ఉండి దూరం నుండే పోలీసులను పసికడుతూ దళాలకు సమాచారం అందించేది. గంట మోగించడమో, లేక ఈల వేడయమో జరిగేది. ఈ సమాచారాన్ని అందిస్తూ సెంట్రీలు కూడా అతి తొందరగా చెట్టుమీది నుండి కిందికి దిగివచ్చే ఏర్పాట్లు చేసుకునేవారం. పై కొమ్మ దగ్గర మోకు తోలు గొట్టం ఉండి దాన్ని పట్టుకొని జర్రున కిందికి దిగే విధంగా నేలకు మూరెడు దూరంగా పెద్ద మండితో ఆగి కిందకు దూకేవాళ్ళం. ఇలాంటి సందర్భంలోనే పోలీసులు చెట్లకున్న మోకులను గమనించి మా గ్రామంలో సెంట్రీలుగా ఉన్నటువంటి వారిని గుర్తించిన వారిలో ఒకరు గొర్రెమచ్చు అజరయ్య 2. మద్ది రాములు. 3. మద్ది తిరుపతయ్య. వీరిని అదుపులోకి తీసుకొని గోవిందాపురం క్యాంపులో పెట్టి చిత్రహింసలు పెట్టారు. ఈ చిత్రహింసలకు గురిచేసినటువంటి మద్ది రాములు, అజరయ్యతో పాటు ఇంకా గోవిందాపురం, ప్రొద్దుటూరు, రేపల్లెవాడ వగైరా గ్రామాల నుండి వీరితోపాటు మరో ఐదుగురిని చిత్రహింసలు పెట్టి చంపి మొత్తం ఏడుగురిని ఒకే కాష్టంమీద గోవిందాపురం గ్రామంలోనే దహనం చేసినారు. ఇందులో మోటారు రామచంద్రయ్యగారిని ప్రాణం ఉండగానే దహనం చేశారు. ఇప్పటికి వారి మృతి చిహ్నంగా ప్రతి సంవత్సరం సంతాప సభలు జరుపుతూనే ఉన్నాము. మా గ్రామంలోని ఇద్దరి పేర్లు గొర్రెముచ్చు అజరయ్య, మద్ది రాములు గార్ల పేర్లు సుందరయ్య గారు రాసిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం పుస్తకాల్లో కూడా పొందుపర్చి ఉన్నవి.

11 రోజులు ఖమ్మం తీగల జైలులో నేను గడిపాను. ఆ సందర్భంలో వేలాది మంది ప్రజలను తీగల జైలుకి తరలించి, వారికి ఆహారంగా దోసకాయలే పెట్టడం జరిగింది. రెండు మూడు రోజులకి ఒకసారి పిరికెడు అన్నం పెట్టవారు. రోజంతా మంచినీళ్ళతోనే ఉండేవాళ్ళం. గుడారాలు వెయ్యిమందికి ఒకటి ఉండేది. మిగులు వారంతా చలిలో బయట ఉండవలసి వచ్చేది. అప్పుడు అనేకమంది విరేచనాలు అయి చనిపోయేవారు. చనిపోయిన వారిని మా చేతులతోనే గోతులు తీయించి పూడ్పించేవాళ్ళు. నేను ఉన్న తీగల జైలులో 11 రోజులలో 20 మందికి పైగా చనిపోయారు. ఒకరోజులోనే ఇద్దరు ముగ్గురు కూడా చనిపోయిన రోజులున్నవి. ఒకే గోతిలోనే అందరినీ పూడ్చేవారం. కామ్రేడ్స్, ఇది రాసేటప్పుడు ఆ సంఘటన గుర్తుకు వచ్చి కళ్ళు చెమ్మగిల్లాయి. ఆ కామ్రేడ్స్ మదిలో మెదిలారు. 11 రోజుల తర్వాత నన్ను హైదరాబాద్ చంచల్‌గూడ జైలుకి తరలించారు. చంచల్‌గూడా జైలులో 40 రోజులు గడిచిన తరువాత నా తల్లి అభ్యర్థన మీద (అనగా ఖమ్మం ముఖ్యమంత్రి బూర్గుల రామకృష్ణారావు వస్తే నా తల్లి దరఖాస్తు పెడితే దానిని గ్రామ కర్ణం పరిశీలనకు పంపి వదలమని సిఫారసు చేస్తే) నన్ను వదిలిపెట్టినారు. ఆ రోజులలో కొన్ని గ్రామాలలో కొంత ప్రశాంతత, దళాలు ఉన్నా కూడా ఉద్యమం వెనుక పట్టు పట్టడం ఇదే సమయంలో ఎన్నికలు రావడం, పీపుల్స్ డెమొక్రటిక్ ఫ్రంట్ పేరుతో ఎన్నికల గుర్తు చేతి గుర్తుగా మధిర నియోజకవర్గంలో కొండబోలు వెంకయ్యగారు గెలవడం, అందులో నా కృషి కూడా ఉన్నది.

గతంలో 1945 నుండి తిరిగి 1956 వరకు నేను ప్రజానాట్యమండలిలో ఒక సభ్యునిగా ఉంటూ నాటికలు, నాటకాలు, బుర్రకథలు, అనేక గొప్ప గొప్ప బహిరంగ సభలలో ప్రదర్శనలు ఇచ్చి మన్ననలు పొందడం జరిగింది. ఇందులో ప్రధానంగా 'రిక్షావోడు' అనే నాటిక మా మల్లాపురం ప్రజానాట్యమండలి టీముకు గొప్ప పేరు తెచ్చింది. ఈ నాటికను ఖమ్మం, విజయవాడ, వత్సవాయి, మధిర, వైరా మీటింగులలో సుందరయ్య, పి. రామ్మూర్తి, సూర్జిత్, రావి నారాయణరెడ్డి, మల్లు వెంకట నరసింహారెడ్డి, నంబూద్రిపాద్, ఎ.కె. గోపాలన్, గౌరిగార్ల చేతుల మీదుగా బహుమతులు అందుకున్నాను. ఇప్పటికి నాతో వల్లాపురం శాఖలో ఉన్న చేదే పుల్లయ్యగారు బ్రతికే ఉన్నాడు. ఆనాడు ప్రజానాట్యమండలిలో కలిసి పనిచేశాం.

ఇప్పటికీ ఆ కామ్రేడ్ ఖమ్మం పట్టణంలో ప్రజానాట్యమండలిలో కొనసాగుతూ ప్రదర్శనలు ఇస్తున్నందుకు ఆనందదాయకంగా ఉంది. ఆ కామ్రేడ్‌కి నా హృదయపూర్వక విప్లవాభివందనాలు. ఆనాడు మా గ్రామాలలో రెండు దళాలుగా తిరిగేవి. ఒక దళంలో మల్లెల వెంకటేశ్వరరావు, మల్లెల విశ్వనాథం, చుండూరు నరసింహారావు, ఉమ్మనేని ఆదినారాయణ,

తుళ్ళూరి సీతారామయ్య, తుళ్ళూరి తులసమ్మ గార్లు ఇంకొంత మందితో ఒక దళం (తుళ్ళూరు సీతారామయ్యగారు తులసమ్మగార్లు భార్యా భర్తలు. ఇప్పటికీ బ్రతికే ఉన్నారు) రెండో దళంగా గిరిప్రసాద్, తాళ్ళూరి భద్రయ్య, కొడిదన సీతారామయ్య, ఇంకొంత మందితో ఉండేది. మధ్య మధ్యలో వీరమాచినేని వరప్రసాద్‌గారు (బొంబాయి ప్రసాద్‌గారు) వస్తూ పోతూ ఉండేవారు.

1949లోనే ఒక విచిత్రమైన సంఘటన జరిగింది. నేను కొరియర్‌గా పని చేస్తూ పత్రికలు అందించేవాడిని. నాతోపాటుగా నాకంటే చిన్న వయసుగల తమ్మవరపు కృష్ణ దళాలకు దూది, అయోడిన్ మందులు వత్స వాయి నుండి తెచ్చి అందించేవాడు. ఒకరోజున పోలీసుల కంటపడినాడు. అతన్ని చూసిన పోలీసు ఇన్‌ఫార్మర్స్ ఖచ్చితంగా దళం ఇక్కడే ఉన్నదని అనుమానించి రౌండప్ చేశారు. అతనిని అరెస్ట్ చేయడానికి సాహసించలేక, భయపడి అప్పగొర్తి, చింతకాని, వైరా, బోనకల్ క్యాంపుల నుండి రెండు వందల మంది పోలీసు లతో అనేక గ్రామాల నుండి ప్రజలను కూడా తరలించి చుట్టుముట్టి, ప్రజలనే ముందుపెట్టి ఒక కృష్ణనే అదుపులోకి తీసుకున్నారు. కృష్ణ చిన్నవాడు అయినందున లాలించి మందలించి డ్రస్సులు, తినుబండారాలు ఇస్తూ గోవిందాపురం పోలీసు క్యాంపులోనే ఉంచుకొంటూ దళాల ఉనికి కోసం చాలా ప్రయత్నం చేశారు. అయినా ప్రయోజనం లేదు. కృష్ణని తరువాత జైలుకి పంపారు. (ఇప్పటికీ బ్రతికే ఉన్నాడు)

1956లో మధిర తాలూకా కమిటీ సభ్యుడిగా కొనసాగుతూ బ్రతుకు దెరువు కోసం బూర్గంపాడు మండలం పినపాక వచ్చాను. అప్పటివరకు ఉమ్మడి కమ్యూనిస్టు పార్టీలో ఉంటూ బంజర సెంటరుగా 8 గ్రామాలకు ఒకే శాఖ కార్యదర్శిగా 5 సంవత్సరాలుగా పని చేశాను. ఈ సందర్భంలో 1962లో బూర్గంపాడు నియోజకవర్గ ఎం.ఎల్.ఎ.గా కంగల బుచ్చయ్యగారి గెలుపుకి సహకరించాను. ఎన్నికల ప్రచారంలో కె.ఎల్., మంచికంటి, గుజ్జుల యలమందారెడ్డి, సరళాదేవి, వెంకటపతిగార్లతో మంచి సాన్నిహిత్యం ఏర్పడింది. అప్పుడు బూర్గంపాడు పార్టీ ఆఫీసు కార్యదర్శిగా నరసింహరాజుగారు ఉన్నారు. ఇదే సందర్భంలో అదనపు భూమిశిస్తు సత్యాగ్రహం కార్యక్రమంలో కొత్తగూడెం కోర్టు 6 నెలలు శిక్షవేస్తే వరంగల్ సెంట్రల్ జైలులో గడిపాను. తరువాత 1964 నుండి 1994 వరకు సిపిఎం పార్టీ బంజర శాఖ కార్యదర్శిగా కొనసాగాను.

1995 నుండి కె.ఎల్. బోడేపూడి ఒత్తిడి మేరకు పూర్తికాలం పనిచేయుటకు పాల్వంచ వచ్చాను. ఇప్పుడు నా వయసు 84 సంవత్సరాలు. నేను ఇప్పటికి నాటి నుండి నేటివరకు పార్టీలో కొనసాగుతూ ఇప్పుడున్న కేడర్‌ని చూస్తూ నాటి భౌతిక దాడుల కంటే, నేటి ప్రపంచీకరణ యొక్క ప్రభావానికి తట్టుకొని నిలబడి పనిచేస్తున్న కేడర్‌ని చూస్తూ వారితో కలిసి మెలిసి తిరుగుతూ ఉన్నందున నాటికంటే నేడే ఎంతో ఆనందదాయకంగా ఉంది. నేటి కార్యకర్తలంతా అసలు పేరు మర్చి పోయి నన్ను తాతయ్యగారు అని పిలుస్తూ ఉంటే ఆ పిలుపుతో ఎంతో అనుభూతిని పొంది నట్లుగా ఉంటుంది.

❉

## హిందూత్వ జాతీయవాదం - మీడియా

(7వ పేజీ తరువాయి)

అసాంజేను గురించి రోజూ ఈ విధంగానే చెప్పేవారికి ఏమైనా ముట్ట చెపుతున్నారా అనేది నాకు సందేహంగానే ఉంది.

"18 వ శతాబ్దంలో ఎడ్మండ్ బర్క్ ప్రసార మాధ్యమాల పాత్రను నాల్గవ స్థంభంగా, శక్తివంతమయిన వారికి అడ్డుకట్టగా వర్ణించారు. అది ఎప్పుడయినా నిజమా? ఇప్పుడయితే అంతులో ఏ మాత్రం నిజంలేదు. ఇప్పుడు మనకు కావల్సింది ఐదోస్థంభం. పర్యవేక్షించే జర్నలిజం, ప్రచారాన్ని ఆపేది అడ్డుకట్టవేసేది కావాలి. అధికారానికి కాదు ప్రజలకు ఏజెం ట్లుగా ఉండాలని యువకులకు నేర్పించేది, జ్ఞాన దాస్యానికి వ్యతిరేకంగా తిరుగుబాటు తిరుగు బావుటా ఎగురవేసేది కావాలి. ఇదే నిజమయిన జర్నలిజం.

మొదటి ప్రపంచ యుద్ధం మొదలయి ఇప్పటికి వందేళ్ళు, ఆనాడు రిపోర్టర్లు మాట్లాడకుండా ఉన్నందుకు, కుమ్మక్కయినందుకు వారిని నైట్‌హుడ్ బిరుదుతో సత్కరించేవారు. ఇందుకు పరాకాష్టగా అప్పటి బ్రిటిష్ ప్రధాని డేవిడ్ లాయిడ్ జార్జి సిపిస్కాట్ అనే మాంచెస్టర్ గార్డియన్ పత్రిక ఎడిటర్ తో ఇలా అన్నారు.

"వాస్తవాలేమిటో ప్రజలకు తెలిస్తే యుద్ధం రేపే ఆగిపో తుంది. కాని ప్రజలకు వాస్తవాలు తెలియదు. తెలిసే అవకాశమే లేదు. " "ఇప్పుడు ప్రజలు తెలుసుకోవలసిన అవసరం వచ్చింది"

మన దేశంలోని జర్నలిస్టులలో కొందరు నిజాయితీపరులను చూసి నేను గర్వపడుతున్నాను. వారంతా పిల్‌గార్ అన్నట్టు పత్రికా రంగాన్ని ఐదవ స్థంభంగా, లేదా అందుకు అనుగుణంగా తీర్చి దిద్దటానికి వారంతా ముందుకురావాలి.

జాతీయతను గురించి ప్రజల సామాజిక చైతన్యాన్ని కుచింప జేసే ప్రమాదకరయిన జాతీయవాదానికి మద్దత్తివ్వటాన్ని, దాని సైద్ధాంతిక పునాదులను బలపరచటాన్ని ప్రచార సాధనాలు తప్పని సరిగా ఆపాలి. అందుకు బదులుగా నిజమయిన భారతీయ చైతన్యాన్ని బలపరచాలి. ప్రజాతంఉన్న భారతదేశం రూపు రేఖలు మారిపోకుండా ఉండేందుకు ఇది అత్యవసరం – ఒక లౌకిక, ప్రజాతంత్ర గణతంత్ర రాజ్యంగా ఉన్న భారతదేశం మితవాద అస హన ఫాసిస్టు "హిందూత్వ రాష్ట్రంగా మారకుండ ఉండటం కోసం దీనిని తక్షణమే చేయాలి.

**అనువాదం: కె. ఉషారాణి**

## సందేహాలు - సమాధానాలు

(33వ పేజీ తరువాయి)

**ప్రశ్న : ఈ సంవత్సరం జరిగిన అసెంబ్లీ ఎన్నికల లో బెంగాల్ పార్టీ అఖిల భారత మహాసభలో నిర్ణయించిన ఎత్తుగడల విధానానికి వ్యతిరేకంగా వ్యవహరించింది. రాజకీయ, సైద్ధాంతిక అనుభవం ఉండి, 34 సంవత్సరాలు అధికారంలో ఉన్న పార్టి అలా వ్యవహరించటానికి కారణ మేమిటి?**

కాంగ్రెస్ పార్టీ బడా బూర్జువా భూస్వామ్య వర్గాల పార్టీ. వర్గస్వభావ రీత్యా అది ప్రజా స్వామిక శక్తిగా కూడా వ్యవహరించడం సాధ్యం కాదు. అందుకే దానితో ఎటువంటి ఎన్నికల పొత్తు, సర్దుబాటు, అవగాహన ఉండకూడదని 21వ పార్టీ మహాసభ నిర్ణయించింది. మతోన్మాదానికి వ్యతిరేకంగా జరిగే పోరాటంలో ఆ పార్టీ కలిసివస్తే అటువంటి కార్యకలాపాల్లో కలిసి పనిజేయడానికి గానీ, కలుపుకుపోవడానికి గానీ పార్టీకి అభ్యంతరం లేదు. అయితే లౌకిక వాద సమస్యలపై కలిసి పని చేయడాన్ని ఎన్నికలలో కలిసి వ్యవహరించడంగా గందరగోళ పర్చకూడదు.

గత అసెంబ్లీ ఎన్నికలలో పార్టీ ఆమోదించిన విధానానికి భిన్నంగా పశ్చిమబెంగాల్ రాష్ట్ర పార్టీ వ్యవహరించింది. పార్టీ కేంద్ర కమిటి ఈ పొరపాటును ఎత్తి చూపింది. ❉

RNI Reg. No. APTEL/2006/17554 Posted on 05-08-2016 Postal Regd. No H/SD/407/16-18

# శ్రామిక మహిళలు నవ యువతను పోరాటయోధులుగా తీర్చిదిద్దగలరు



**- నడెజ్దా కాన్‌స్టాన్‌టినోవ్నా క్రుపస్కయా**

**బా**ల్యంలోని జ్ఞాపకాలు ప్రజలపై ఎంతగాఢమైన ప్రభావాన్ని చూపుతాయో అన్ని దేశాలలోని బూర్జువాలకు బాగాతెలుసు. అందువలన చిన్నతనం నుండి పిల్లలను బూర్జువా చైతన్యంతో పెంచటానికి వారు ప్రయత్నం చేస్తారు. బూర్జువా వర్గానికి సేవచేసే మతగురువులు, ఉపాధ్యాయులు, ఏ విలువలు లేకుండా డబ్బుకోసం కక్కుర్తిపడే బాలల సాహిత్య రచయితలు, అవగాహన ఉన్న సినిమాల యజమానులు అందరూ పూనకం వచ్చిన వారిలా ఇదే లక్ష్యం కోసం పనిచేస్తుంటారు.

బాలలను పాతవ్యవస్థ పట్ల విశ్వాసం కలిగిన వారిగా తీర్చిదిద్దటానికి వారిని విభాగాలుగా చేసి సౌట్స్ విధానాన్ని, క్యాంపులలోకి సమీకరించటం, విహారయాత్రలు నిర్వహించటం, అమ్యూజ్‌మెంట్ గేమ్స్, ఆటలు తదితరాలను ఈ మధ్యకాలంలో బూర్జువాలు నిర్వహిస్తున్నారు. బాలలకు ఆసక్తిని కలిగించే ఇటువంటివి తమను నిశ్శబ్దంగా బూర్జువా వర్గపు భావజాలపు ఉచ్చులోనికి లాగుతున్నాయని, తాము బూర్జువావర్గానికి నమ్మకమైన బానిసలుగా తయారవుతున్నామని వారికి తెలియదు. ఇటలీలోని ఫాసిస్టు బాలల సంస్థ అయిన బెలిల్లా కూడా బాలల స్కౌట్స్ సూత్రాలపైనే ఆధారపడి నడుస్తున్నది.

మరోవైపున కమ్యూనిస్టు పార్టీల సహకారంతో నడుస్తున్న యువ కమ్యూనిస్టుల అంతర్జాతీయ సంస్థ కమ్యూనిస్టు బాలల ఉద్యమాన్ని నిర్వహించటానికి ప్రయత్నం చేస్తున్నాయి. జర్మనీలో బాలల సంఘాలను బాగా నడుపుతున్నారు. విద్యాలయాలలో తమను కొట్టటాన్ని బాలలు అంగీకరించటం లేదు. ప్రార్ధనలు చేయటానికి తిరస్కరిస్తున్నారు. కార్మికుల సమ్మెలకు సహకరిస్తున్నారు. ఆకలిగొన్న బాలల కోసం డబ్బు పోగుచేస్తున్నారు. ఈ పనులన్నీ చేస్తున్నందుకుగానూ తరచుగా వారిని పోలీస్ స్టేషన్లకు తీసుకు వెళుతున్నారు. అక్కడ వారు ధైర్యంగా వ్యవహరిస్తున్నారు. బాలల ఉద్యమం వారిని సమీకరించి ధైర్యవంతులుగా, పోరాటం చేయగలిగిన వారిగా తీర్చిదిద్దుతున్నది.

ఇక్కడ రష్యాలో కూడా బాలల ఉద్యమం అభివృద్ధి కావటం ప్రారరంభమైంది. ఈ ఉద్యమంలో పాల్గొంటున్న 11 నుండి 14 సంవత్సరాల వయసున్న బాలలను నవ యువకులని పిలుస్తున్నారు. వారు ఇప్పటికే 10 లక్షల మందికి పైగా ఉన్నారు. బాలల ఉద్యమాన్ని కార్మిక సంఘాలతో, ప్రతేకంగా మహిళా కార్మికసంఘాలతో సాధ్యమైనంత సన్నిహితంగా ఉంచాలి.

నవ యువకుల కోసం కార్మిక మహిళలు ఏమిచేయగలరు? చైతన్యవంతమైన మహిళా కార్మికులు వర్గ చైతన్యంలేని రైతు, కార్మిక మహిళలలో నవ యువకులంటే ఎవరు అనే అంశాన్ని వివరిస్తూ విస్తృతంగా ఆందోళన నిర్వహించగలరు.

నవయువకుల నిర్మాణంలో పాల్గొనటం వలన కార్మికుల పిల్లలకు తమతోటి కామ్రేడ్స్‌తో స్నేహసంబంధాలు ఏర్పడటంతో పాటు చాలా ఉల్లాసకరమైన అనుభవాలు, కార్మికవర్గ పోరాటాలను గురించిన అవగాహన కలుగుతాయి. .అదివారిలో జిజ్ఞాసను కూడా పెంచుతుంది. తమ పిల్లలను నవ యువజన సంఘాలలో చేర్చటానికి తిరస్కరిస్తూ, చేరిన పిల్లలను తూలనాడే కార్మికవర్గ, రైతాంగ మహిళలకు ఈ విషయాలన్నింటినీ వివరించాలి.

యువజన సంఘాలలో యువకులు చేరటం కన్నా యువతులను చేర్చటం తక్కువ ప్రాధాన్యత కలది కాదని కూడా వారికి తప్పనిసరిగా చెప్పాలి. యువతులను ఇంటికే కట్టిపడవేయకూడదు. అందరితో కలిసి మెలగటం, యువకులతో కలిసి ఒకే సంఘంలో ఉండటం, వారితో సమానంగా వ్యవహరించగలగటం చిన్నతనం నుండే వారికి నేర్పాలి.

నవ యువత తాము పనిచేయాలని, కష్టపడి పనిచేసేవారు కావాలని కోరుకుంటారు. వాస్తవానికి వారు చాలా గొప్ప పనులు చేయాలని కోరుకుంటారు. తమకు ఎవరు బోధించినా వారి నుండి నేర్చుకోవటానికి సిద్ధంగా ఉంటారు. శ్రామిక మహిళలు యువతకు తమ అనుభవాలను నేర్పగల శక్తిని కలిగి ఉంటారు. దృఢమైన పోరాటయోధులుగా, భవిష్యత్‌లో సమర్ధులైన శ్రామికులుగా, మంచి కమ్యూనిస్టులుగా నవ యువకులు ఎదిగే విధంగా సహాయపడటానికి శ్రామిక మహిళలు వేయి మార్గాలను కనిపెట్టగలరు.

**( సోవియట్ యూనియన్ కమ్యూనిస్టు పార్టీ నాయకురాలు నడెజ్దా కాన్‌స్టాన్‌టినోవ్నా క్రుపస్కయా రాసిన ఈ వ్యాసం గ్రేట్ బ్రిటన్ కమ్యూనిస్టు పార్టి పత్రిక వర్కర్స్ వీక్లిలో 3.7.1925వ తేదీన ప్రచురించబడింది)**

Printed and Published by B.V. Raghavulu on behalf of CPIM AP Committee. Printed and Published at Hyderabad Prajasakti Printing Press, Plot Not. 21/1, Azamabad, Hyderabad-20. Phone : 040-27673787. Editor : S. Venkatarao, RNI Reg.No. APTEL/2006/17554. Vol.11, No.4. Published on August 1, 2016